శనివారం
26-10-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 35
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జాతి నిర్మూలనను ఇజ్రాయిల్ ఆపాలి: జోర్డాన్

లండన్: జాతి నిర్మూలనను ఇజ్రాయిల్ తక్షణమే ఆపాలని జోర్డాన్ విదేశాంగ మంత్రి ఐమాన్ సఫాది డిమాండ్ చేశారు. జాతి నిర్మూలనను అడ్డుకునేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్‌తో శుక్రవారం లండన్‌లో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తర గాజాలోని అమానవీయ పరిస్థితులకు విచారిస్తున్నామని అన్నారు. జాతి నిర్మూలనను చూస్తున్నామని, దానిని అంతం చేయాల్సిన అవసరం ఉందని ఐమాన్ పేర్కొన్నారు. ప్రస్తుతం మనం ప్రాంతీయ యుద్ధం అంచున నిలబడ్డామని, ఆ ప్రాంతాన్ని రక్షించాలంటే గాజా, లెబనాన్‌పై ఇజ్రాయిల్ దురాక్రమణను అడ్డుకోవడమే మార్గమని అన్నారు.

ఇసుక సీనరేజి ఫీజు మాఫీ

ప్రభుత్వం ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఉచిత ఇసుక పాలసీలో సీనరేజీ ఫీజు మాఫీ చేస్తూ ఏపీ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేశ్ కుమార్ మీనా జీవో జారీ చేశారు. ఉచిత ఇసుక పాలసీపై ఈ నెల 21వ తేదీన జరిగిన సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలు అమలు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఎటువంటి రుసుం చెల్లించకుండా ఇసుకను నిర్మాణ అవసరాలకు తీసుకు వెళ్లేలా

- మిగతా 2 లో

కశ్మీర్‌లో ఎన్డీఏ విధానాలు విఫలం

రాహుల్

న్యూదిల్లీ: జమ్మూకశ్మీర్‌లో శాంతిభద్రతలు నెలకొల్పడంలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ విధానాలు పూర్తిగా విఫలమయ్యాయని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. గుల్‌మార్గ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రభుత్వానిదే బాధ్యత అని మండిపడ్డారు. లోయలో శాంతిని త్వరగా పునరుద్ధరించి... అక్కడి సైన్యం, పౌరులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'నిరంతర ఉగ్రవాద కార్యకలాపాలు, మన సైనికులపై దాడులు,

- మిగతా 2 లో

సజ్జల పిటిషన్‌పై పోలీసులకు నోటీసు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : లుకౌట్ నోటీసులపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కోర్టు ఆదేశాలు ఉన్నా ఎల్‌వోసీ ఇవ్వడంపై కోర్టు ధిక్కరణ కింద సజ్జల పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం డీజీపీ, ఎస్పీ, కేంద్ర హోం సెక్రటరీలకు నోటీసులు జారీ చేసింది. ఇటీవల సజ్జల విదేశాలకు వెళ్లి తిరిగి ఇండియా వస్తూ ముంబై విమానాశ్రయంలో దిగారు. అక్కడ నుంచి ఏపీకి వచ్చేందుకు మరొక విమానం

- మిగతా 2 లో

కుల గణనతోనే సామాజిక న్యాయం

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

కేంద్రంపై ఒత్తిడి తెస్తామని బీసీ నేతలకు హామీ

దేశవ్యాప్తంగా బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించడానికి సమర్థ చర్యలు చేపట్టడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు.

2లో

దక్షిణాదిపై మోదీ వివక్ష

- దేశ విభజనకు ఎన్డీయే సర్కార్ యత్నం
- కాంగ్రెస్ పాలనలో విప్లవాత్మక మార్పులు
- మూసీ పునరుజ్జీవానికి బీఆర్ఎస్, బీజేపీ అడ్డుపుల్ల
- ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్ ప్రారంభ సభలో రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: కాంగ్రెస్ హయాంలో దక్షిణాదితో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు మేలు జరిగిందని, ఎన్డీయే పాలనలో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ వేదికగా ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్‌ను సీఎం శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన దేశ అభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర- ఆవశ్యకతను వివరించారు. కాంగ్రెస్ హయాంలో దేశాభివృద్ధికి భాక్రానంగల్ నుంచి నాగార్జున సాగర్ వరకు ఎన్నో ప్రాజెక్టులు కట్టారన్నారు. కొత్త వర్సిటీలు ఏర్పాటు చేసి విద్యావ్యవస్థలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇందిరా గాంధీ హయాంలో గరీబీ హఠావోతో ఎన్నో మార్పులు చేశారని, ప్రతి ఒక్కరికీ ఆహారం అందాలని చర్యలు చేపట్టారన్నారు. రాజీవ్ గాంధీ హయాంలో ఓటింగ్ వయసును 21 నుంచి 18 ఏళ్లకు మార్చారన్నారు. కంప్యూటర్లతో ఐటీ విప్లవం తీసుకురావడంతో పాటు టెలికాం రంగంలో మార్పులు తీసుకువచ్చారని వివరించారు. మహాత్మగాంధీ ఆలోచనల ప్రకారం స్థానిక సంస్థల్లో అధికారాలను కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే అని, పీవీ నరసిహారావు దక్షిణాది నుంచి ప్రధానిగా సేవలు అందించిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్‌తో కష్టాల్లో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించిన తెలుగు ఠీవీ మన పీవీ నరసింహారావు అన్నారు. నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ వరకు కాంగ్రెస్ నేతలందరూ ప్రజల మౌలిక అవసరాలు తీర్చాలని ప్రయత్నం చేశారని తెలిపారు. ఆ తరువాత 30 ఏళ్లపాటు కాంగ్రెస్, యూపీఏ హయాంలో ఎన్నో విప్లమాత్మక మార్పులు వచ్చాయన్నారు. నెహ్రూ మొదలుకుని ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నర్సింహారావు, మన్మోహన్ సింగ్ వంటి అనేక మంది కాంగ్రెస్ ప్రధానులు అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. మూడోసారి ప్రధాని అయిన నరేంద్రమోదీ ఈ దేశ ప్రజల కోసం సంస్కరణలు తీసుకొచ్చారని ప్రశ్నించారు. పార్టీలు, ప్రభుత్వాలను విడగొట్టి ప్రభుత్వాలు ఏర్పాటు చేసేందుకు పనిచేశారని ధ్వజమెత్తారు. ఉత్తర, దక్షిణ భారత దేశం అనే విభజన తేవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గతంలో ఉత్తర భారత్ నుంచి ప్రధాని అయితే, దక్షిణాది నుంచి రాష్ట్రపతిని చేసే సంప్రదాయాన్ని కాంగ్రెస్ పాటించిందన్నారు. మోదీ హయాంలో ఇలాంటి సంప్రదాయాన్ని తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. కేవలం దక్షిణాది నుంచి నీలం సంజీవరెడ్డి, అబ్దుల్ కలాం వంటివాళ్లు రాష్ట్రపతి అయ్యారని అన్నారు. ఎన్డీయే సర్కార్ దక్షిణాది నుంచి పెద్ద ఎత్తున పన్నులు తీసుకుంటోంది కానీ తిరిగి ఇచ్చింది ఏమీ లేదని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం చిన్నచూపు చూస్తోందన్నారు. మోదీ అందించిన సహకారం చాలా తక్కువ అన్నారు. నిధులు ఇవ్వకపోయినా ఇక్కడి ఓట్లు కావాలని ఎలా అడుగుతారని నిలదీశారు. కేంద్రానికి రూపాయి పంపిస్తే రూ.40 పైసలు మాత్రమే తిరిగి వెనక్కి వస్తున్నాయని వివరించారు. అదే యూపీ నుంచి పన్నుల ద్వారా కేంద్రానికి రూపాయి వెళ్తే రూ.ఏడు, బీహార్ కు రూ.ఆరు వెనక్కి వస్తున్నాయన్నారు. కేంద్ర నిర్ణయాలను దక్షిణాది రాష్ట్రాలు ఆహ్వానిస్తున్నా నిధుల విషయంలో వివక్ష జరుగుతూనే ఉందన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో బాపూ ఘాట్ అభివృద్ధి

ప్రపంచమంతా హైదరాబాద్ వైపు చూసేలా బాపూ ఘాట్ అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం ప్రకటించారు. ఈసా, మూసా నదులు కలిసే చోట బాపూ ఘాట్ ఉందని, గుజరాత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహంలా బాపూ ఘాట్‌లో గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మూసీ పునరుజ్జీవాన్ని, బాపూ ఘాట్ అభివృద్ధిని బీజేపీ వ్యతిరేకిస్తోందని మండిపడ్డారు. బాపూ ఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామంటే... బీఆర్ఎస్, బీజేపీ ఎందుకు

- మిగతా 2 లో

కొండా సురేఖకు చుక్కెదురు

వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని కోర్టు మండిపాటు

భవిష్యత్‌లో చేయవద్దని ఆదేశం

విశాలాంధ్ర - హైదరాబాద్: మంత్రి కొండా సురేఖ తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన 100 కోట్ల పరువు నష్టం దావా కేసులో ... మంత్రి కొండా సురేఖకు కోర్టు మొట్టికాయలు వేసింది. ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయంటూ మండిపడింది. మహిళ అయుండి బాధ్యతగల మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని పేర్కొంది. కేటీఆర్ పై సురేఖ వ్యాఖ్యలను సిటీ సివిల్ కోర్టు తీవ్రంగా పరిగణించింది. భవిష్యత్ లో ఇంకెప్పుడూ ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలు చేయవద్దని ఆదేశించింది. అత్యంత జుగుప్సాకరంగా ఉన్న ఆ వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, వెబ్ సైట్లు,

- మిగతా 2 లో

నవంబరులోగా క్రీడావిధానం

బిల్లు సత్వరమే రూపొందించాలి

అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష

రాష్ట్ర క్రీడా విధానానికి సంబంధించి తుది ముసాయిదా నవంబరులోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

2లో

అమరుల పోరాటస్ఫూర్తితో ముందుకు సాగుదాం

బొల్లోజు సంతాప సభలో కూనంనేని

విశాలాంధ్ర-పినపాక: అమరుల పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు ఊపిరిపోస్తూ ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. మణుగూరు మండలం రామనుజవరం గ్రామంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య సోదరుడు రామాచారి సంతాప సభ శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ... పోరాటాలకు పురిటిగడ్డ అయిన ఉమ్మడి నల్గొండ జిల్లా తుంగతుర్తి మండలం నుంచి తెలంగాణ సాయుధ పోరాటస్ఫూర్తితో 1960 లో మణుగూరు వచ్చినట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై పోరాడే మన పార్టీ నేత అయోధ్యకు అండగా ఉన్నారనీ గుర్తు చేశారు. ప్రజల పక్షం నిలిచి అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారని వివరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాష, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అయోధ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నెల్లూరి నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా నేతలు పట్టం నారాయణ, వాసిరెడ్డి చలపతిరావు, దొబ్బల వెంకటప్పయ్య, కాంగ్రెస్ నాయకురాలు శ్రీవాణి, బీఆర్ఎస్ నాయకులు వట్టం రాంబాబు, కుర్రి నాగేశ్వరరావు, మాట్లాడారు. తొలుత రామాచారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. సీపీఐ నాయకులు మున్నా

- మిగతా 2 లో

ముందడుగు...

భారత్-చైనా బలగాలు వెనక్కి

న్యూదిల్లీ: భారత్, చైనాల మధ్య వాస్తవాధీన రేఖ వెంబడి నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికేలా రెండుదేశాల మధ్య కీలక ఒప్పందం జరిగింది. దీనికి అనుగుణంగా సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభమైంది. తూర్పు లదాఖ్ సెక్టార్‌లోని రెండు కీలకప్రాంతాలైన డెమ్చోక్, డెప్సాంగ్ నుంచి రెండు దేశాల బలగాలు వెనక్కి మరలుతున్నట్లు భారత రక్షణశాఖ అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఒప్పందం ప్రకారం ఈ ప్రాంతంలోని సైనిక సామగ్రి, ఇతర పరికరాలను భారత బలగాలు వెనక్కి తీసుకొస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక్కడి టెంట్లు, తాత్కాలిక నిర్మాణాలను

- మిగతా 2 లో

ఇంటిగుట్టు రట్టు

వీధినపడ్డ వైఎస్ కుటుంబ ఆస్తుల పంచాయితీ

అన్న జగన్‌పై లేఖాస్త్రాలు సంధిస్తున్న షర్మిల

చెల్లి, తల్లి పట్ల జగన్ తీరును ఎండగడుతున్న టీడీపీ

షర్మిలపై వైసీపీ నేతల విమర్శల దాడి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబ ఆస్తుల పంచాయితీ వీధినపడింది. అన్న వైఎస్ జగన్, చెల్లి షర్మిల మధ్య ఆస్తుల పంపిణీ వివాదం బహిర్గతం కావడంతో ఇంటిగుట్టు రట్టయింది. తెలుగు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో, ప్రజల్లో ఈ అంశం ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. వివిధ కంపెనీల్లో జగన్ గతంలో తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలకు కేటాయించిన వాటాలను రద్దు చేసుకునేందుకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో జగన్ ఫిర్యాదు చేసిన అంశం తాజాగా వెలుగులోకి రావడం, అన్న జగన్ వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుబడుతూ షర్మిల బహిరంగ లేఖలు విడుదల చేయడంతో తల్లి, చెల్లిపై జగన్‌మోహనరెడ్డి వ్యవహరిస్తున్న తీరును ఎండగడుతూ సోషల్ మీడియా వేదికగా టీడీపీ విమర్శలు గుప్పిస్తోంది. అలానే టీడీపీ మంత్రులు, నేతలు ఈ అంశంతో జగన్ ను తూర్పారబడుతున్నారు. దీంతో జగన్‌మోహనరెడ్డి స్వయంగా స్పందిస్తూ, ప్రతి కుటుంబంలోనూ విబేధాలు, ఆస్తుల పంచాయితీలు ఉంటాయని, తమ కుటుంబంలోని వ్యవహారాన్ని చంద్రబాబు, ఎల్లో మీడియా కావాలనే రచ్చ చేస్తున్నారంటూ మండిపడ్డారు. దీనికి తోడు సాక్షి పేపరులో షర్మిలకు వ్యతిరేకంగా కథనం రావడంతో ఆమె తీవ్రంగా స్పందించారు. ఆస్తుల పంపిణీకి సంబంధించి వైఎస్ఆర్ అభిమానులకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉందంటూ షర్మిల సంచలనాత్మకంగా మూడు పేజీల లేఖ విడుదల చేశారు. వైఎస్ఆర్ ఉన్నప్పుడు స్థాపించిన అన్ని సంస్థలు కుటుంబ వ్యాపారాలేనని, అవి అన్నీ జగన్ సొంతం కాదని పేర్కొన్నారు. ఇవాల్టి వరకూ తనకు న్యాయపరంగా రావాల్సిన ఒక్క ఆస్తి కూడా తన చేతుల్లో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ బతికి ఉన్నప్పుడే ఆస్తుల పంపిణీ చేశారనేది అవాస్తవమని అన్నారు. వైఎస్ఆర్ ఎప్పుడూ తనను తక్కువ చేసి చూడలేదని, సమాన వాటా ఉండాలనే వారని చెప్పుకొచ్చారు. అన్ని కుటుంబ వ్యాపారాలకు జగన్ గార్డియన్ మాత్రమేనని షర్మిల అన్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్ పూర్తిగా మారిపోయారని వ్యాఖ్యలు చేశారు. దీంతో శుక్రవారం వైసీపీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, పేర్ని నాని, జూపూడి ప్రభాకరరావు, రాచమల్లు శివప్రసాదరెడ్డి తదితరులు విలేకరుల సమావేశాలు పెట్టి షర్మిలపై విమర్శల దాడి చేశారు. జగన్ రాజకీయ అంతానికి షర్మిల... చంద్రబాబు, సునీతతో కలిసి కుట్రలు చేస్తోందని విమర్శించారు. షర్మిల చెప్పేవి అన్నీ అబద్ధాలేనని, పదవీ కాంక్షతో జగన్ శత్రువులతో షర్మిల జత కట్టారని మండిపడ్డారు. అన్నా చెల్లెళ్ల అనుబంధంపై ఆమె మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. చెల్లెలు అంటే ప్రేమ అభిమానంతోనే జగన్ స్వార్జిత ఆస్తిలోనూ వాటాలు ఇచ్చారని చెప్పారు. కుటుంబ తగాదాలను చంద్రబాబు రాజకీయం చేయరాదన్నారు. లేకుంటే ప్రజలు తరిమి

- మిగతా 2 లో

యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు

జర్మనీ ఛాన్సలర్‌తో చర్చల్లో ప్రధాని మోదీ

న్యూదిల్లీ: ఉక్రెయిన్, పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఆయా ప్రాంతాల్లో శాంతి స్థాపన దిశగా కృషి చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని చెప్పారు. భారత్- జర్మనీ 7వ 'ఇంటర్ గవర్నమెంటల్ కన్సల్టేషన్స్' చర్చల్లో భాగంగా భారత్ పర్యటనకు వచ్చిన జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్‌తో దిల్లీలో భేటీ సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్- రష్యా మధ్య

- మిగతా 2 లో

విద్యుత్ ఛార్జీల పెంపు దుర్మార్గం

- విజన్ ఉంటే సంపద పెంచి పేదలకు పంచండి
- డిస్కంల ప్రతిపాదనలు తిరస్కరించండి
- బహిరంగ విచారణలో కేటీఆర్ పిలుపు

విశాలాంధ్ర-హైదరాబాద్: పాలకులకు విజన్ ఉంటే సంపద పెంచి పేదలకు పంచాలి కానీ ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపి సంపద పెంచుకోవాలనే ఆలోచన చేయటం దుర్మార్గపు చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డిస్కమ్‌లంటే డిస్ట్రిబ్యూషన్ సంస్థలే ... ఖజానాకు కంట్రిబ్యూషన్ చేసే కంపెనీలు కాదని సూచించారు. విద్యుత్ అంటే వ్యాపారం కాదు రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించే రథచక్రం అనే విషయం ప్రభుత్వం గుర్తించాలన్నారు. విద్యుత్ సంస్థల బలోపేతం కోసం చేసే ఖర్చు భారం కాదు అది ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై శుక్రవారం ఈఆర్సీ సిరిసిల్లలో ఏర్పాటు చేసిన బహిరంగ విచారణలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన రోజు మనం తీవ్రమైన విద్యుత్ కొరతతో ఉన్నామన్నారు. పారిశ్రామిక వేత్తలు పవర్ హాలిడేస్ వద్దని ధర్నాలకు దిగిన పరిస్థితి. రైతులు కరెంట్ లేక తీవ్ర నిరాశలో ఉన్న దుస్థితి అని గతాన్ని గుర్తు చేశారు. సిరిసిల్లలో పవర్ లూమ్ పరిశ్రమ కరెంట్ తోనే ముడిపడి ఉందని, ఇక్కడ విద్యుత్ లేక ఎంతో మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో తీసుకున్న నిర్ణయాలు పదేళ్ల పాటు విద్యుత్ సంస్థలకు స్వర్ణయుగంగా మారిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ వచ్చిన 10 నెలల్లోనే కరెంట్ కోతలు మొదలయ్యాయని, దానికి తోడు విద్యుత్ ఛార్జీల వాతలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అదనపు ఆదాయం కోసం రూ.18 వేల కోట్ల అదనపు భారం మోపాలన్న కాంగ్రెస్ సర్కారు ఆలోచనే ప్రజా వ్యతిరేకమైనదన్నారు. విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన ఛార్జీలను తిరస్కరించాలని కోరారు. వివిధ కారణాలు చూపి రూ.963 కోట్లు అప్ ఛార్జీలను ప్రజలపై భారం వేయాలనుకోవటం సరికాదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. .12 వందల

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ట్రంప్ ప్రచారానికి కోట్లు కుమ్మరిస్తున్న మస్క్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ డొనాల్డ్ ట్రంప్ ప్రచారానికి టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మద్దతివ్వడమే కాకుండా పెద్ద మొత్తంలో విరాళాలు అందజేస్తున్నారు. ట్రంప్ తరపున ప్రచార కార్యక్రమాల నిర్వహణ కోసం తాజాగా మస్క్ మరో రూ.470 కోట్లు అందజేసినట్లు ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ వెల్లడించిందని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ట్రంప్ కోసం ఇప్పటివరకు ఆయన రూ.1,109 కోట్లు ఖర్చు చేసినట్లుగా తెలిపింది. అధ్యక్ష ఎన్నికల ప్రచారాల్లో ట్రంప్‌నకు గానీ, బైడెన్‌కు గానీ తనవైపు నుంచి ఆర్థిక సహకారం ఉండబోదని గతంలో ప్రకటించిన మస్క్... తాజాగా ట్రంప్ తరపున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాజకీయ కార్యాచరణ కమిటీకి పెద్ద మొత్తంలో విరాళాలు కుమ్మరిస్తున్నారు. విరాళాలు ఇవ్వడమే కాకుండా ట్రంప్ కోసం మస్క్ ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఫిలడెల్ఫియాలో ట్రంప్‌నకు మద్దతుగా సోలో క్యాంపెయిన్ నిర్వహించారు. ట్రంప్ ప్రచార కార్యక్రమాల కోసం రాజకీయ కార్యాచరణ కమిటీని ఏర్పాటుచేసి 75 మిలియన్ డాలర్ల విరాళం ఇచ్చారు. ముఖ్యంగా అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసే కీలక రాష్ట్రాల్లో ట్రంప్‌నకు మద్దతుగా భారీగా ఖర్చు పెడుతున్నారు. ఓటర్లను ట్రంప్‌నకు అనుకూలంగా మార్చేందుకు మస్క్ తాయిలాలు ఇస్తున్నట్లుగా, వాక్ స్వాతంత్ర్యం, తుపాకీ హక్కులపై తాము రూపొందించిన పిటిషన్‌పై సంతకాలు చేసిన ఓటర్లకు ఆయన డబ్బులు పంచుతున్నట్లు సమాచారం. ఇదిలాఉంటే... తాను అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే టెస్లా సీఈవో ఎలాన్ మస్క్‌కు కేబినెట్‌లో చోటిస్తానని, అలా కానిపక్షంలో సలహాదారుడిగానైనా నియమించుకుంటానని ట్రంప్ ఇటీవల జరిగిన ఓ ర్యాలీలో ప్రకటించారు. దీనిపై మస్క్ సానుకూలంగా స్పందిస్తూ 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ'కి నేతృత్వం వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. మరోవైపు మస్క్ తానే సృష్టించినట్లుగా చెబుతున్న రాజకీయ కార్యాచరణ కమిటీపై మిచిగాన్, నార్త్ కరోలినా ఎన్నికల బోర్డు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కమిటీ ఓటర్ల సమాచారాన్ని దుర్వినియోగం చేస్తోందని, అనేకమందిపై నిఘా వేస్తోందనే ఆరోపణలున్నాయి.

సీఆర్పీఎఫ్ స్కూళ్లు మూసివేయండి

భారత్‌కు ఉగ్రవాది పన్నూ బెదిరింపులు

వాషింగ్టన్: భారత్‌లోని సీఆర్పీఎఫ్ పాఠశాలలు మూసివేయాలని అమెరికాలోని ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హెచ్చరించాడు. కేంద్ర హోంమంత్రికి సంబంధించిన సమాచారం ఇచ్చినవారికి బహుమతి ఇస్తానని ప్రకటించాడు. ఈ మేరకు అతడు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశాడు. ఒకప్పటి సీఆర్‌పీఎఫ్ అధికారి, పంజాబ్ మాజీ డీజీపీ కేపీఎస్ గిల్, మాజీ రా అధికారి వికాస్ యాదవ్ తమ హక్కుల హననానికి పాల్పడ్డరారని పన్నూ ఆరోపించాడు. పంజాబ్, విదేశాల్లోని సిక్కులపై దాడులు చేశారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సీఆర్పీఎఫ్ పాఠశాలలను బహిష్కరించాలని బెదిరించాడు. స్వర్ణ దేవాలయంపై దాడి, 1984లో సిక్కుల ఊచకోతకు మనుషులను సమకూర్చడం వంటివి సీఆర్పీఎఫ్ చేసిందని ఆరోపించాడు.

'భారత సీఆర్పీఎఫ్‌కు హోం మంత్రి అమిత్‌షా నాయకత్వం వహిస్తున్నారు. హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యకు కిరాయి హంతకులను ఆయనే నియమించారు. న్యూయార్క్‌లో నా హత్యకు కుట్ర పన్నారు' అని ఆరోపణలు చేశాడు. అమిత్‌షా విదేశీ పర్యటనల సమాచారం ముందస్తుగా ఇచ్చినవారికి మిలియన్ డాలర్లు నజరానా ఇస్తానని ప్రకటించాడు. దిల్లీలోని రోహిణి ప్రశాంత్ విహార్ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ పాఠశాల వద్ద పేలుడుకు 'జస్టిస్ లీగ్ ఇండియా' అనే ఖలిస్థానీ అనుకూల సంస్థ బాధ్యత తీసుకొంది. ఖలిస్థానీ వేర్పాటువాదులను మట్టుబెట్టడానికి ప్రతీకారంగా దుండగులు ఈ చర్య చేపట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఈ పేలుడు క్లిప్‌తోపాటు 'కొందరు గూండాలతో భారత నిఘా ఏజెన్సీ మా సభ్యుల నోరు మూయించాలని చూస్తే... ప్రపంచంలో వారికంటే మూర్ఖులు మరొకరు ఉండరు. మేము వారికి ఎంత దగ్గరగా ఉన్నామో ఏమాత్రం ఊహించలేరు. ఏక్షణమైనా దాడి చేయగల సత్తా మా దగ్గర ఉంది. ఖలిస్థాన్ జిందాబాద్' అనే సందేశాన్ని టెలిగ్రామ్‌లో పోస్టు చేశాడు. ఇప్పటికే తెల్ల టీషర్ట్ ధరించిన ఓ అనుమానితుడిని గుర్తించారు. పేలుడు జరగడానికి ముందురోజు రాత్రి ఆ ప్రదేశంలో అతడు ఏదో చేస్తున్నట్లు ఆ దృశ్యాల్లో ఉంది. ఆ తర్వాత దేశంలోని అనేక సీఆర్పీఎఫ్ పాఠశాలలకు బెదిరింపులు రావడం మొదలైంది.

యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు

(మొదటిపేజీ తరువాయి)

సుదీర్ఘంగా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమస్యకు పరిష్కారం దిశగా భారత్ చొరవ చూపాలని ఒలాఫ్ విజ్ఞప్తి చేశారు. 'ఉక్రెయిన్, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. వీలైనంత త్వరగా వీటికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా కృషి చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంది. యుద్ధాల వల్ల సమస్యలు పరిష్కారమవుతాయని భారత్ ఎప్పటికీ విశ్వసించదు' అని మోదీ స్పష్టంచేశారు. మరోవైపు 20వ శతాబ్దంలో ఏర్పాటైన అంతర్జాతీయ వేదికలు 21 శతాబ్దపు సవాళ్లను పరిష్కరించడానికి సరిపోవని మోదీ అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితి భద్రతామండలి సహా అనేక అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రతిపాదనలతో స్కోల్జ్ ఏకీభవించారు. అంతకుముందు ఇంటర్ గవర్నమెంటల్ కన్సల్టేషన్స్ సదస్సును ప్రారంభించిన మోదీ... ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు, విభేదాలు ముసురుకున్నప్పటికీ భారత్, జర్మనీ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం రెండు దేశాల అభివృద్ధికి బలమైన పునాదిగా మారిందని చెప్పారు.

జర్మనీ వీసాలు 90 వేలకు పెంపు

నైపుణ్యం గల భారత శ్రామిక శక్తి కోసం వీసాల సంఖ్య 20 వేల నుంచి 90 వేలకు జర్మనీ పెంచిందని మోదీ వెల్లడించారు. 18వ ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్‌లో ప్రధాని మాట్లాడుతూ రాబోయే 25 ఏళ్లకు వికసిత్ భారత్ కోసం ప్రణాళిక రూపొందించామని తెలిపారు. 'ఫోకస్ ఆన్ ఇండియా పేరిట జర్మనీ కేబినెట్ ఒక పత్రాన్ని విడుదల చేయడం ఆనందంగా ఉంది. నైపుణ్యం గల భారతీయ ఉద్యోగులకు వీసాల సంఖ్యను 20 వేల నుంచి 90 వేలకు పెంచాలని జర్మనీ నిర్ణయించింది. భారత శ్రామిక శక్తిపై జర్మనీ ఉంచిన విశ్వాసం అద్భుతం. ఈ నిర్ణయం ఆ దేశ వృద్ధికి దోహదం చేస్తుంది. భారత్ తయారీ కేంద్రంగా మారింది. ప్రపంచం ఉద్రిక్తతలు, సంఘర్షణ, అనిశ్చితితో ఉన్న సమయంలో రెండు దేశాల వ్యూహాత్మక బంధం బలోపేతమవుతోంది. యుద్ధం సమస్యలను పరిష్కరించలేదు. శాంతి కోసం సాధ్యమైనంత సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగానే ఉంటుంది' అని మోదీ అన్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా గురువారం జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ షోల్జ్ భారత్‌కు వచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో సమావేశం నిర్వహించుకుంటున్నామని వ్యాఖ్యానించారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థ అని కొనియాడారు.

ముందడుగు...

(మొదటిపేజీ తరువాయి)

కూడా రెండు దేశాల బలగాలు తొలగిస్తున్నట్లు వెల్లడించారు. చార్డింగ్ లా పాస్‌కు సమీపంలోని నదికి పశ్చిమదిశగా భారత బలగాలు, తూర్పు దిశగా చైనా బలగాలు వెనక్కివెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో సరిహద్దులకు రెండు వైపులా దాదాపు 10-12 తాత్కాలిక నిర్మాణాలు,12 టెంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత మరో 4-5 రోజుల్లో డెప్సాంగ్, డెమ్చోక్ ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను పునరుద్ధరించనున్నట్లు సమాచారం. వాస్తవాధీన రేఖ వెంబడి గస్తీ పునఃప్రారంభంపై రెండు దేశాల మధ్య ఇటీవల ఒప్పందం కుదిరింది. దీనిప్రకారం 2020 గల్వాన్ ఘర్షణలకు ముందు నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి కొనసాగనుంది. రెండు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సులో ఈ ఒప్పందాన్ని రెండు దేశాల నేతలు మోదీ, జిన్‌పింగ్ ధ్రువీకరించారు. 2020 జూన్ 15న తూర్పు లదాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన తీవ్ర ఘర్షణ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఈ ఘర్షణలో తెలంగాణకు చెందిన కర్నల్ సంతోశ్‌బాబు సహా 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. కానీ ఆ సంఖ్యను వెల్లడించలేదు. చాలా నెలల తర్వాత ఐదుగురు చనిపోయినట్లు అధికారికంగా అంగీకరించింది. ఈ ఘర్షణలతో రెండు దేశాలు ఎల్ఏసీ వెంబడి భారీస్థాయిలో బలగాలను మోహరించాయి. అప్పటినుంచి రెండుదేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఆ తర్వాత ప్రతిష్టంభనను తొలగించేందుకు రెండు దేశాల మధ్య అనేకసార్లు దౌత్య, కమాండర్ స్థాయి చర్చలు జరిగాయి. వాటి ఫలితంగా ఇప్పటికే కొన్ని ప్రాంతాల నుంచి బలగాలను ఉపసంహరించగా... ఘర్షణల కేంద్రమైన డెమ్చోక్, డెప్సాంగ్ వద్ద మాత్రం బలగాలు కొనసాగుతూ వచ్చాయి.

సజ్జల పిటిషన్‌పై పోలీసులకు నోటీసు

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కాల్సి ఉండగా, పోలీసులు మీపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయంటూ సజ్జలను ఆపారు. దానిపై సజ్జల పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తాను దేశం విడిచి వెళ్లడం లేదని, స్వరాష్ట్రానికి వెళుతుంటే ఎలా ఆపుతారని ప్రశ్నించారు. ఈలోగా సజ్జల తాను ఎక్కాల్సిన విమానం వెళ్లిపోయింది. దీనిపై సజ్జల హైకోర్టును ఆశ్రయించగా, విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం పోలీస్ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలని నోటీసులు జారీ చేసింది.

కుల గణనతోనే సామాజిక న్యాయం

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశవ్యాప్తంగా బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించడానికి సమర్థ చర్యలు చేపట్టడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడం, ఓబీసీ కులగణన, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు తదితర డిమాండ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ప్రధాన కార్యదర్శి టి.నందగోపాల్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రాఘవేంద్ర, కార్యదర్శి జి.విజయ్ కుమార్ శుక్రవారం న్యూదిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో రాజాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ దేశవ్యాప్త కుల గణనకు సీపీఐ మద్దతు తెలుపుతుందన్నారు. దీనిపై గతంలోనే పార్టీ జాతీయ సమితి సమావేశాల్లో తీర్మానం చేసిందని చెప్పారు.

కుల గణనను వాయిదా వేయడం ద్వారా మోదీ ప్రభుత్వం ఓబీసీ వర్గాలతోపాటు సమాజంలోని ఇతర అట్టడుగు వర్గాలను మోసం చేస్తోందని రాజా విమర్శించారు. దేశవ్యాప్తంగా బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించడానికి సమర్థ చర్యలు చేపట్టడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. కుల గణన చేపట్టి శాస్త్రీయ, వివరణాత్మక సామాజిక-ఆర్థిక డేటా కలిగిఉంటే... కులాల మధ్య అసమానతల సమస్యను పరిష్కరించేందుకు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం అందించడం సులభతరమవుతుందని పేర్కొన్నారు.

జనాభా దామాషా ప్రకారం ఓబీసీలకు రిజర్వేషన్‌లు కల్పిస్తే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా 90 శాతం సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. ఇందుకు పార్లమెంట్‌లో ఓబీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని, ఓబీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖను కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందేనని రాజా స్పష్టం చేశారు. ఈ మేరకు పార్లమెంటులో కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామని బీసీ సంక్షేమ సంఘం నేతలకు హామీ ఇచ్చారు.

ఇసుక సీనరేజి ఫీజు మాఫీ

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలు జారీ చేసింది. నిర్మాణ రంగంతో ఉపాధి, ఆదాయం పెరుగుతున్నందున ఉచిత ఇసుక పూర్తిస్థాయిలో అమలుకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా సీనరేజీ ఫీజు మాఫీకి చర్యలు చేపట్టినట్టు ఉత్తర్వుల్లో ప్రభుత్వం వెల్లడించింది. దీనివల్ల స్థానికంగా ఇసుక లభ్యత, రవాణా పెరుగుతుందని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ఇసుక బ్లాక్ మార్కెటింగ్‌ను నివారించేలా విజిలెన్స్‌నూ పటిష్టం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇసుక లభ్యతను పెంచేలా ప్రస్తుత ఇసుక పాలసీలో మార్పులు చేర్పులు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. సీనరేజీ ఫీజు కింద మెట్రిక్ టన్ను ఇసుక రూ.88 ఉండగా దాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. ఇసుక లభ్యం కానీ జిల్లాల్లో స్టాక్ యార్డుల ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. విజిలెన్స్ పర్యవేక్షణ విధివిధానాలు మార్చింది.

కశ్మీర్‌లో ఎన్డీఏ విధానాలు విఫలం

(మొదటిపేజీ తరువాయి)

పౌరులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న హత్యల కారణంగా కశ్మీర్ ప్రమాదపు నీడలో జీవిస్తోందని రాహుల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. మృతులకు సంతాపం తెలిపారు. 'జమ్మూ కశ్మీర్‌లోని గుల్‌మార్గ్‌లో ఉగ్రవాదుల దాడిలో ఇద్దరు జవాన్లు వీరమరణం పొందడం అత్యంత బాధాకరం. ఇద్దరు పోర్టర్‌లు కూడా ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని ఆమె తెలిపారు. నాగరిక సమాజంలో హింస, ఉగ్రవాదం ఆమోదయోగ్యం కాదన్నారు. గుల్‌మార్గ్‌లో గురువారం ఉగ్రవాదులు ఓ సైనిక వాహనంపై కాల్పులకు తెగబడటంతో ఇద్దరు సైనికులు, ఇద్దరు ఆర్మీ పోర్టర్లు మృతి చెందగా... మరో పోర్టర్, ఒక సైనికుడు గాయపడ్డారు. ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని పర్యాటక కేంద్రమైన గుల్‌మార్గ్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలో ఘటన చోటు చేసుకుంది. బోటా పత్రి ప్రాంతంలో సైనిక వాహనం అఫ్రావత్ రేంజ్‌లోని నాగిన్ పోస్ట్ వైపు వెళుతుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు.

'ఉచిత గ్యాస్'కు రేషన్‌కార్డే అర్హత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఈ దీపావళి నుండే మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసే పథకం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సంబంధిత మార్గదర్శకాలను, విధి విధానాలను నిర్దేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నాల్గవ బ్లాక్ ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ఈ నెల 31న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంఛనంగా ఈ పథకాన్ని ప్రారంభిస్తారని...తదుపరి అర్హులైన ప్రతి ఇంటికీ మొదటి గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఎల్పీజీ కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు అర్హతగా ఈ పథకం అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్లు, 1.47 రేషన్ కార్డులు ఉన్నాయని... వీరిలో అర్హులు అందరికీ ఈ పథకం వర్తింప చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం అమలుకై ఏటా ప్రభుత్వం పై రూ.2,684.75 కోట్ల మేర భారం పడుతుందన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కుంటున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మహిళల కోసం కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నవంబరులోగా క్రీడావిధానం

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర క్రీడా విధానానికి సంబంధించి తుది ముసాయిదా నవంబరులోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీపై శుక్రవారం తన నివాసంలో ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మనం రూపొందించే పాలసీ దేశంలోనే అత్యుత్తమంగా ఉండాలని, విస్తృత అధ్యయనంతో పాటు నిపుణులు, క్రీడాకారులతో సంప్రదింపులు జరపాలని సూచించారు. అందుబాటులో ఉన్న క్రీడా వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ బిల్లు త్వరగా రూపొందించాలని అన్నారు. స్పోర్ట్స్ పాలసీలో భాగమైన యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు సంబంధించి పలు వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. అందులో మార్పులుచేర్పులను ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి దక్షిణ కొరియా క్రీడా వర్సిటీ ప్రతినిధులతో చర్చించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. క్రీడా రంగంలో ప్రపంచంలోనే అత్యుత్తమైనదిగా గుర్తింపు పొందిన ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ వర్సిటీ అనసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని అన్నారు. పది రోజుల్లోనే గవర్నింగ్ బాడీని ఖరారు చేయాలని తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల క్యాలెండర్ తయారు చేయాలన్నారు. రాబోయే రెండేళ్లలో నేషనల్ గేమ్స్ కు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ను సంప్రదించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

కొండా సురేఖకు చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. యూట్యూబ్, ఫేస్‌బుక్, గూగుల్ సంస్థలకు కూడా ఆదేశాలు జారీ చేసింది. సురేఖ వ్యాఖ్యలను ప్రసారం చేసిన, ప్రచురించిన మీడియా సంస్థలకు కూడా ఆదేశాలు ఇచ్చింది. ఈ కామెంట్లకు సంబంధించిన అన్ని కథనాలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఆయా సంస్థలను కోరింది. కొండా సురేఖ వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయని, అన్ని కథనాలు, వీడియోలు పబ్లిక్ డొమైన్‌లో ఉంచవద్దని కోర్టు తెలిపింది.

దేశంలో ఇదే మొదటి సారి ...

పరువు నష్టం కేసులో మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై కోర్టు ఇంత ఆగ్రహం వ్యక్తం చేయటం దేశంలో ఇదే తొలిసారి. గతంలోనూ కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం వీటిపై ఘాటుగా స్పందించింది. ఆయనప్పటికీ ఆమెలో ఎలాంటి మార్పు రాలేదు. కోర్టు తాజా ఆదేశాలతో కేటీఆర్‌కు బలం చేకూరినట్లైంది.

ఇంటిగుట్టు రట్టు

(మొదటిపేజీ తరువాయి)

కొడతారని జూపూడి ప్రభాకర్ హెచ్చరించారు. సాక్షి జగతి, భారతి సిమెంట్స్ రెండూ జగన్ స్థాపించిన సంస్థలని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. వైఎస్ఆర్ జీవించి ఉన్నప్పుడే ఆ సంస్థలను స్థాపించారని, వాటిలో షర్మిల, అనిల్ డైరెక్టర్‌లుగా లేరని చెప్పారు. చెల్లి, తల్లి పై కేసులు వేయాలన్న ఉద్దేశం జగన్‌కు లేదన్నారు. జగన్ బెయిల్ రద్దు చేసే కుట్రలు జరుగుతున్నాయని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఇలా విమర్శలు, ప్రతి విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణతో మాటల యుద్ధం జరుగుతోంది. టీడీపీ అనుకూల మీడియాలో జగన్‌కు వ్యతిరేకంగా, వైసీపీ అనుకూల మీడియాలో షర్మిలకు వ్యతిరేకంగా చర్చలు, కథనాలు రావడం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది.

దక్షిణాదిపై మోదీ వివక్ష

(మొదటిపేజీ తరువాయి)

అడ్డుకోవాలని చూస్తున్నాయని అన్నారు. తాము గుజరాత్‌కు పోటీ ఇవ్వబోతున్నామని... అందువల్లే తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిని బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు, రేడియల్ రాడార్, ఇరిగేషన్ ప్రాజెక్టులతో తెలంగాణ పురోగతి సాధించి గుజరాత్ కు పోటీ ఇస్తుందనే విషయం తెలిసే మా ప్రయత్నాలను ఆపేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.

బీఆర్ఎస్ వ్యతిరేకించిన మరుసటి రోజే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడతారని పేర్కొన్నారు. పదేళ్ల ప్రభుత్వాన్ని నడిపిన కేసీఆర్ పది సార్లు కూడా సెక్రటేరియట్ కు రాలేదని, ప్రతిపక్ష హోదా ఇస్తే పది నిమిషాలు అసెంబ్లీలో కూర్చుని వెళ్లిపోయారన్నారు.

ఆయనకు ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే ఎందుకు బయటకు రావడం లేదని నిలదీశారు. తన ఫాంహౌస్‌లో పడుకొంటాడు, తానో జమిందార్... ప్రజలందరూ గులాంలని కేసీఆర్ అనుకుంటాడని, అందుకే బయటరు రావడం లేదని దుయ్యబట్టారు. నాలుగు కోట్ల ప్రజలు ఎన్నుకుంటేనే తాముము అధికారంలోకి వచ్చామని, మీకు నచ్చకుంటే ఇంట్లో కూర్చోండని సలహా ఇచ్చారు. ప్రజల ఆలోచనను పట్టించుకోకుంటే రాబోయే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు.

అమరుల పోరాటస్ఫూర్తితో ముందుకు సాగుదాం

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్మీకుమారి, సారెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, దుర్గ్యాల సుధాకర్ ఎడారి రమేష్, కామిశెట్టి రామారావు, ఆర్.లక్ష్మీనారాయణ, గడ్డం వెంకటేశ్వర్లు, బాడిస సతీష్, ఎస్‌కే సర్వర్, మంగి వీరయ్య, కుటుంబ రావు, వేల్పుల మల్లికార్జున్, పేరాల శీను, మువ్వ వెంకటేశ్వరరావు, వంగర సతీష్, మనోహరచారి, పత్తిపాటి నాగేశ్వరరావు, మూలగని సమ్మక్క, నిర్మల, ప్రమీల, సుజాత, సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు కాంగ్రెస్ నాయకులు సాయిని వెంకటేశ్వరరావు, ఎస్వీ నాయుడు, తోట రమేష్, కొత్తపల్లి సీతారాములు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు దుర్మార్గం

(మొదటిపేజీ తరువాయి)

కోట్లు పెంచుకోవటంతో పాటు డిస్కంలు చేసిన తొమ్మిది ప్రతిపాదనలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ అధికారంలో ఉండగా రాష్ట్ర ప్రజలపై ఒక్క రూపాయి భారం వేయలేదని, రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, మిషన్ భగీరథ ప్రాజెక్ట్ ద్వారా ఉచితంగా నీళ్లు ఇచ్చినప్పటికీ రూపాయి భారం వేయలేదన్నారు. సిరిసిల్లలో నేతన్నలకు 10 హెచ్‌పై 50 శాతం సబ్సిడీ కూడా ఇచ్చామని, ఇప్పుడు 10 నుంచి 30 హెచ్ పీల వరకు పెంచి 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లకు 300 యూనిట్లు దాటితే ప్రస్తుతం ఉన్న రూ.10 ఫిక్స్‌డ్ ఛార్జీలను 50కి పెంచాలని ప్రతిపాదించారని, దీన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. గతంలో పోల్చుకుంటే కరెంట్ వినియోగం పెరిగిందని, ఇప్పుడు డిస్కంలు చేసిన ప్రతిపాదన పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచేలా ఉందని ధ్వజమెత్తారు. 11 కేవీ, 33 కేవీ, 220 కేవీ కింద నడిచే పరిశ్రమలన్నింటినీ ఒకే కేటగిరీ లోకి తేవటం అసంబద్ధమన్నారు. విద్యుత్‌తో పరిశ్రమలన్నింటినీ ఒకే గాటున కట్టటమంటే సూక్ష్మ, చిన్న, మధ్యస్థ పరిశ్రమలకు ఉరి వేస్తున్నట్లే అని వివరించారు. ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కుంటుపడి, చాలా పరిశ్రమలు తరలిపోతున్నాయన్నారు. ఛార్జీలు పెంచితే పరిశ్రమలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కుటీర పరిశ్రమలు బెంబేలెత్తిపోతాయని అభిప్రాయపడ్డారు. వాటిని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. డిస్కంల ప్రతిపాదనలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదన్నారు. మోటార్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఒత్తిడి తెచ్చినా తాము అంగీకరించలేదన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు కారణంగానే తెలంగాణ ఉద్యమం పుట్టిందని, ఆనాడు కేసీఆర్ ఉద్యమం మొదలుపెట్టారని గుర్తు చేశారు. విద్యుత్ వ్యాపార వస్తువుగా చూడవద్దని, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా భావించాలని సూచించారు. ప్రజలపై 18 వేల కోట్ల భారాన్ని మోపాలని చేస్తున్న ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు.

దీపావళి బాంబు అంటే... ఈడీ దాడిపై ఏమన్నా చెబుతారేమో!

దీపావళి లోపు బాంబు పేలుతుంది అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. బాంబు అంటే ... పొంగులేటిపై జరిగిన ఈడీ రైడ్ గురించి ఏమన్న చెబుతాడేమో అంటూ ఎద్దేవా చేశారు. ఈడీ దాడుల్లో ఎన్ని నోట్ల కట్టలు దొరికాయి, ఎన్ని కట్టల పాములు దొరికినయన్నది చెబుతాడా అని అన్నారు. ఈ విషయంలో బీజేపీతో ఎట్ల సంధి కుదుర్చుకున్నది, ఎట్ల బతిమిలాడి కేసు కాకుండా చూసుకున్నది, అదానీ కాళ్లు పట్టుకున్నది... ఏదైనా చెబుతాడేమో అంటూ చెప్పుకొచ్చారు. అమృత్ పథకంలో భాగంగా సీఎం బావమరిది కి రూ.1,137 కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చి స్కాం చేశారని తాను ఆరోపిస్తున్నా... బీజేపీ నేతలు ఎందుకు స్పందించటం లేదని నిలదీశారు. నాపై కేసు పెట్టాలనుకుంటే పెట్టుకో అంటూ వ్యాఖ్యానించారు. ఏదో అడ్డమైన కేసు పెట్టి జైలుకు పంపుతానంటే పంపు అంటూ ఘాటుగా స్పందించారు.

తప్పిన ముప్పు

ఊపిరిపీల్చుకున్న అధికారులు

ఒడిశా తీరప్రాంత జిల్లాల్లో దానా ప్రభావం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌కు దానా తుఫాన్ ముప్పు తప్పిందని విశాఖలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర ఒడిశా పూరి సమీపంలోని ధమ్రా-హబలిఖాతి మధ్య శుక్రవారం తెల్లవారుజామున తీరాన్నిదాటిందని తెలిపింది. తీవ్ర తుఫాన్ క్రమంగా బలహీనపడిందని వివరించింది. ఉత్తర ఒడిశా భద్రక్ సమీపంలో తుఫాన్ ప్రభావం ప్రస్తుతం కొనసాగుతుందని చెప్పింది. ఉత్తర వాయువ్య దిశగా కదిలి... బలహీనపడి వాయుగుండం మారనుందని పేర్కొంది. తుఫాన్ తీరం దాటిన సమయంలో సుమారు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని తెలిపింది. ఉత్తర కోస్తాలో చెదురుమదురుగా వర్షపు జల్లులు పడ్డాయని పేర్కొంది. అన్ని పోర్టులకు జారీ చేసిన హెచ్చరికలను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఉత్తర కోస్తాపై గాలుల ప్రభావం కొంత వరకు ఉంటుం దని చెప్పింది. ఉత్తర ఒడిశాలో వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తు న్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో శని, ఆదివారాలు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

బలహీనపడింది: కూర్మనాథ్

ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ... దానా తుఫాన్ హబాలిఖాతి నేచర్ క్యాంప్, ధమ్రాకు సమీపంలో తుఫాన్ తెల్లవారుజాము తీరం దాటిందన్నారు. పశ్చిమ - వాయువ్య దిశగా కదులుతూ మధ్యాహ్నం నుంచి క్రమంగా బలహీనపడుతుందన్నారు. ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒడిశా తీరప్రాంత జిల్లాలైన భద్రక్, జగత్‌సింగ్‌పూర్, బాలాసోర్, కేంద్రపారాలో బలంగా గాలులు వీచాయి. భారీ వర్షాలు కురుస్తున్నాయి. వేలాది చెట్లు నేలకొరిగాయి. ప్రభుత్వం అప్రమత్తమైంది.పెద్దఎత్తున పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసింది. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించింది.

కొత్తగూడెం - పాల్వంచ పరిసర గ్రామాలతో 'కుడ' ఏర్పాటుకు జీవో జారీ

ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం : పారిశ్రామిక కేంద్రాలైన కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో పాటు పరిసర గ్రామాలను కలుపుతూ హెచ్ఎండిఏ తరహాలో కొత్తగూడెం అర్బన్ డవలప్మెంట్ అథారిటీ (కుడ) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీవో నెంబర్ 177 జారీ అయ్యింది. దింతో 'కుడ' ఏర్పాటు వల్ల ఈ పట్టణాలు సమగ్రంగా అభివృద్ధి సాధిస్తాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆయన ఈ మధ్య కాలంలో పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాఖల మంత్రుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితంగా ప్రభుత్వం జీవో జారీచేసింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు పారిశ్రామిక ప్రాంతాలుగా రోజురోజుకు విస్తరిస్తున్నాయన్నారు. దీని కనుగుణంగా తాను ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. షెడ్యూల్ భూములు, సింగరేణి, ఇతర పరిశ్రమల భూములు ఎక్కువగా ఉండటంతో 'కుడ' ఏర్పాటు వలన ఈ ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి సాదించేందుకు దోహదపడుతుందన్నారు. జంట పట్టణాలను మహానగరాలకు ధీటుగా అభివృద్ధి సాధించాలంటే 'కుడ' ఏర్పాటు తప్పనిసరిగా అవసరం అన్నారు. దీన్ని గుర్తించి తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఇప్పుడు సానుకూలంగా స్పందించి 'కుడ' ఏర్పాటుకు ఆమోదం తెలిపి జీవో జారీచేసిందని కూనంనేని శంతోషం వ్యక్తం చేసారు. అనతికాలంలో జంట పట్టణాలతోపాటు నియోజకవర్గం ఊహించని రీతిలో అభివృద్ధి సాదిస్తుందని ఆశాభవం వ్యక్తం చేశారు. పారిశ్రామికంగా మరింత అభివృద్ధి సాధించడం వల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. తన విజ్ఞప్తిపై స్పందించి 'కుడ' ఏర్పాటుకు జీవో జారీచేసిన ప్రభుత్వానికి కూనంనేని కృతజ్ఞతలు చెప్పారు.

పశుగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలి : అదనపు కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : జిల్లాలో పశుగణన సర్వే ప్రక్రియను చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. అదనపు కలెక్టర్ ఛాంబర్లో జిల్లా పశు వైద్యాధికారి సురేష్ కుమార్, వైద్య అధికారులతో కలిసి 21వ అఖిలభారత పశుగణన-తెలంగాణ కార్యక్రమ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 21వ అఖిలభారత పశుగణన-తెలంగాణ సర్వే కార్యక్రమం ఫిబ్రవరి 28, 2025 వరకు కొనసాగుతుందని, ఈ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ప్రతి ఇంటికి వెళ్లి పశువుల వివరాలు సేకరించి ప్రభుత్వం నిర్ణయించిన ఆన్లైన్ పోర్టల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని జిల్లాలోని 15 మండలాలలో పశు గడన సర్వే కార్యక్రమం కొరకు 86 మంది ఎన్యుమరేటర్లు, 11 మంది సూపర్ వైజర్లను నియమించడం జరిగిందని, సర్వే ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

విశాలాంధ్ర - హుజూర్ నగర్ : హుజూర్ నగర్ పట్టణంలోని 6 వార్డుకు చెందిన తోట అరుణ, పెండెం నరేష్లకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం హుజూర్ నగర్ పట్టణంలోని మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున్ రావులు బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో ఎంతో మంది బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేయడం జరుగుతుందిన్నారు. ఈ కార్యక్రమంలో చింతకాయల రాము ముదిరాజ్, వినోద్, వీరబాబు, ములకలపల్లి రామకృష్ణ, లక్ష్మణ్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు రుద్రాక్ష మొక్కను అందించిన రాజశేఖర్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : కొత్తగూడెం జిల్లాలోని కలెక్టరేట్ భవన్లో జరిగిన కార్యక్రమానికి శుక్రవారం ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు మొక్కల రాజశేఖర్ రుద్రాక్ష మొక్కను గౌరవంగా సూచికంగా అందజేసారు. కొన్ని రోజులక్రితం 114వ మన్‌కి బాత్ కార్యక్రమంలో ప్రధాని మోడీ ప్రకృతి ప్రేమికుడైన రాజశేఖర్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. కాగా గవర్నర్ తనకు ఇచ్చిన రుద్రాక్ష మొక్కను చూసి ఇది కేవలం నార్త్ ఇండియాలోని హిమాలయ పర్వతాల్లో ఎక్కువగా ఉంటుందని, తనకు బహుకరించినందుకు సంతోశం వ్యక్తం చేసారు. ఈ మొక్కను తాను హైదరాబాద్ రాజ్ భవన్లో నాటు తానని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా హరిత దీక్ష క్లబ్ ముఖ్య సలహాదారులు సంగం వెంకట పుల్లయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ దస్తగిరి, కార్యదర్శి లగడపాటి రమేష్‌లు మొక్కల రాజశేఖర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటిడిఏ పివో బి.రాహుల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు అనుకుని యాసిడ్ తాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పెనుబల్లి : ఒక వ్యక్తి మంచి నీళ్లు అనుకుని బ్యాటరీల్లో పోసే యాసిడ్ వాటర్‌ని తాగి మృతి చెందిన విషాద ఘటన పెనుబల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసు తెలిపిన వివరాల ప్రకారం పెనుబల్లి మండలం కె.డబ్ల్యూ చౌడవరం గ్రామానికి చెందిన కణితి సత్యనారాయణ(45) అనే రైతు కూలీ ఈనెల 16వ తేదీన మధ్యాహ్న సమయంలో మద్యం సేవించాడు. మద్యం మత్తులో ట్రాక్టర్ బ్యాటరీలోకి వాడే యాసిడ్‌ని మంచినీళ్లుగా భావించి సేవించాడు. యాసిడ్ తాగిన విషయం కుమారుడుకి తెలపడంతో వెంటనే కల్లూరులోని ప్రవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మంలోని హాస్పిటల్‌కి తరలించి చికిత్స అందించారు. 9 రోజులుగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఎస్ఐ కే. వెంకటేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రైతన్నల మొఖంలో చిరునవ్వు చూడడమే లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బ్యూరో పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం, కొలనూరు గ్రామంలో అలాగె కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో పెగడపల్లి గ్రామంలో శుక్రవారం రోజున సింగిల్ విండో ఐకేపి వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో, అధికారులతో కలిసి ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం ధాన్యం కోతల అనే పదానికి తావు ఇవ్వమని స్పష్టం చేశారు. సీజన్లో కొనుగోలు కేంద్రాలలో తాలు తరుగు పేరుతో ఎక్కడైనా కటింగ్ చేస్తే రైతులు తన దృష్టికి తీసుకు వస్తే వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రానికి వస్తానని రైతులకు హామీ ఇచ్చారు. సన్న రకాల ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తామని రైతులు ఎలాంటి సందేహాలకు పాల్పడవద్దన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల అభ్యున్నతికి పాటు పడుతుందన్నారు. రైతులకు ఏమాత్రం అన్యాయం జరిగిన ఉపెక్షించేది లేదన్నారు.

ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందాలి

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - భద్రాద్రి కొత్తగూడెం : సమాజంలో ప్రతీ ఒక్కరికి అభివృద్ధి ఫలాలు దక్కేలా చూడాలని ముఖ్యంగా మారుమూల ప్రాంత గిరిజనులకు అన్ని విధాన ఆదుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కోరారు. గిరిజనులకు మెరుగైన జీవన వ్యవస్థను అందించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శుక్రవారం అయన భద్రాద్రి కొత్తగూడెం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో పాల్గొన్నారు. తొలుత జిల్లాకు వచ్చిన గవర్నర్‌కు ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, బలరాం నాయక్, కొత్తగూడెం, భద్రాచలం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో బి. రాహుల్, ఎస్పీ రోహిత్ రాజ్, అధికారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నర్ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లా అధికారులు, ప్రముఖులతో ముఖాముఖి సమావేశం అయ్యారు. జిల్లా కలెక్టర్ జితేష్ జిల్లా ప్రాముఖ్యతను, సంస్కృతి, సంప్రదాయాలను, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు బాగుందని ప్రశంసించారు. ముఖ్యంగా ఇక్కడి ప్రజల్లో 2021లో 73 శాతం ఉన్న రక్తహీనత 2024 నాటికి 21 శాతానికి తగ్గించడానికి కలెక్టర్, అధికారులు చేసిన కృషిని ప్రశంసించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు అలాగే ఆదివాసి గిరిజన మహిళలు తయారు చేసిన గిరిజన వంటకాలు చాలా బాగున్నాయన్నారు. 2047 నాటికి ఇండియా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించి వికసిత్ భారత్ కావాలని ఆయన ఆకాంక్షించారు. భద్రాచలం, పర్ణశాలలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయాల పరంగా పర్యాటక శాఖను అభివృద్ధి చేసుకొని ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చన్నారు. రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మను కవులు, రచయితలు శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకటేష్ శ్యామ్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని పరిశీలించిన సివిల్స్ అధికారులు

విశాలాంధ్ర - కారేపల్లి : రాజస్థాన్ ఢిల్లీ మహారాష్ట్ర బీహార్ రాష్ట్రాలకు చెందిన శిక్షణ ఐపీఎస్ అల్తమాస్ ఘాజి, ఐపీఎస్, వైభవ్ మీనా, ఐఏఎస్ తేజస్విని, ఐఆర్ఎస్ అనిత మీనా ఐఎఫ్ఎస్ విపుల సింగాల్‌ల బృందం డ్వాక్రా మహిళలతో కలిసి బతుకమ్మ ఆట ఆడారు. శుక్రవారం మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ గ్రామ సభలో అంగన్వాడీ టీచర్లు చిన్నారులకు అందించే పోషక ఆహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సెంటర్లకు వచ్చే పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకుకు అందిస్తున్న పోషకాహార విలువలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు తయారు చేసిన పోషక విలువలు కలిగిన 15 రకాల వంటలను తయారు చేసి అధికారులకు చూపించారు. హెల్త్ సబ్ సెంటర్‌ను సందర్శించి అక్కడ గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిని గురించి సంబంధిత డిఈతో, అడవుల పెంపకంపై డిప్యూటీ రేంజర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చివరగా తమ గ్రామానికి వచ్చిన ట్రైనీ సివిల్స్ అధికారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సివిల్స్ అధికారుల వెంట ఎంపీడీవో సురేందర్, సిడిపిఓ దయామణి, ఎంపీఓ రవీంద్ర ప్రసాద్, సూపర్‌ండెంట్ రమేష్, అంగన్వాడి సూపర్వైజర్లు రాధమ్మ, స్థానిక పంచాయతీ సెక్రటరీ, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

సీపీఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించండి

రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - మహబూబాబాద్ : సిపిఐ ఆవిర్భవించి వందేళ్ళు పూర్తి కావస్తున్న సందర్భంగా పార్టీ శతజయంతి ఉత్సవాలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ మహబూబాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశం వరిపెల్లి వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా దేశంలో గ్రామ, గ్రామాన, వాడవాడలా ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వంద సంవత్సరాల ఘన చరిత్ర గలగిన పార్టీ దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే అన్నారు. దేశంలో వంద సంవత్సరాల నుండి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని పేద ప్రజల కోసం పోరాడుతుందన్నారు. పెట్టుబడిదారీలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు చేపట్టిన పార్టీ సిపిఐ మాత్రమేనని అన్నారు. రానున్న రోజులు కమ్యూనిస్టులదే భవిష్యత్తు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజల కోసం పని చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్తా చాటాలని కార్యకర్తల్లో జోష్ నింపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, వరిపెల్లి వెంకన్న, పెరుగు కుమార్ రేషపల్లి నవీన్ చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, తండా సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రవణ్, మేక వీరన్న, కేదాసు రమేష్, ఎండి మహమూద్, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, బైస స్వామి, జంపాల వెంకన్న, సారిక శ్రీనివాస్, మాలోతు రవీందర్, బాలకృష్ణ, బందు మహేందర్, పోలేపాక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి మేలు

ఎంపీ రఘునందన్ రావు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : ప్రజా సమస్యలకు పరిష్కారం చూపేది జర్నలిజం మాత్రమేనని పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు అన్నారు. విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి మేలు చేకూరుస్తుందని అభిప్రాయపడ్డారు. సంక్షేమ పథకాలను ప్రజలకు జర్నలిస్టుల ద్వారా మాత్రమే చేరుతాయన్నారు. జర్నలిస్టు రాసే ప్రతి వార్త పేద ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ ఐడిఓసిలో జర్నలిస్టులకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో "వార్తలప్" వర్క్‌షాప్ నిర్వహింగా ఎంపి రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రఘునందన్ రావు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా వార్తలు ప్రచురించాలన్నారు. విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి మేలు చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు ప్రముఖ పాత్ర వహిస్తున్నారని, జర్నలిస్టులు రాసే ప్రతి వార్త పేద వాళ్లకు ఉపయోగకరంగా ఉండేలా అట్టడుగు వర్గాల వారి అభ్యున్నతికి ఉపయోగపడాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రాల్లో నిర్వహించే సంతల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జర్నలిజం చాలా పవిత్రమైంది సమాజానికి ఉపయోగపడే వార్తలు ప్రచురించాలని సూచించారు. సమాజంలో ఇంకా కొనసాగుతున్న వివక్ష, మూఢనమ్మకాలు, సామాజిక బహిష్కరణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా వార్తలు రాసి ప్రజలను చైతన్య పరచాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ మానస్ కృష్ణ కాంత్, శివ చరణ్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ సుధాకర్ రెడ్డి, సీ-డాక్ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ డా. సి.రామకృష్ణయ్య, డిపిఆర్ఓ రామచంద్ర రాజు, బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరు నమోదు చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులంతా విధిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కోసం తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో ఓటరుగా తమ పేరు నమోదు చేసుకున్నప్పటికిని, ఈ ఎన్నికల్లో కూడా కొత్తగా తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్ లైన్ విధానంలో ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవచ్చని, ఆఫ్ లైన్ విధానంలో తహసిల్దార్ లేదా ఆర్డీవో కార్యాల యాల్లో సంబంధిత దరఖాస్తు ఫారమ్‌లు నింపి అర్హత పత్రాలు జత చేసి కార్యాలయాల్లో అందజేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పేరును నమోదు చేసుకోవడానికి నవంబర్ 6న గడువు ముగుస్తుందని, అర్హులైన వారందరు తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అభివృద్ధి సాధించడం కోసమే బాలశక్తి కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ (రెవెన్యూ), డీఆర్ఓ భుజంగరావు, డీఈవో రవీందర్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరుశురాం, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, పలు విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

ఐరన్‌మ్యాన్ 70.3తో హెర్బాలైఫ్ ఇండియా భాగస్వామ్యం

గోవా: ప్రీమియర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కంపెనీ హెర్బాలైఫ్ తాజాగా కమ్యూనిటీ మరియు ప్లాట్‌ఫారమ్ ఐరన్‌మ్యాన్ 70.3 ఇండియాతో తన భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఇది వరుసగా మూడవ సంవత్సరం సహకారాన్ని సూచిస్తుంది. ఈ ఒప్పందం ప్రీమియం స్పోర్ట్స్ న్యూట్రిషన్ ద్వారా అథ్లెటిక్ గొప్ప పర్ఫార్మెన్స్ కోసం మద్దతు ఇవ్వడం పట్ల హెర్బాలైఫ్ నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఐరన్‌మ్యాన్ 70.3 ఈవెంట్ అనేది వరల్డ్ ట్రయాథ్లాన్ కార్పొరేషన్‌కి అనుబంధంగా ఉన్న ఒక ప్రధానమైన సుదూర ట్రయాథ్లాన్. ఇది 1.9 కి.మీ ఈత, 90 కి.మీ బైక్ రైడ్, 21.1 కి.మీ పరుగుతో సహా మొత్తం 113.0 కి.మీ దూరాన్ని కవర్ చేస్తుంది. పోటీదారులకు సవాలుతో కూడిన ఆట, మరపురాని అనుభూతిని అందించే గోవాలోని సుందరమైన నేపథ్యంలో ఈ రేసు నిర్వహించబడుతుంది. ఈవెంట్ సమయంలో హెర్బాలైఫ్ అథ్లెట్లకు పోషకాహార మద్దతును అందిస్తుంది. వారు సరైన పర్ఫార్మెన్స్, హైడ్రేషన్ కోసం అవసరమైన ఉత్పత్తులను అందిస్తుందని హెర్బాలైఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్-సేల్స్, మార్కెటింగ్ పాంచాలి ఉపాధ్యాయ తెలిపారు.

భారతదేశంలో విస్తరిస్తున్న యూట్యూబ్ షాపింగ్

హైదరాబాద్: యూట్యూబ్ తాజాగా యూట్యూబ్ షాపింగ్ అనుబంధ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం ద్వారా భారతదేశంలో యూట్యూబ్ షాపింగ్‌ను విస్తరించనున్నట్లు ప్రకటించింది. దీని ద్వారా క్రియేటర్లు తమ ఆదాయాలను వైవిధ్యపరచడానికి, వీక్షకులు తమ అభిమాన సృష్టికర్తల నుండి ఉత్పత్తులను కనుగొనడానికి కొత్త అవకాశాలను సృష్టించారు. అర్హతగల క్రియేటర్లు తమ వీడియోలలో ఉత్పత్తులను ట్యాగ్ చేయడానికి, వీక్షకులు రిటైలర్‌ల సైట్‌లో వాటిని కొనుగోలు చేసినప్పుడు ఆదాయాన్ని ఆర్జించడానికి యూట్యూబ్ షాపింగ్ అనుబంధ ప్రోగ్రామ్ క్రియేటర్‌లకు అనుమతిస్తుంది. ఈ విస్తరణ ఇప్పటికే ఉన్న యూట్యూబ్ షాపింగ్ ఫీచర్‌ను సంపూర్ణం చేస్తుంది. దీని వలన అర్హత కలిగిన క్రియేటర్‌లు తమ స్టోర్‌లను వారి యూట్యూబ్ ఛానెల్‌లకు లింక్ చేయడంద్వారా వారి స్వంత వస్తువులను ప్రమోట్ చేసుకోవచ్చు. యూట్యూబ్ షాపింగ్ అనుబంధ ప్రోగ్రామ్ యాడ్స్ రాబడి, యూట్యూబ్ ప్రీమియం, బ్రాండ్ కనెక్ట్ వంటి మానిటైజేషన్ ఎంపికలు, ఛానెల్ మెంబర్‌షిప్‌లు, సూపర్ థాంక్స్, సూపర్ చాట్, సూపర్ స్టిక్కర్‌ల వంటి ఇతర ఫ్యాన్-ఫ్యూయెల్ ఫీచర్‌లను రూపొందించి, వేదికపై క్రియేటర్‌లు అభివృద్ధి చెందడానికి సమగ్రమైన సాధనాలను అందిస్తోంది.

సూపర్‌మెర్కాడోస్‌తో జీఆర్ఎం ఓవర్సీస్ భాగస్వామ్యం

విశాలాంధ్ర-హైదరాబాద్: జీఆర్ఎం ఓవర్సీస్ లిమిటెడ్, చిలీలోని సూపర్‌మెర్కాడోస్ సెంట్రల్ లిమిటెడ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సహకారం జీఆర్ఎం గ్లోబల్ విస్తరణ ప్రయత్నాలలో ఒక కీలక ఘట్టాన్ని సూచిస్తుందన్నారు. ఎందుకంటే ఇది సూపర్‌మెర్కాడోస్ సెంట్రల్ లిమిటెడ్ విస్తృత పంపిణీ నెట్‌వర్క్ ద్వారా చిలీ వినియోగదారులకు దాని ఫ్లాగ్‌షిప్ బాస్మతి రైస్ బ్రాండ్ 'తనోష్'ని పరిచయం చేసిందన్నారు. 'తనోష్' 1 కిలోలు మరియు 5 కిలోల ప్యాక్‌లలో అందించబడుతుందన్నారు. ఒప్పందం ప్రకారం, సూపర్‌మెర్కాడోస్ సెంట్రల్ లిమిటెడ్ చిలీలో జీఆర్ఎం ఓవర్సీస్ ఉత్పత్తుల ప్రత్యేక పంపిణీదారుగా వ్యవహరిస్తుందన్నారు. జీఆర్ఎం ఓవర్సీస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అతుల్ గార్గ్ ఇలా మాట్లాడుతూ సూపర్‌మెర్కాడోస్ సెంట్రల్ లిమిటెడ్‌తో భాగస్వామ్యం మా ప్రపంచ పాదముద్రను పెంచడానికి ఒక వ్యూహాత్మక చర్య అన్నారు.

27న జీ తెలుగులో డబుల్ ఇస్మార్ట్

విశాలాంధ్ర-వరంగల్: జీ తెలుగు ఈ వారం మరో కొత్త సినిమాతో వచ్చేస్తోంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన మాస్‌ఎంటర్టైనర్ 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను ఈ వారం వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా అందిస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అద్భుతమైన కథ, కథనంతో పాటు పూరీ జగన్నాథ్ డైరెక్షన్, రామ్ నట విశ్వరూపంతో డబుల్ ఇస్మార్ట్, ఈ నెల 27న సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతుందన్నారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా కథ అంతర్జాతీయ మాఫియా డాన్ బిగ్ బుల్ (సంజయ్ దత్) చుట్టూ తిరుగుతుందన్నారు. అతని జ్ఞాపకశక్తిని మరొకరి మెదడుకు బదిలీ చేయడం వల్ల అతను అమరుడవుతాడని ఒక శాస్త్రవేత్త సూచించడంతో అందుకు సరిపోయే వ్యక్తి కోసం అన్వేషణ మొదలవుతుందన్నారు. ఆ తర్వాత ఏం జరుగుతుందనే విషయం తెలియాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే డబుల్ ఇస్మార్ట్ సినిమా చూడాల్సిందే అన్నారు. యాక్షన్, కామెడీ, థ్రిల్లింగ్ కాన్సెప్ట్తో రూపొందిన ఈ మాస్‌ఎంటర్టైనర్ని జీ తెలుగు వేదికగా ఈ నెల 27న మీరు తప్పకుండా చూడాలన్నారు.

బంధన్ బ్యాంక్ మొత్తం వ్యాపార వృద్ధి 24%

హైదరాబాద్: బంధన్ బ్యాంక్ 2024-25 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. బ్యాంక్ మొత్తం వ్యాపారం 24% పెరిగి రూ.2.73 లక్షల కోట్లకు చేరుకుంది. మొత్తం డిపాజిట్లలో బ్యాంక్ రిటైల్ వాటా ఇప్పుడు దాదాపు 68% వద్ద ఉంది. గత త్రైమాసికంలో చూసిన ప్రోత్సాహకరమైన వృద్ధికి పంపిణీలో దాని విస్తరణ, వ్యాపార సామర్థ్యం మరియు అనుకూలమైన నిర్వహణ వాతావరణం కారణంగా నడపబడింది. బ్యాంక్ ఇప్పుడు భారతదేశంలోని దాదాపు 6,300 బ్యాంకింగ్ అవుట్‌లెట్‌ల ద్వారా 3.5 కోట్ల మంది వినియోగదారులకు సేవలు అందిస్తోంది. బంధన్ బ్యాంకులో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగుల సంఖ్య ఇప్పుడు దాదాపు 80,000. క్యూ2 ఎఫ్‌వై25లో, బ్యాంక్ డిపాజిట్ బుక్ అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 27% పెరిగింది. మొత్తం డిపాజిట్ బుక్ ఇప్పుడు రూ.1.43 లక్షల కోట్లు కాగా, మొత్తం అడ్వాన్సులు రూ.1.31 లక్షల కోట్లు. కరెంట్ ఖాతా మరియు పొదుపు ఖాతా నిష్పత్తి మొత్తం డిపాజిట్ పుస్తకంలో 33.2% వద్ద ఉంది. బ్యాంక్ స్థిరత్వానికి సూచిక అయిన క్యాపిటల్ అడిక్వసీ రేషియో నియంత్రణ అవసరాల కంటే 15.6% ఎక్కువగా ఉంది.

సామ్‌సంగ్ హెల్త్‌లో మెడికేషన్స్ ట్రాకింగ్ కొత్త ఫీచర్ విడుదల

గురుగ్రామ్: వినియోగదారులు తమ ఆరోగ్యాన్ని మరింత సమగ్రంగా నిర్వహించడంలో సహాయ పడటానికి వీలుగా సామ్‌సంగ్ హెల్త్ యాప్2నకు మెడికేషన్స్ ట్రాకింగ్ ఫీచర్1ని జోడించినట్లు భారతదేశ అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్ ప్రకటించింది. ఈ ఫీచర్ వినియోగదారులకు వారికి సిఫారసు చేయబడిన లేదా ఓవర్ ది కౌంటర్ మందుల విధానాన్ని ట్రాక్ చేయడానికి వీలు కల్పించడమే కాకుండా ముఖ్యమైన వైద్య సమాచారం, చిట్కాలను కూడా అందిస్తుంది. రక్తపోటు, మధుమేహం, పిసిఓఎస్, పిసిఓడి, సకాలంలో మోతాదులు అవసరమయ్యే ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి చికిత్సలో ఉన్న వారికి మందులకు కట్టుబడి ఉండే స్థిరత్వాన్ని ట్రాక్ చేయడంలో ఈ ఫీచర్ సహాయపడుతుందని నోయిడాలోని సామ్‌సంగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ క్యుంగ్యున్ రూ అన్నారు.

బాదం పప్పులతో దీపావళి వేడుకలు

ముంబయి: దీపావళి పండుగ సమయంలో ఎక్కువగా చక్కెరతో కూడిన విందులు, వేయించిన స్నాక్స్, పిండి పదార్థాలు అధికంగా ఉండే ఆహారపదార్థాలను తీసుకుటారు. దీనివల్ల రక్తంలో చక్కెర పెరుగుతుంది. అందుకే బాదం వంటి పోషకమైన ఎంపికలను చేసుకోవటం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు అంటున్నారు. బాదంపప్పులో ప్రోటీన్, కాల్షియం, జింక్, డైటరీ ఫైబర్, మెగ్నీషియం వంటి 15 ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇవి మొత్తం ఆరోగ్యంను కాపాడుతూ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వాటిలోని అధిక ఫైబర్, ప్రోటీన్ ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచడంలో సహాయపడతాయి, అతిగా తినాలనే కోరికను అరికడుతుంది. ప్రోటీన్ అధికంగా ఉండటం వల్ల బాదం కండరాల పెరుగుదల, నిర్వహణకు తోడ్పడుతుంది. ప్రతి రోజూ ఒక గుప్పెడు బాదంపప్పులను తీసుకోవడం వల్ల అవి కార్బోహైడ్రేట్ ఆహారాల ప్రభావాన్ని తగ్గించడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించవచ్చని న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి తదితరులు చెపుతున్నారు.

సంచలనాత్మక అధ్యయనాన్ని ఆవిష్కరించిన డోజీ

బెంగుళూరు: భారతదేశ ఆరోగ్య ఏఐ నాయకునిగా ఖ్యాతి గడించిన డోజీ, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన జర్నల్ ఫ్రాంటియర్స్ ఇన్ మెడికల్ టెక్నాలజీలో ప్రచురించబడిన అధ్యయన ఫలితాలను ఆవిష్కరించింది. ఈ జర్నల్ ప్రతిష్టాత్మక ఫ్రాంటియర్స్ గ్రూప్‌లో భాగం. ఈ అధ్యయనం కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్శిటీ (కెజిఎంయు)లో జరిగింది. భారతీయ టెరిషియరీ కేర్‌లో ఈ తరహా అతిపెద్ద పరిశీలనా అధ్యయనాలలో ఇది ఒకటి. ఈ అధ్యయనం డోజీ ఏఐ-శక్తివంతమైన ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ (ఈడబ్ల్యుఎస్) సంచలనాత్మక ప్రభావాన్ని వెల్లడించింది, రోగి ఆరోగ్యం క్షీణించడాన్ని 16 గంటల ముందుగానే అంచనా వేయగల దాని సామర్థ్యాన్ని ఇది ప్రదర్శిస్తుంది. తద్వారా ముందస్తుగా జోక్యం చేసుకోవడానికి, ప్రాణాలను రక్షించడానికి ఒక క్లిష్టమైన అవకాశాన్ని ఆరోగ్య సంరక్షణ నిపుణులకు అందిస్తుంది. ఈ సాంకేతికత 95% ఆసుపత్రి సామర్థ్యంలో సంరక్షణను మార్చగల సామర్థ్యాన్ని కలిగి ఉంది, ఐసియు సేవల ఖర్చులో స్వల్ప ఖర్చుతోనే ప్రపంచ-స్థాయి ఆరోగ్య సంరక్షణను నిర్ధారిస్తూ ప్రాణాలను కాపాడే నిరంతర పర్యవేక్షణను అందిస్తుంది.

ఎల్ అండ్ టీ ఫైనాన్స్ వృద్ధిరేటు 17% పెరుగుదల

ముంబై: ఎల్ అండ్ టీ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎల్‌టీఎఫ్), భారతదేశంలోని ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలలో ఒకటి. సెప్టెంబరు 30, 2024తో ముగిసిన రెండవ త్రైమాసికంలో 17% పెరిగి రూ. 696 కోట్ల (కన్సాలిడేటెడ్)ని నమోదు చేసింది. రిటైల్ బుక్ రూ. 88,975 కోట్లుగా, 28% వృద్ధిని ప్రతిబింబిస్తుంది. ఏకీకృత లోన్ బుక్ 18% పెరిగింది, మార్చి 31, 2020తో ముగిసిన ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నుండి అత్యధిక స్థాయికి చేరుకుంది. సెప్టెంబర్ 30, 2024తో ముగిసిన రెండవ త్రైమాసికంలో కంపెనీ త్రైమాసిక రిటైల్ చెల్లింపులు రూ.15,092 కోట్లు నమోదు చేసింది, ఇది సంవత్సరానికి 12% పెరిగింది. అదనంగా, కంపెనీ కస్టమర్-ఫేసింగ్ ప్లానెట్ యాప్ వినియోగదారులకు శక్తివంతమైన డిజిటల్ మార్గంగా ఉంది, ఇప్పటి వరకు 1.25 కోట్ల డౌన్‌లోడ్‌లను అధిగమించింది.

అమెజాన్ పే చెల్లింపులుపై భారీ ఆఫర్లు

బెంగళూరు: అమెజాన్.ఇన్‌లో గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సమయంలో అమేజాన్ పేను వినియోగించడానికి 9 బహుమానపూర్వక విధాలున్నాయని ప్రకటించింది. విహార యాత్ర కోసం బుక్కింగ్ చేయాలని కోరుకున్నా, ధనత్రయోదశికి డిజిటల్ గోల్డ్ కొనుగోలు చేయడానికి లేదా కుటుంబ సభ్యులకు డబ్బులు పంపించడానికి, అమేజాన్ పే క్యాష్ బాక్, డిస్కౌంట్లు, బంపర్ రివార్డ్స్‌ను వివిధ శ్రేణులలో అందిస్తోంది. ఆకర్షణీయమైన డిస్కౌంట్లతో ప్రయాణంతోపాటు డిజిటల్ గోల్డ్ పై భారీ ఆదాలు పొందవచ్చు. అలాగే, ఊబర్, స్విగ్గీ, జొమేటో వంటి యాప్స్‌లో అద్భుతమైన ఆఫర్లు, మరిన్ని క్యాష్ బాక్ ఆఫర్లను పొందడానికి అమేజాన్ పే బ్యాలెన్స్‌ను టాప్ అప్ చేయవచ్చని తెలిపింది. అమేజాన్ పే లేటర్ యూజర్ల కోసం ప్రత్యేకమైన రివార్డ్స్ ఉంటాయనని, ప్రైమ్ క్రెడిట్ కార్డ్ హెూల్డర్స్ కోసం పండగ ప్రయోజనాలుటాయని ప్రకటించింది. అన్ని చెల్లింపులు, రీఛార్జ్‌లు కోసం ప్రోత్సాహకాలు, అమేజాన్ పే గిఫ్ట్ కార్డ్స్‌పై సాటిలేని క్యాష్ బాక్ ఆఫర్లు కోసం అమేజాన్ పే యుపిఐని వాడాలని సూచించింది.

ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆర్థిక ఫలితాలు వెల్లడి

ముంబయి: భారతదేశం యొక్క ప్రముఖ సమీకృత సరఫరా గొలుసు, లాజిస్టిక్స్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (టీసీఐ), సెప్టెంబర్ 30, 2024తో ముగిసిన మొదటి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. రూ.11314 మిలియన్ల ఏకీకృత ఆదాయాన్ని నివేదించింది ఇది గత సంవత్సరం ఇదే కాలంలో 10048 మిలియన్లతో పోలిస్తే 12.6% వృద్ధిని సూచిస్తుంది. వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు కంపెనీ ఆదాయాలు (ఈబీఐటీడీఏ) గత ఏడాది రూ.1319 నుంచి రూ.1519 అంటే 15.2% పెరుగుదల కన్పించింది. పన్ను తర్వాత లాభం (ప్యాట్): మునుపటి సంవత్సరం సంబంధిత త్రైమాసికంలో రూ.878 మి.తో పోలిస్తే 22.2% పెరిగి, రూ.1073 మిలియన్ల వద్ద నిలిచింది.

సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఆర్థిక ఫలితాలు వెల్లడి

హైదరాబాద్: సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఎస్ఎస్ఎఫ్‌బీ) సెప్టెంబర్ 30, 2024తో ముగిసిన త్రైమాసికం, అర్థ సంవత్సరానికి తన అన్‌ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. నికర వడ్డీ ఆదాయంలో స్థిరమైన వృద్ధి, బలమైన నిర్వహణ నగదు ప్రవాహంతో బ్యాంక్ సానుకూల పనితీరును కనబరిచింది. ఎస్ఎస్ఎఫ్‌బీ నికర లాభం రూ.45.4 కోట్ల వద్ద నిలిచింది. ఇది సంవత్సరానికి వైటవై ప్రాతిపదికన దాదాపు 9.8% క్షీణించింది. నికర వడ్డీ ఆదాయం రూ. 221.0 కోట్ల నుండి రూ. 300.0 కోట్లకు 35.7% పెరిగింది. పన్ను తర్వాత లాభం (పీఏటీ) రూ. 50.3 కోట్ల నుండి రూ. 45.4 కోట్లకు 9.8% తగ్గింది. స్థూల అడ్వాన్స్‌లు 35.2% వృద్ధి చెంది రూ. 9,360 కోట్లుకు చేరింది. డిపాజిట్లు 38.6%కి పెరిగి రూ. 8,851 కోట్లకు చేరింది.

సంపాదకీయం

ప్రాణాలతో చెలగాటం

వర్షాలను వెన్నంటి విషజ్వరాలు, డయేరియా, అంటువ్యాధులు విజృంభణ ఏటా కొనసాగుతున్నా... అందుకు తగిన ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకదానితో ఒకటి పోటీపడి నయా ఉదారవాద ఆర్థిక విధానాలను విశృంఖలంగా అమలు చేయడంలో ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై ఏమాత్రం చూపడంలేదు. ఇటీవల కాలంలో పాలకులు తాగునీటిని అమ్మకపు సరుకుగా మార్చివేశారు. దానితో ప్రాణాధారమైన తాగు నీరు కలుషితమై సామాన్యుల ఉసురుతీస్తోంది. డబ్బులిచ్చి తాగునీరు కొనలేక పైప్‌లైన్ల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిపై ఆధారపడిన ప్రజలకు పాలకుల తీవ్ర నిర్లక్ష్యం ప్రాణసంకటంగా మారింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో యధేచ్ఛగా విజృంభిస్తున్న డయేరియాకు ఇప్పటికే పదుల సంఖ్యలో మృతిచెందగా, వందలాది మంది వివిధ ఆసుపత్రులలో చికిత్సపొందుతున్నారు. అధికారులు ఎప్పటిలాగానే హడావుడి చేయడం మినహా డయేరియా అదుపు, బాధితులకు వైద్యం అందేందుకు చేసింది శూన్యం. విజయనగరం జిల్లా గుర్ల మండల కేంద్రంలో డయేరియాతో జనం బాధపడి పరిస్థితి కొంత సర్దుమణిగిన తర్వాత పదిరోజులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామాన్ని సందర్శించి, సమీక్షచేసి చేతులు దులుపుకున్నారు. ఎప్పటిలాగానే ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించకుండా, ఈ పరిస్థితికి గత ప్రభుత్వ తప్పిదాలే కారణమని విరుచుకుపడ్డం మినహా చేసింది ఏమీలేదు. ప్రతిపక్ష నాయకుడు జగన్ ఇంకా తీరికగా గురువారం గ్రామంలో పర్యటించి డయేరియాపై పుట్టెడు కన్నీరు కార్చేశారు. గుర్లమండలంలో డయేరియాతో 345 మంది ప్రభుత్వాసుపత్రిలో చేరగా, అంతకంటే ఎక్కువగా దాదాపు 450 మంది ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్నారనీ, విజయనగరం జిల్లాలోని గరివిడి, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల్లో ఇప్పటికీ డయేరియా కేసులు నమోదవుతూనే ఉన్నాయనీ, ఇంతటి దారుణ పరిస్థితి ఉంటే ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ పార్టీ తరపున బాధితులను ఆదుకుంటామనీ, మృతిచెందిన 14 మంది కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామనీ, అధికారంలో ఉన్న మీకు మరింత బాధ్యత ఉంటుంది, ప్రభుత్వం తరపున మీరు ఎంత ఇవ్వబోతున్నారో ప్రకటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. ఈ విధంగా అధికార, ప్రతిపక్ష నేతలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవడం మినహా బాధితులను ఆదుకునేందుకు, డయేరియా అదుపునకు చేపట్టిన చర్యలు శూన్యం. ఫలితంగా రాష్ట్రంలోని అనేక కొత్త ప్రాంతాలలో డయేరియా వ్యాపిస్తోంది. పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనీపురం కాలనీని డయేరియా వణికిస్తోంది. డయేరియాతో ఇప్పటికే విద్యార్థి సహా ఇద్దరు మృతిచెందగా పదిమంది ఆసుపత్రి పాలయ్యారు. కలుషిత నీటి కారణంగా డయేరియా వ్యాప్తి జరిగినట్లు తెలుస్తోంది. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం దాచేపల్లిలో గురువారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. డయేరియాతో వడియరాజుల కుటుంబాలకు చెందిన ఇద్దరు మృతి చెందడంతో ఆ కాలనీ శోకసంద్రంలో మునిగింది. రాష్ట్రంలోని ఏదో ఒక మూల డయేరియాతో ఆసుపత్రిపాలవుతున్న, మరణిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఇందుకు సంబంధించి వార్తలు పత్రికలలో వచ్చే వరకు ప్రభుత్వంలో కదలికరాకపోవడం అత్యంత విచారకరం. సమస్యను పరిష్కరించడానికి బదులు కప్పిపుచ్చేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ప్రజలకు ప్రాణాంతకంగా మారుతున్నాయనడంలో ఎటువంటి సందేహంలేదు. ఫిబ్రవరిలో గుంటూరులో, మేలో విజయవాడలో, జులై నెలలో పల్నాడు జిల్లా దాచేపల్లి, పిడుగురాళ్ల, కారంపూడి మండలాల్లో డయేరియా కేసులు నమోదయ్యాయి. కొంత మంది ప్రాణాలు కోల్పోయారు కూడా. అప్పుడే ప్రభుత్వం పట్టించుకుని చర్యలు తీసుకుని ఉంటే డయేరియా ఇప్పుడు ఇంతగా విజృంభించే అవకాశం అంతగా ఉండేదికాదు.

మంచినీటి పైపులైన్లు డ్రైనేజీ వ్యవస్థ సమీపంలో ఉండి లీకవడం, పారిశుధ్యం లోపించడం, క్లోరినేషన్ సరిగా చేయకపోవడం, ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రపరచకపోవడం వల్ల అతిసారం విజృంభిస్తున్నది. తాగునీరు విస్తృతంగా కలుషితం కావడమే డయేరియా తీవ్రతకు కారణమని ర్యాపిడ్ రెస్పాన్స్ టీం వెల్లడించింది. గుర్ల నుంచి సేకరించిన 44 నీటి నమూనాలలో 31 నమూనాల్లో కోలిఫామ్ బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారించి, తాగేందుకు ఉపయోగం కాదని తెలిపింది. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటివి ఇంతగా ప్రకోపించడానికి దోమలు, వ్యాధికారక పరాన్న జీవులే ప్రధానకారణం. అందుకు ముందుగా తప్పుపట్టాల్సింది పారిశుద్ధ్య నిర్వహణ లోపాలు, స్థానిక సంస్థల నిర్లక్ష్యం. పరిసరాల అపరిశుభ్రత, డ్రెయిన్ల సమీపంలో ఉన్న పైపులైన్ల నిర్వహణ తదితరాలన్నింటా పాలకుల పూర్తి నిర్లక్ష్యం, అలసత్వం మేటవేసుకుపోయి ప్రజారోగ్యానికి తూట్లు పొడుస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా.. పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్యశాఖల మధ్య సమన్వయరాహిత్యం, వాటి వైఫల్యాలే ఈ వ్యాధుల వీరంగానికి ప్రధాన కారణం. ఇది ఏ ఒక్క రాష్ట్రానికో పరిమితమైన వైపరీత్యం కాదు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ దాదాపు పరిస్థితి ఇలానే ఉంది. డ్రెయిన్లలో ఉన్న పైపులైన్ల కారణంగా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని అధికారులు చెపుతున్నప్పటికీ అటువంటి పైపులైన్లు, లీకేజి అవుతున్న పంపులైన్లను మార్చేందుకు తీసుకుంటున్న చర్యలు శూన్యం. అటువంటి వాటిని మార్చివేయడం తక్షణావశ్యం. తాగునీటి పథకాలలో ఫిల్టర్ బెడ్లను ఎప్పటికప్పుడు మార్చివేయాలి, ప్రతి రోజూ నీటి నమూనాలను సేకరించి క్లోరిన్ తదితర అంశాలను పరీక్షించడం వంటి నిబంధనలను ఇప్పటికైనా పాలకులు అమలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డయేరియా వ్యాప్తిని అరికట్టాలి. నీటి కలుషితంపట్ల అధికారులను అప్రమత్తం చేయాలి. మంచినీటి పైపులైన్లకు మరమ్మత్తులు చేపట్టి, క్లోరినేషన్ ప్రక్రియ సక్రమంగా చేసి, అతిసార వ్యాధి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టవలసివుంది. డయేరియాతో పాటు రాష్ట్రంలో జ్వరాలు,చికున్ గున్యా, డెంగీ, మలేరియా పోటీపడి విజృంభించడానికి కారణాలేమిటో లోతుపాతులెరిగి తక్షణ దిద్దుబాటు చర్యలతో యంత్రాంగం యుద్ధసన్నద్ధత చాటాల్సిన తరుణమిది. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకొని పాలకులు సమర్థవంతంగా సమన్వయంతో పకడ్బందీ వ్యూహాన్ని పట్టాలకు ఎక్కిస్తేనే తప్ప ప్రజారోగ్యం తెరిపిన పడదు. సమస్య మూలాలు సజీవంగా ఉన్నంతవరకూ, దోమలపై పోరు పటిష్ఠంగా సాగనంతకాలం డెంగీ, మలేరియా, అతిసార, టైఫాయిడ్ తదితర వ్యాధులు కోరలు చాస్తూనే ఉంటాయి. ప్రజల ప్రాణాలను ఆబగా హరిస్తూనే ఉంటాయి. ప్రజారోగ్యాన్ని ఉపేక్షించినంత కాలం ఎన్నెన్ని అభివృద్ధి వ్యూహాలైనా సమగ్రవికాసానికి దోహదపడవు అనే వాస్తవాన్ని గుర్తెరిగి పాలకులు వ్యవహరించాలి. గత ప్రభుత్వంపై ప్రస్తుత పాలకులు, ప్రస్తుత ప్రభుత్వంపై గత పాలకులు విమర్శనాస్త్రాలు సంధించుకోవడం వల్ల ప్రజలకు ఒనగూడేది ఏమీ ఉండదు.

రాజకీయ లబ్ధికే సనాతన నినాదం

సురవరం సుధాకరరెడ్డి

ఏ నినాదం వెనక ఎవరి ప్రయోజనాలు దాగిఉన్నాయో తెలుసుకోనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు అని సోషలిస్టు రాజ్య నిర్మాత లెనిన్ ఎప్పుడో హెచ్చరించారు. చే గువేరా భక్తుడినని చెప్పుకున్న పవన్‌కళ్యాణ్ హఠాత్తుగా సనాతనధర్మం గురించి తిరుపతిలో ఊగి ఊగి ఉన్మత్తోపన్యాసం చేయడం చాలామందికి ఆశ్చర్యం కలిగింది. ఈ అంశంపైన కామ్రేడ్ డీవీవీఎస్ వర్మ ఒక మంచి వ్యాసం రాశారు. నేను కూడా కొన్ని అంశాలు జోడిస్తున్నాను. కొన్ని విషయాలు పునరావృతం కావచ్చు.

సనాతన ధర్మం అంటే ఏమిటి అనేది దానిని బలపరిచేవారు చెప్పలేకపోతున్న ఒక బ్రహ్మ పదార్థం. సనాతన ధర్మాన్ని వ్యతిరేకించడ మంటే హిందూమతాన్ని వ్యతిరేకించడమనే ఒక అబద్ధపు వాతావరణాన్ని కలగజేస్తున్నారు. ఇప్పుడు దానిపైన బెనారస్‌లో 1904 లో హిందూ కాలేజీ ట్రస్టీలు ప్రచురించిన ఒక ఇంగ్లీషు పుస్తకాన్ని ఒక మిత్రుడు వాట్సప్‌లో అందించాడు. 247వ పేజీలో ఈ పుస్తకం ద్వారా "సనాతన ధర్మం" ఏమిటో వారు నిర్వచించారు.

ఈ పుస్తకంలో మూడు భాగాలున్నాయి. మొదటి పార్టు 6 చాప్టర్లలో హిందూ మత మౌలిక భావనలు, రెండవ పార్టులో ఏడు చాప్టర్లు, సనాతన ధర్మము- హిందూ ఆచార వ్యవహారాలు, మూడవ పార్టులో సనాతన ధర్మం- నైతిక బోధనలు ఉన్నాయని వివరించారు. బొల్లోజు బాబా "సనాతన ధర్మం కొన్ని చర్చనీయాంశాలు"గా అందులోని ప్రధాన అంశాలను చర్చించారు. వారి ప్రకారం సనాతనధర్మం హిందూమత విశ్వాసాలు, ఆచారాలు, సంప్రదాయాలు కలిసి "సనాతన ధర్మం" అవుతుంది. ఇందులో మనుధర్మ శాస్త్రం కూడా కలిసి ఉంది. ప్రధానమైన సారాంశం బ్రాహ్మణాధిక్యతతో కూడిన వర్ణ విభజన. ఈ భూగోళంలోని సంపదంతా బ్రాహ్మణులదే. శూద్రులకు చదువుకునే హక్కులేదు. వారు పై వర్ణాలకు సేవ చేయాలి. అస్పృశ్యులు వారు సహజంగా సంఘ బహిష్కృతులే. సనాతన ధర్మమని చెప్పే దానిని అనేకమంది హిందూమత ప్రచారకులు కూడా నిరాకరించారు. ఉదా: వివేకానందుడు కుల వివక్షను, అస్పృశ్యతను తీవ్రంగా నిరసించాడు. ఇతర మతాలలోకి వెళ్లిన హిందువులను, మళ్లీ హిందూమతంలోకి చేర్చి శుద్ధిచేసి, హిందూమతాన్ని సంస్కరించడానికి ప్రయత్నించిన "ఆర్య సమాజ్" సంస్థాపకుడు స్వామి దయానంద సరస్వతి దీనిని నిరసించాడు.



సనాతన ధర్మానికి నిర్వచనం మారుతూ వచ్చినట్లు కనపడినా మౌలికంగా బ్రాహ్మణాధిక్యతా- కుల వివక్ష- అస్పృశ్యత వేదాలలో యజ్ఞయాగాదుల్లో బలి ఇచ్చిన ఎద్దులు, దూడలు వాటి మాంసాన్ని యజ్ఞం నిర్వహించిన బ్రాహ్మణులు భుజించేవారు. వందల వేల పశువుల వధ నిరంతర యజ్ఞాలలో కొనసాగడంపై రైతులు, వ్యవసాయదారుల ఆగ్రహానికి గురికావడం, యజ్ఞయాగాదులు, పశువధలేని బౌద్ధమతం విస్తృతికి తోడ్పడి ఉండవచ్చు. ఆఖరి మగధరాజును హత్యచేసిన పుష్యమిత్రుడు బౌద్ధుల మీద దారుణమైన హింసాకాండ సాగించినా, హిందూమత పునరుద్ధరణ జరగలేదు. శంకరాచార్య హిందూమత పునరుద్ధరణ పెద్ద ఎత్తున సాగించిన సందర్భంలో యజ్ఞయాగాదులు లేని మతాన్ని, బ్రాహ్మణులకు మాంస భక్షణను నిషేధించినట్లు కనపడుతున్నది.

సనాతనధర్మం హిందూమత విశ్వాసాలు, ఆచారాలు, సంప్రదాయాలు కలిసి "సనాతన ధర్మం" అవుతుంది. ఇందులో మనుధర్మ శాస్త్రం కూడా కలిసి ఉంది. ప్రధానమైన సారాంశం బ్రాహ్మణాధిక్యతతో కూడిన వర్ణ విభజన. ఈ భూగోళంలోని సంపదంతా బ్రాహ్మణులదే. శూద్రులకు చదువుకునే హక్కులేదు. వారు పై వర్ణాలకు సేవ చేయాలి. అస్పృశ్యులు వారు సహజంగా సంఘ బహిష్కృతులే. సనాతన ధర్మమని చెప్పే దానిని అనేకమంది హిందూమత ప్రచారకులు కూడా నిరాకరించారు.

భగవద్గీతపై ఒక వివరమైన విశ్లేషణ చేసిన ప్రొ॥రామకృష్ణ సనాతన ధర్మం మీద ఆచార వ్యవహారాల మీద అనుమానాలు, వ్యతిరేకత ప్రారంభమైనప్పుడు "శ్రీకృష్ణుడి" ద్వారా భగవద్గీతను ప్రబోధింపజేసి వివక్షతతో కూడిన హిందూమత సనాతన ధర్మాన్ని కాపాడే ప్రయత్నం జరిగింది. మాన్యుఫ్యాక్చరింగ్ కన్‌సెంట్ నీకు తెలియకుండానే నీ మెదడును, నీ మనసును "సనాతన ధర్మానికి సమ్మతిని" పుట్టుక నుంచి రుద్దుతున్నారు. "సనాతన సంస్థ" అనే ఒక సంస్థ గోవాలో ఉంది. దాని కార్యక్రమాలు, సంస్థ అధినేతలు రహస్యం. "అంధ వ్యతిరేక, మూఢ విశ్వాసాల వ్యతిరేక ఉద్యమం నడుపుతున్న డా॥నరేంద్ర దభోల్కర్‌ను, ప్రొఫెసర్ ఎంఎం కల్బుర్గీని, కమ్యూనిస్టు నాయకుడు, వామపక్ష రచయిత గోవింద పన్సారేను, ప్రగతిశీల జర్నలిస్టు గౌరీ లంకేశ్‌ను హత్య చేసింది ఈ సనాతన సంస్థ వారేనని పోలీసులు నిర్ధారణకు వచ్చి కేసులు పెట్టారు. అరెస్టులు చేశారు. కాని ఎవరికీ శిక్షలు పడలేదు. 20 సంవత్సరాల క్రితమే దానిని నిషేధించాలని మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు చేసినా, అప్పటి కాంగ్రెసుగాని, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వంగాని స్పందించలేదు. దీని అర్థం సనాతనమంటే ఒక మత విశ్వాసమే కాదు.

మూఢ విశ్వాసాలను వ్యతిరేకించకూడదు. సైన్సును అంగీకరించరాదు. మూఢ విశ్వాసాలను వ్యతిరేకించే వారిని హత్యలు చేసి, భయోత్పాతాన్ని సృష్టించాలి. మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయి మరణించినప్పుడు, ఆయనకు నివాళి అర్పించడానికి వచ్చిన ఆర్యసమాజ్ నాయకుడు స్వామి అగ్నివేశ్‌ను బీజేపీ కేంద్ర కార్యాలయంలో దుర్భాషలాడి, భౌతిక దాడిచేసి, బట్టలు చించి అవమానించి పంపించారు. బహుశా స్వామి వివేకానంద బతికుంటే ఆయన మీద కూడా దాడి చేసేవారు. "సనాతనం అంటే చలనంలేని మార్పు అంగీకరించని విశ్వాసం" అని చెప్పవచ్చు. సనాతనం సమాజాన్ని వెయ్యేళ్లు వెనక్కి తీసుకెళ్తుంది. సనాతనం అంటే మార్పులేని పూర్వ ఆచార వ్యవహారాలు అయితే సతీ సహగమనం మళ్లీ ప్రవేశపెట్టాలి. ఆడపిల్లలకు ఎనిమిది సంవత్సరాలకే వివాహం చేయాలి. స్త్రీలకు ఆస్తి హక్కు ఉండకూడదు. స్వతంత్రంగా జీవించకూడదు. శూద్రులు చదువుకోకూడదు.

ఇందులో అన్ని విషయాలు కాకపోయినా కొన్నయినా పవన్‌కల్యాణ్‌కు తెలిసి ఉండాలి. నిచ్చెన మెట్ల కులవ్యవస్థను, అస్పృశ్యతను ఆయన అంగీకరిస్తున్నట్లా? దానికి ఆయన సమాధానం చెప్పాలి. "సనాతన ధర్మాన్ని" సమర్థించే ఆయన నినాదం వెనక ఒక రాజకీయ ప్రయోజనం ఉంది. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్రిస్టియన్ కాబట్టి ఆయనను ఇరుకున పెట్టేందుకు తాను హిందూ ధర్మ పరిరక్షకుడిగా ప్రతిష్ఠించుకొని, కేంద్ర బీజేపీ మద్దతుతో తన బలాన్ని పెంచుకోవడం. దానికంటే ముఖ్యమైంది, టీడీపీ నాయకుడు చంద్రబాబు కుమారుడు లోకేశ్ తదుపరి ముఖ్యమంత్రి కాకుండా, తాను ముఖ్యమంత్రి కావటానికి హిందూ మతోద్ధారకుడిగా, సనాతనధర్మ పరిరక్షకుడిగా ముందుకు వచ్చి, ప్రభుత్వ వైఫల్యాల నుంచి, అసమర్థత నుంచి దృష్టి మళ్లించే వాగాడంబరం. అధికారం కోసం ఏ నినాదాన్నైనా ఉపయోగించుకోవచ్చునన్న ధర్మ సూక్ష్మం పవన్ కల్యాణ్‌కు అర్థమైనట్లు కనపడుతోంది.

పూల పాటల పండుగలు

పువ్వులే పండుగ. అవును, పూలతో పరవళ్లు తొక్కుతూ మహిళలు, చిన్నారులు లయబద్ధంగా నృత్యాలుచేస్తూ సామూహికంగా పండుగను జరుపుకోవడం మీకెక్కడైనా కనిపించిందా. ఆ పూల గోపురాలని అపురూపంగా చంటి పిల్లల్ని ఎత్తుకుని ఆడించినట్లుగా, లాలించినట్లుగా, కళ్లల్లో ఓ మెరుపు మెరుస్తున్నట్లుగా.. అవే తమ జీవితాలను మార్చే బతుకమ్మలుగా ఆడుకునే అమ్మాయిలు మీకెక్కడైనా కనిపించారా. అద్భుత రాగాలతో అలరించే ఆ పాటలు, ఆటలు మీకెక్కడైనా తారసిల్లాయా. ప్రకృతితో పండుగ జరుపుకునే అపురూపమైన జానపద గీతాలవెల్లువ మీరేనాడైనా చూశారా. అసలు పండుగను ప్రకృతితోనూ, ఆట పాటలతోను జరుపుకునే సంస్కృతి

చక్రవాకం

\- ముక్కాము చక్రధర్

సంప్రదాయాలు ఉన్నాయని గతంలో మీకెవ్వరైనా చెప్పారా. అవును, ఇన్ని సొబగులు, ఇంత జానపద సాహిత్య సంపద, ఆ సంపదకు పండుగలతో ముడిపడి ఉంటుందని ఈ ప్రపంచానికి చెప్పింది తెలంగాణ సంస్కృతే. అసలు ఇలాంటి పండుగలు ఉంటాయని కాని, ఇలా పండగంటే సాహిత్య వారసత్వాన్ని నిలబెట్టుకోవడమనే ఎరుక ఇంతకు ముందు ఎప్పుడైనా కలిగిందా.

జపాన్‌లో ప్రతి ఏటా జరిగే చెర్రీ బ్లాజం పండుగ మన బతుకమ్మకు ఇంచుమించు సరిసాటి. కాకపోతే అక్కడ చెర్రీ బ్లాజం పండుగకు సాహిత్యంతో కాని, ఆట పాటలతో కానీ సంబంధం ఉండదు. ఆ పువ్వులు పూసే కాలంలో ప్రకృతినిచూసి మురిసిపోవడమే ఆ ఫెస్టివల్. బతుకమ్మల పండుగలో జీవితం ఉంది. పాట ఉంది. ఆట ఉంది. ముఖ్యంగా మానవ జీవితాల్లో మహిళల పాత్ర ఎంత ఉన్నతమైనదో చెప్పే ఆర్తి ఉంది.

చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ/ బంగారు బొమ్మ దొరికే నమ్మో ఈ వాడలోన...

రాగి బిందె తీసుక్కొని రమణి నీళ్లకు పోతే/ రాములోరు ఎదురాయె నమ్మో ఈ వాడలోన...

వెండి బిందె తీసుక్కోని వెలది నీళ్లకు పోతే/ వెంకటేశుడు ఎదురాయె నమ్మో ఈ వాడలోన...

ఈ జన పదానికి మించిన సాహిత్యం ఇంకెక్కడైనా మనకి దొరకుతుందా. ఓ స్త్రీ ఎదురుచూపులకు అద్దం పట్టిన అక్షరాల దండ ఇది. ఈ అద్భుత సాహిత్యం పుట్టుకకు తేదీలు ఉండవు. రాసిన వారి పేర్లు కూడా లభ్యం కాకపోవచ్చు. కాని ప్రజల నాలుకలపై మాత్రం చిరస్థాయిగా మిగిలిన పాటల బతుకమ్మలివి. ఈ పండుగ పాటల్లో ఇలా ఉంటుంది జీవితం... ఇలా ఉంచుకోవాలి జీవితం అనే ఎరుక వినిపిస్తుంది. కంటి ముందు లయబద్ధంగా అడుగులు వేస్తున్న ఆ ఆడపిల్లల నృత్యాల్లో మగవారి జీవితాల్లో భరోసా కనిపిస్తుంది. తల్లులు తమ పిల్లలను ఒళ్లో కూర్చో పెట్టుకుని భయభక్తులు నేర్పించేది కాదు బతుకమ్మ అంటే. తమ చెంతనే పిల్లలను చేర్చుకుని తాము నడిచి వచ్చిన మార్గం... రేపటితరం వేయాల్సిన అడుగులు ఎలా ఉండేవో, ఎలా ఉండాలో కళ్లముందు పాటలరూపంలో చూపించే సంస్కృతే బతుకమ్మ. ఈ పాటల్లో జీవితపు ఎత్తు పల్లాలను ఎంత సమర్థవంతంగా ఎదుర్కోవచ్చో నేర్పించే గురుతత్వం ఉంటుంది.

ఏటికి ఒక్కసారే... 365 రోజుల్లో కొన్ని రోజులే... కానీ నిండు పున్నమంత వెన్నెల కురిపిస్తాయి ఈ దసరా రోజులు. బతుకమ్మ పాటల్లో పౌరాణిక గాథల ప్రసక్తితోపాటు అనేక మంది వీరుల చరిత్ర పాఠాలు ఉంటాయి. తెలంగాణ ఆచార, వ్యవహారాలను ప్రపంచానికి తెలియజేసే పాటలుకూడా ఈ బతుకమ్మ గీతాల్లో ఉండడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ముందు తరాలకు అందించడంలో భాగంగానే చూడాలి.

తెలంగాణ ఉద్యమం సమయంలో రాష్ట్రమంతటా బతుకమ్మ ఆట, పాటలతో పోరాటానికి కొత్త రూపం ఇవ్వడం బహుశా ప్రపంచ ఉద్యమాల చరిత్రలో ఓ గొప్ప ఘట్టం కావచ్చు. దీనికి ప్రేరణ కూడా బతుకమ్మ పాటల్లోనే దాగి ఉండడం విశేషం. తమ గ్రామాల కోసం, ప్రజల మంచి బతుకుల కోసం ఎప్పుడో రాసుకున్న ఉద్యమ గీతాలు కూడా ఈ బతుకమ్మ వేడుకల్లో భాగం కావడం ఉద్యమాలకు, సాహిత్యానికి ఉన్న సంబంధాలను చూపెడుతుంది. కేవలం సాహిత్యమే కాకుండా సంగీతజ్ఞానం కూడా ఈ బతుకమ్మ పాటల్లో తొంగి చూస్తుంది.

సీనియర్ జర్నలిస్టు
సెల్: 99120 19929

సహకార సేనాని... మానం ఆంజనేయులు

చిన్నం కోటేశ్వరరావు

అభ్యుదయం... చైతన్యం... అధ్యయనం... అంచంచల ఆత్మవిశ్వాసం... పోరాటం... నిజాయతీ... నిర్భీతి... నిరాడంబరత... మానం ఆంజనేయులుకు అష్టాభరణాలు. కుటుంబ సభ్యులు ఆయనను డాక్టర్‌ను చేయాలని తలచినా... చిన్నతనంలోనే ఎర్రజెండాను గుండెలకు హత్తుకుని సమాజాన్ని చదివిన అభ్యుదయవాది... చట్టాలను ఔపోసన పట్టిన న్యాయవాది... కార్మికుల కష్టాలను ఎరిగిన కమ్యూనిస్టు... సామాన్య ప్రజల పక్షాన నిలిచిన జర్నలిస్టు...పోరాటాలను పుణికిపుచ్చుకున్న ఆంధ్రోద్యమకారుడు. ఎత్తుకు పైఎత్తులతో ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తుచేస్తూనే పట్టువిడుపులతో ప్రతి పోరాటాన్ని విజయవంతం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఒక్కో మెట్టూ ఎక్కుతూ చట్టసభలకు చేరినా తన మూలాలను మరువని... తాను నమ్మిన సిద్ధాంతాలు, విలువలను వీడని కర్మయోగి... కార్పొరేట్ కంపెనీల కుయుక్తులు... జైలు, నిర్బంధాలకు వెరవని యోధుడు మానం ఆంజనేయులు. యాదృచ్ఛికంగా సహకార రంగంలోనికి ప్రవేశించి సహకారంపై ఎనలేని మమకారాన్ని పెంచుకున్న ఆయన నాలుగు దశాబ్దాలకు పైగా తనను ఎన్నుకున్న విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్‌ను దక్షిణ భారతదేశంలోనే అగ్రగామిగా నిలిపారు. సభ్యులు, ఖాతాదారుల ప్రయోజనాలను కాపాడుతూనే అనేక వినూత్న కార్యక్రమాలతో బ్యాంక్ సేవలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరించారు. భవిష్యత్ తరాలకు దిక్సూచిగా నిలిచారు. తన అనుభవం, మేథస్సును కేవలం ఒక బ్యాంక్‌కు పరిమితం చేయకుండా కష్టాల ఊబిలో చిక్కుకున్న అనేక అర్బన్ బ్యాంక్‌లు చరిత్రలో కలిసిపోకుండా చేయి అందించి కొత్త ఊపిరిలూది సగర్వంగా తిరిగి నిలబెట్టేందుకు వినియోగించారు. ప్రభుత్వాలు, నియంత్రణ సంస్థల మితిమీరిన ఆంక్షలు.. అజమాయిషీని ఎన్నడూ అంగీకరించక... ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టబద్ధంగా వాటిని విజయవంతంగా ఎదుర్కొని సహకార అర్బన్ బ్యాంకుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సుప్రసిద్ధ సహకారవేత్త. పదవులు, హోదా కాదు బాధ్యతని నమ్మి... ఏ పదవి చేపట్టినా వాటికి వన్నెతెచ్చిన మహనీయుడు...సహకారరంగం పదికాలాలు పచ్చగా ఉండాలని నిండు మనసుతో కోరుకుని స్వచ్ఛందంగా తాను పదవి నుంచి తప్పుకుని యువతను వెన్నుతట్టి ప్రోత్సహించడంతోపాటు వెన్నంటి ఉండి నడిపిస్తున్న దార్శనికుడు. జాతీయ స్థాయిలో నాలుగు దశాబ్దాలుగా అందరినీ కలిసికట్టుగా ముందుకు నడిపించిన మానం ఆంజనేయులు నిజమైన సహకార సేనాని.

ఆంధ్రప్రదేశ్‌లోని ఒకప్పటి ప్రకాశంజిల్లా, నేటి బాపట్ల జిల్లా అద్దంకి సమీపంలోని చిన్నకొత్తపల్లిలో మానం వెంకటసుబ్బయ్య, అంజమ్మ దంపతులకు 1939వ సంవత్సరంలో మానం ఆంజనేయులు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం తమ గ్రామంలోనే పూర్తిచేశారు. నరసరావుపేటలో ఇంటర్ పూర్తిచేశారు. గుంటూరు, విశాఖపట్నంలో ఉన్నత విద్యను అభ్యసించారు. 1956లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సభ్యత్వం స్వీకరించిన మానం ఆంజనేయులు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం ఏడు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేస్తూనే ఉన్నారు.

జర్నలిస్టుగా... కమ్యూనిస్టుగా...

గుంటూరులో విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న మానం ఆంజనేయులు... భారత కమ్యూనిస్టు పార్టీ సూచనమేరకు విశాలాంధ్ర విజయవాడ కార్యాలయంలో కొద్దికాలం ఉప సంపాదకుడిగా, విలేకరిగా పనిచేశారు. ఆ తర్వాత పార్టీ అగ్ర నాయకత్వం ఆదేశాలతో విశాలాంధ్ర ఏజెంటుగా, జర్నలిస్టుగా 1968లో కుటుంబంతో సహా విశాఖపట్నం చేరుకున్నారు. విశాలాంధ్ర ఏజెంటుగా, విలేకరిగా కొనసాగుతూనే ఆంధ్రా యూనివర్సిటీలో న్యాయశాస్త్ర డిగ్రీని పూర్తిచేశారు. విద్యార్థి ఉద్యమాల్లో కీలక భూమిక పోషించారు. సీపీఐ విశాఖ తాలూకా సహాయ కార్యదర్శిగా, నగర కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శిగా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యునిగా, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యునిగా అనేక బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని సీఆర్ ఫౌండేషన్ డైరెక్టర్‌గా, ఉపాధ్యక్షుడిగానూ సేవలు అందించారు.

1916లో బ్యాంకు ప్రారంభం

విశాఖపట్నం కేంద్రంగా 1916, ఫిబ్రవరి 5వ తేదీన విశాఖపట్నం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రారంభమైంది. ఈ బ్యాంక్ దశ, దిశను మార్చిన దార్శనికుడు మానం ఆంజనేయులు. మొత్తం 109 ఏళ్ల ఈ బ్యాంక్ చరిత్రను మానం ఆంజనేయులు ముందు, తర్వాత అన్నంతగా ప్రభావితం చేశారు. విశాఖపట్నం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను దేశంలోనే సహకార అర్బన్ బ్యాంక్‌ల సరసన ఉండేలా తీర్చిదిద్దడంలో నాలుగు దశాబ్దాలపాటు మానం ఆంజనేయులు ప్రత్యక్షంగా, పరోక్షంగా చేసిన కృషి అనన్యసామాన్యమైనది. 2024 జూన్ నెలలో బ్యాంకులోని అన్ని బాధ్యతల నుంచి వైదొలిగినప్పటికీ ఎప్పటికప్పుడు పాలకవర్గానికి అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూనే ఉన్నారు. మానం ఆంజనేయులు 41 ఏళ్లపాటు బ్యాంక్ విధాన నిర్ణయాల్లో పాటించిన పాదర్శకత, సభ్యుల సంక్షేమం, లావాదేవీల్లో నైతికత, నిబద్ధతను కొనసాగిస్తూ ప్రస్తుతం అంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 54 బ్రాంచ్‌లతో విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నది.

1994 సార్వత్రిక ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ తరపున విశాఖ జిల్లా పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా విజయం సాధించిన మానం ఆంజనేయులు... ఏమాత్రం అధికార దర్పం ప్రదర్శించకుండా ప్రజా సమస్యల పరిష్కారంలోనూ, అభివృద్ధి పనుల పర్యవేక్షణలోనూ ఒక ఉద్యమకారునిగా తనదైన ముద్ర వేశారు. విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా 2000వ సంవత్సరంలో 'చలో అసెంబ్లీ' ఉద్యమంలో పాల్గొన్నారు. విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా కొనసాగుతూనే 1994-99 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యుడిగా చట్టసభలోకి అడుగుపెట్టిన మానం ఆంజనేయులు సహకార వ్యవస్థ బలోపేతానికి బాటలు వేశారు. అర్బన్ బ్యాంకుల సమస్యల పరిష్కారానికి చట్టసభలను ఎంతో చాకచక్యంగా వినియోగించుకున్నారు. భారత పార్లమెంట్ రూపొందించిన నమూనా సహకార చట్టానికి అనుగుణంగా 1995వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీస్ యాక్టును శాసనసభ ఆమోదింపజేయటంలో కీలకపాత్ర పోషించారు. విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్‌ను ఆ చట్ట పరిధిలోకి తీసుకొచ్చి నేడు దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద సహకార అర్బన్‌బ్యాంక్‌గా నిలపడంలో ఆంజనేయులు మార్గదర్శిగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా పనిచేసిన మానం ఆంజనేయులు 1989లో సహకార అర్బన్ బ్యాంక్‌లు, క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్య(నాఫ్‌కాబ్) డైరెక్టర్‌గా 30 ఏళ్లపాటు జాతీయ స్థాయిలో సేవలు అందించారు.

ఒకవైపు విశాఖపట్నం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తూనే రాష్ట్రంలోని ఇతర బ్యాంక్‌లకు అవసరమైన సాయం అందించారు. 1917లో ప్రారంభించిన విజయనగరం జిల్లాలోని బొబ్బిలి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌ను 2007వ సంవత్సరంలో, తూర్పు గోదావరి జిల్లాలో 1918లో ప్రారంభించిన రామచంద్రాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌ను 2009లో, ప్రకాశంజిల్లాలో 1908లో ప్రారంభించిన ఒంగోలు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌ను 2011లో, అదే ఏడాది తిరుపతిలో 1999లో ఏర్పాటు చేసిన బాలాజీ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌ను విలీనం చేసుకుని ఆయా బ్యాంక్‌ల బ్రాంచ్‌ల్లో కార్యకలాపాల నిర్వహణద్వారా చరిత్ర కలిగిన సహకార బ్యాంక్‌లను కాపాడటంతోపాటు సభ్యుల్లో విశ్వాసం పెంచిన దార్శనికుడు మానం ఆంజనేయులు. సహకారరంగ బలోపేతానికి, సభ్యులు, ఖాతాదారులు, ఉద్యోగులు, సహకార బ్యాంక్‌ల అభ్యున్నతికి బహుముఖరూపాల్లో అంకితభావంతో నాలుగు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్న మానం ఆంజనేయులు జీవితం అందరికీ ఆదర్శం. అనుసరణీయం.

(మానం ఆంజనేయులు ఆత్మీయ అభినందనసభ శనివారం విజయవాడలోని ఎం.బి.వి.కె.భవన్‌లో జరుగుతున్న సందర్భంగా)

అన్మోల్‌ను పట్టుకుంటే రూ.10 లక్షలు: ఎన్ఐఏ

న్యూదిల్లీ: జైలు శిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. అతనిపై రూ.10 లక్షల రివార్డు ప్రకటించింది. అన్మోల్ బిష్ణోయ్ కూడా పేరు మోసిన గ్యాంగ్ స్టర్. ఇప్పటికే ఇతను ఓ కేసులో దోషిగా తేలగా బెయిల్‌పై విడుదలై తప్పించుకు తిరుగుతున్నాడు. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటిపై కాల్పుల కేసులోనూ అతనిపై అభియోగాలు ఉన్నాయి. ఇటీవల సంచలనం రేపిన ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ, కాంగ్రెస్ నేత, సింగర్ సిద్ధూ మూసేవాలా హత్య కేసులతోపాటు మొత్తం 17 కేసుల్లో అన్మోల్ నిందితుడిగా ఉన్నాడు. జోధ్‌పూర్‌లో ఓ కేసులో దోషిగా తేలడంతో అతనికి జైలు శిక్ష పడింది. 2021 అక్టోబర్ 7న అన్మోల్ బిష్ణోయ్ జైలు నుంచి విడుదలయ్యాడు. అప్పట్నుంచీ దేశం విడిచి పారిపోయాడు. కెన్యా, కెనడా సహా వివిధ దేశాలకు తిరుగుతూ పోలీసులకు సవాల్‌గా మారాడు. దీంతో అతనిని మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చుతూ రూ.10 లక్షల రివార్డును ఎన్ఐఏ ప్రకటించింది.

చంపై సోరెన్ నామినేషన్

రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపై సోరెన్ సరైకెల్లా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక నేతలతో కలిసి శుక్రవారం ఉదయం రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లిన ఆయన... తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం చంపై సోరెన్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని అన్నారు. జార్ఖండ్‌లోకి బంగ్లాదేశీ చొరబాటుదారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని, బీజేపీ మాత్రమే స్థానికులకు, రాష్ట్రంలోని గిరిజనులకు న్యాయం చేయగలదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 81 సీట్లలో విజయం సాధించబోతున్నదని జోస్యం చెప్పారు. కేవలం జార్ఖండ్‌లోనేగాక దేశమంతటా బీజేపీ హవా నడుస్తున్నదని పేర్కొన్నారు. బీజేపీ ప్రభంజనాన్ని అడ్డుకోవడం ఎవరి తరంకాదని వ్యాఖ్యానించారు.

ఎన్సీపీ గూటికి సిద్ధిఖీ తనయుడు జిశాన్

ముంబై: మహారాష్ట్ర ఎన్సీపీ శరద్ పవార్ వర్గం నేత బాబా సిద్ధిఖీ కుమారుడు జిశాన్ సిద్ధిఖీ శుక్రవారం ఎన్సీపీ(అజిత్ వర్గం) కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్‌లో టికెట్ దక్కకపోవడంతో అతడు అజిత్ పవార్ వర్గంలో చేరారు. ఎన్సీపీ తరపున బాంద్రా ఈస్ట్ నుంచి జిశాన్‌ను బరిలో దింపుతున్నట్లుగా ఎన్సీపీ వెల్లడించింది. గతంలో జిశాన్ కాంగ్రెస్ టికెట్‌పై వంద్రే ఈస్ట్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. శాసనమండలి ఎన్నికలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలతో పార్టీ ఆయన్ను బహిష్కరించింది. దీంతో ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అతడికి టికెట్ దక్కలేదు. ఎన్సీపీ పవార్ వర్గం నేత, జిశాన్ తండ్రి బాబా సిద్ధిఖీ కొద్దిరోజుల క్రితమే లారెన్స్ బిష్ణోయ్ ముఠా చేతిలో హత్యకు గురయ్యారు. దీంతో ఆయన ఎన్సీపీలో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీలో చేరిన అనంతరం జిశాన్ మాట్లాడుతూ 'నాకు, నా కుటుంబానికి ఇది ఎంతో ముఖ్యమైన రోజు. మేము కష్టంలో ఉన్నప్పుడు మా వెంట ఉండి ధైర్యం చెప్పిన అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరేలకు కృతజ్ఞతలు. బాంద్రా నుంచి ఎన్నికల బరిలో దిగుతున్నాను. ఇక్కడి ప్రజల ప్రేమ, మద్దతుతో మళ్లీ గెలుస్తానని నమ్ముతున్నాను' అని అన్నారు. కాగా, మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్సీపీ అజిత్ వర్గం అభ్యర్థుల రెండో జాబితా ప్రకటించింది. జిశాన్‌కు బాంద్రా స్థానం నుంచి టికెట్ కేటాయించినట్లుగా వెల్లడించింది. పార్టీ అధినేత అజిత్ పవార్ అతడి కుటుంబానికి కంచుకోట అయిన బారామతి స్థానం నుంచి పోటీ చేయనున్నారు.

తీరం దాటిన 'దానా'

- ఒడిశా, బెంగాల్‌లో భారీవర్షాలు
- నేలకూలిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు
- బలహీనపడిన తీవ్ర తుపాను

భువనేశ్వర్/కోల్‌కతా: వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని బిత్తర్‌కనిక జాతీయ పార్క్, ధమ్రా మధ్య గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రక్రియ ప్రారంభమై శుక్రవారం ఉదయం 8.30 గంటలకు పూర్తయినట్లు వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది. కాగా తుపాను తీరం దాటే సమయంలో భద్రక్, కేంద్రపార జిల్లాల్లో గంటలకు 120 కి.మీ వేగంతో తీవ్రంగా గాలులు వీచాయి. గాలుల ధాటికి అనేక చోట్ల చెట్లు నేలకూలాయి. తుపాన్ ప్రభావంతో ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. విద్యా సంస్థలకు శుక్రవారం సెలవు ప్రకటించాలని అధికారులు రెండు రాష్ట్రాలకు సూచించారు. అయితే దానా తుపాను కారణంగా ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో పౌర ఆవాసాలు, మౌలిక సదుపాయాలకు ఎటువంటి తీవ్రమైన నష్టం జరగకపోయినప్పటికీ అయితే చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలినట్లు వార్తలందాయి. కాగా రెండు రాష్ట్రాల్లో రైలు, విమాన సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు తుపాను కారణంగా ప్రాణనష్టం జరిగినట్లు ఎటువంటి సమాచారం అందలేదని ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తెలిపారు. కాగా పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తుపాను కారణంగా ఒకరు మరణించినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం భువనేశ్వర్‌లో తుపాను పరిస్థితిని సమీక్షించిన మాఝీ, తీవ్ర తుఫాను కారణంగా ప్రాణనష్టం జరిగినట్లు లేదా ఇతరత్రా ప్రమాదాలకు గురైనట్లు ఎటువంటి నివేదిక లేదు కాబట్టి రాష్ట్రం "జీరో క్యాజువాలిటీ మిషన్" సాధించిందని ప్రకటించారు. గురువారం అర్ధరాత్రి దాటాక గాలి తీవ్రత తగ్గిన వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగి... నేలకొరిగిన చెట్లతో మూసుకుపోయిన రోడ్లపై రాకపోకలు పునరుద్ధరించే చర్యలు చేపట్టారని తెలిపారు. అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు దెబ్బతిన్నాయని... వాటికి మరమ్మతులు జరుగుతున్నాయని చెప్పారు. తుపాను ప్రభావానికి గురైన కేంద్రపరా, బాలాసోర్, భద్రక్ జిల్లాతో సహా అన్ని ప్రాంతాలలో శుక్రవారం సాయంత్రానికి విద్యుత్ పునరుద్ధరించనున్నట్లు వెల్లడించారు. కాగా దాదాపు 2.16 లక్షల మంది ప్రజలను లోతట్టు ప్రాంతాల నుంచి తరలించినప్పటికీ దానా తుపాను కారణంగా రాష్ట్రంలో ఒకరు మరణించారని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. తుపాను పరిస్థితి సమావేశం నిర్వహించిన ఆమె... తుపాను బాధితులందరికీ సహాయక సామగ్రి చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తుపాను కారణంగా దక్షిణ పశ్చిమ బెంగాల్‌లోని అనేక ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని పుర్బా మేదినీపూర్, గోసాబాలోని మందరమణిలోని వివిధ ప్రాంతాలను వరద ముంచెత్తింది. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. కాగా కోల్‌కతా విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి విమాన సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. అలాగే ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో కూడా విమాన, రైలు సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి.

జార్ఖండ్‌లోనూ వర్షాలు

దానా తుపాను ప్రభావంతో శుక్రవారం జార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. పశ్చిమ సింగ్‌భూమ్, సెరైకెలా-ఖార్స్వాన్, తూర్పు సింగ్‌భూమ్ జిల్లాలతో కూడిన కోల్హాన్ ప్రాంతంలో గురువారం రాత్రి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండగా, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. గత 24 గంటలుగా తుపాను పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తెలిపారు. 'తుపాను ప్రభావంపై నేను గంటకోసారి సమాచారం తీసుకుంటున్నాను. ప్రధానంగా తూర్పు సింగ్‌భూమ్, పశ్చిమ సింగ్‌భూమ్, సరైకేలా-ఖర్సావాన్ జిల్లాల్లో ముందుజాగ్రత్త చర్యగా అనేక చర్యలు తీసుకున్నాం' అని ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

వాతావరణ శాఖ సమాచారం ప్రకారం మరి కొద్ది గంటల్లోనే తుపాను బలహీనపడనుందని తెలిపారు. కాగా ప్రతికూల వాతావరణం జార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఎన్నికల కార్యకలాపాలను ప్రభావితం చేసింది. శుక్రవారం బొకారోలో జరగాల్సిన ముఖ్యమంత్రి ఎన్నికల ర్యాలీ రద్దయినట్లు సీఎం కార్యాలయం ప్రకటించింది. తుపాను బలహీనపడినప్పటికీ "కోల్హన్ ప్రాంతంలోని ఒకటి లేదా రెండు జిల్లాల్లో శుక్రవారం భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాంచీ సహా సెంట్రల్ జార్ఖండ్‌లోని కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయి" అని రాంచీ వాతావరణ కేంద్రం ఇన్‌ఛార్జ్ అభిషేక్ ఆనంద్ పీటీఐకి తెలిపారు. శనివారం వర్షం తీవ్రత మరింత తగ్గుతుందని పేర్కొన్నారు.

కుటుంబ సమేతంగా...

సొంతోళ్లకే ఎక్కువ సీట్లు

మహారాష్ట్రలో అన్ని పార్టీలదీ ఇదే తీరు

ముంబై: వారసత్వ రాజకీయాలు, కుటుంబ రాజకీయాలకు దూరమంటూ దేశంలో ప్రతి రాజకీయ పార్టీ చెప్పుకుంటుంది. కానీ ఆచరణలో మాత్రం అది కనిపించడం లేదు. తమ రక్త సంబంధీకులకే సీట్లు కేటాయిస్తున్నాయి. మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలకు నవంబరు 20న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అక్కడ అన్ని పార్టీలు తమ అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించాయి. అందులో ప్రతీ పార్టీ తమ ముఖ్య నేతల తనయులు, భార్య, సోదరి, సోదరులకు ఏదో ఒకచోట సీటు కేటాయించింది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత అశోక్ చవాన్ తనయ శ్రీజయ చవాన్ ఇటీవల కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. వారి కుటుంబానికి కంచుకోట అయిన నాందేడ్ జిల్లాలోని భోకర్ నియోజకవర్గాన్ని బీజేపీ ఆమెకు కేటాయించింది. ముంబై బీజేపీ అధినేత ఆశిశ్ షేలర్ పశ్చిమ బాంద్రా నియోజకవర్గం నుంచి పోటీకి దిగనుండగా... ఆయన సోదరుడు వినోద్ షేలర్‌ను పశ్చిమ మలాడ్ నియోజకవర్గం నుంచి బీజేపీ బరిలోకి దింపింది. శ్రీగొండ నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే బాబన్‌రావ్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా అక్కడి నుంచి ఆయన భార్య ప్రతిభా పచ్‌పుతేను బీజేపీ పోటీ చేయిస్తోంది. కాంకావ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే నితేశ్ సోదరుడు నీలేశ్ ఇటీవల బీజేపీ నుంచి ఉద్ధవ్ శివసేనలో చేరగా... ఆయనకు కుదాల్ నియోజవర్గాన్ని కేటాయించింది. రాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్ సోదరుడు కిరణ్ సామంగ్‌ను షిండే శివసేన రాజాపూర్ సీటు నుంచి బరిలోకి దింపుతోంది. ఆ పార్టీ ఎంపీలు సందీపన్ భూమరే, రవీంద్ర వైకర్ తమ వారికి సీట్లు దక్కించుకోవడంలో సఫలమయ్యారు. భూమరే కుమారుడు విలాస్... పైథాన్ నియోజకవర్గం నుంచి, వైకర్ భార్య మనీశా తూర్పు జోగేశ్వరీ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్నారు. ఎన్సీపీ నేత పంకజ్ భుజ్‌బల్ నాసిక్ జిల్లాలోని యోలా నియోజకవర్గం నుంచి... ఆయన సోదరుడు చగన్ భుజ్‌బల్ ఇండిపెండెంట్‌గా అదే నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య థాక్రే వర్లి నియోజకవర్గం నుంచి, ఆయన సోదరుడు వరుణ్ సర్దేశాయ్ తూర్పు బాంద్రా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. శరద్ పవార్ మనవడు రోహిత్ పవార్ అహిల్యా నగర్ స్థానం నుంచి బరిలోకి దిగారు. ఇలా అన్ని పార్టీలు ముఖ్య నేతల కుటుంబసభ్యులకు సీట్లు కేటాయించాయి. కొన్ని నియోజకవర్గాల్లో అక్కడ పట్టున్న నేత ఆకస్మికంగా మృతి చెందడంతో వారి వారసులకు పార్టీలు సీట్లు కేటాయించాయి. గెలుపే లక్ష్యంగా మహారాష్ట్రలో ప్రతి పార్టీ పూర్తిగా కుటుంబ సమేతంగా బరిలోకి దిగాయి.

అధ్యాపకులు, విద్యార్థుల డిష్యుం...డిష్యుం

పాట్నా: కళాశాలలో పరీక్షలు జరుగుతుండగా అధ్యాపకులు, విద్యార్థులు కొట్టుకున్నారు. ఈ దాడిలో కొందరు విద్యార్థులు, ఒక విద్యార్థి తల్లి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన బీహార్‌లోని బెగుసరాయ్‌లో జరిగింది. వివరాలివి. ఎంఆర్‌జేడీ కళాశాలలో జరుగుతున్న పరీక్షలకు కొందరు విద్యార్థులు హాజరయ్యారు. సోదరుడి బదులు ఒక మహిళ బీఏ పార్ట్-2 పరీక్ష రాసింది. అధ్యాపకుడి వద్దకు వెళ్లి సంతకం చేయాలని అడిగింది. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన అధ్యాపకుడు ఆ తోబుట్టువులను కొట్టాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పరీక్షా కేంద్రం వద్దకు రాగా వారిని కూడా అధ్యాపకులు కొట్టారు. మొత్తం కుటుంబంపై అధ్యాపకులు దాడి చేయడంతో విద్యార్థులు ఆగ్రహంతో రగిలిపోయి ప్రతిఘటించారు. వీరంతా కలబడి కొట్టుకున్నారు. దాడిలో అభిషేక్ కుమార్, జనక్ నందనీ కుమారి, నిధి భారతి అనే విద్యార్థులు గాయపడగా... అభిషేక్ తల్లి లక్ష్మీదేవి, సోదరుడు కరణ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మరోవైపు ఆగ్రహంతో రగిలిపోయిన విద్యార్థులు కళాశాల వద్ద నిరసన చేపట్టారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కళాశాల వద్దకు చేరుకున్నారు. ఆసుపత్రికి వెళ్లి బాధిత విద్యార్థుల స్టేట్‌మెంట్లను రికార్డ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అధ్యాపకులు, విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

భర్తను చెట్టుకు కట్టేసి... భార్యపై అత్యాచారం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో దారుణం జరిగింది. రాష్ట్రంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలపై లైంగిక దాడికి పాల్పడ్డారు. రేవాలో భర్తను చెట్టుకు కట్టేసి... భార్యపై లైంగిక దాడి చేసి... దానిని వీడియో తీశారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేస్తే... సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేస్తామని దంపతులను బెదిరించారు. ఈ ఘటన అక్టోబర్ 21వ తేదీన చోటుచేసుకుంది. ఈ ఘటనపై దంపతులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొంతమంది అనుమానితులను అరెస్ట్ చేశామని పోలీసులు వెల్లడించారు. దంపతులు పిక్నిక్‌లో భాగంగా రేవాకు వచ్చారని తెలిపారు.

ఇండోర్‌లో మరో దారుణం

దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా పేరు పొందిన ఇండోర్‌లో మరో ఘటన చోటుచేసుకుంది. నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహిళపై లైంగిక దాడి జరిగింది. అనంతరం బాధితురాలు సదర్ బజార్ ప్రాంతంలో అర్ధనగ్నంగా తిరుగుతుండడాన్ని పోలీసులు సీసీ ఫుటేజ్‌లో గమనించారు. దీనికిముందు ఏమి జరిగిందనే విషయాన్ని పోలీసులు నిర్ధారణ చేసుకున్నారు. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి సోనుగా గుర్తించారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని పోలీసులు ప్రశ్నించగా... తానే నేరం చేసినట్లు అంగీకరించాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేశారు. సోను దినసరి కూలిగా పని చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఈ రెండు వేర్వేరు ఘటనల్లో లైంగిక దాడి జరిగిన మహిళలను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

సీఎం కళ్లు మూసుకున్నారా: కాంగ్రెస్

వరుస ఘటనలపై మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు జీతూ పట్వారీ అధికార బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

ముఖ్యమంత్రి ఈవెంట్‌లో ఉంటే... ఓ ఆడ కూతురు రోడ్డుపై నగ్నంగా తిరుగుతుందన్నారు. ఇండోర్ మహిళను ఆయన పంచమవేదం మహాభారతంలోని ద్రౌపది వస్త్రాపహరణంతో పోల్చారు. తనను తాను దేవుడుగా భావించే ముఖ్యమంత్రి ఈ ద్రౌపది వస్త్రాపహరణాన్ని చూడలేదా అని ప్రశ్నించారు. ఆడబిడ్డల దీనస్థితిపై తనకు కోపంగా, ఆందోళనగా ఉందన్నారు. ముఖ్యమంత్రి మాత్రం కళ్లు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. మరోవైపు, అత్యాచారాలపై మంత్రి నరేంద్ర పటేల్ స్పందించారు. ఈ తరహా ఘటనల్లో నిందితులను బీజేపీ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదలబోదన్నారు. ఇండోర్ ఘటనలో నిందితుడిని ఇప్పటికే అరెస్ట్ చేశామని చెప్పారు.

వాయు కాలుష్యంపై అప్రమత్తం

రాష్ట్రాలకు కేంద్రం హెచ్చరిక

న్యూదిల్లీ: పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండగా వెలువడుతున్న వాయుకాలుష్యానికి తోడు... పొగ మంచు రాజధాని దిల్లీ ప్రాంతాన్ని కమ్మేయడంతో రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతోంది. దిల్లీలో మాత్రమే కాదు... దేశంలో అనేక ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రంగా పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. శీతాకాలం, పండగలు సమీపిస్తుండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఈ మేరకు వివిధ రాష్ట్రాల్లోని వైద్య ఆరోగ్య శాఖలకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వాయు కాలుష్యం తీవ్రతరమవుతోందని... ఇది అనారోగ్య పరిస్థితులకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. బహిరంగ ప్రదేశాల్లో వాకింగ్‌కు వెళ్లడం, ఆటలు ఆడటం వంటి వాటికి ప్రజలు దూరంగా ఉండాలని సూచించింది.

ముఖ్యంగా గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, ట్రాఫిక్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పింది. ప్రభుత్వ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు గాలి నాణ్యతను పర్యవేక్షించాలని సూచించింది. శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు కాలుష్యానికి దూరంగా ఉండాలని, అలాంటివారు బహిరంగ ప్రదేశాల్లో తిరగడం తగ్గించాలని పేర్కొంది. 'వాతావరణ మార్పు - మానవులపై ప్రభావం' జాతీయ కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించింది.

విద్యార్థులూ... కెనడా వెళ్లొద్దు

భారత దౌత్యవేత్త సంజీవ్ వర్మ

న్యూదిల్లీ: కెనడా వెళ్లాలనుకుంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని భారత దౌత్యవేత్త సంజీవ్ కుమార్ వర్మ హెచ్చరించారు. ఆ దేశంలోని అనేక చీకటి కోణాలను ఆయన శుక్రవారం 'పీటీఐ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ దేశంలో నాసిరకం విద్యాసంస్థల కారణంగా లక్షల రూపాయలు వెచ్చించినా ఉద్యోగాలు రాని పరిస్థితి ఉందని సంజీవ్ వర్మ తెలిపారు. ఫలితంగా నిరాశకు గురైన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కెనడాకు పిల్లలను పంపే ముందు తల్లిదండ్రులు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని సూచించారు. సంజీవ్ 2022 నుంచి ఇటీవల వరకు కెనడా హైకమిషనర్‌గా పనిచేశారు. రెండుదేశాల మధ్య దౌత్య వివాదం కారణంగా ఈ నెల మొదట్లో ఆయన భారత్‌కు తిరిగి వచ్చేశారు. 'కెనడాలో నేను పనిచేసినప్పుడు ఒకానొక దశలో వారానికి కనీసం ఇద్దరు విద్యార్థుల మృతదేహాలను బాడీ బ్యాగ్‌ల్లో భారత్‌కు పంపించాం. అవి ఆత్మహత్యలు చేసుకొన్నవారివే. భవిష్యత్తుపై ఎన్నో కలలతో కెనడా వెళ్లి శవాలుగా తిరిగి వస్తున్నారు. కళాశాలల గురించి పూర్తిగా తెలుసుకున్నాకే... తమ పిల్లలను చేర్చే అంశంపై తల్లిదండ్రులు నిర్ణయం తీసుకోవాలి. వారానికి ఓసారి మాత్రమే క్లాసులు జరిగే కాలేజీలు... అంతగా తెలియని వాటిల్లో పిల్లలను చేర్చొద్దు. ఈ పరిస్థితికి దళారులు కూడా కారణమే. పిల్లలు దారుణమైన డార్మెటరీల్లో కాలం వెళ్లదీస్తున్నారు. కొన్నిచోట్ల ఒక్కో గదిలో ఎనిమిది మంది వరకు నిద్రపోతున్నారు. ఈ పిల్లలంతా మంచి కుటుంబాలకు చెందినవారే. తమ కుటుంబ సంపద మొత్తాన్ని వారి చదువు కోసమే ధారపోస్తున్నారు. అక్కడ ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్య పూర్తి చేస్తే వారికి ఉద్యోగాలు వస్తాయని భావిస్తాం. కానీ, అందుకు భిన్నంగా క్యాబ్ డ్రైవర్‌గానో... చాయ్ సమోసా విక్రయిస్తూనో వారు జీవించాల్సిన దుస్థితి. కెనడాలో వాస్తవ పరిస్థితులు ఏమాత్రం ప్రోత్సాహకరంగా లేవు' అని సంజీవ్ వర్మ వెల్లడించారు. కెనడాలో భారత విద్యార్థులపై ఫీజుల భారం అధికంగా ఉందని సంజీవ్ వర్మ తెలిపారు. సాధారణ కెనడా విద్యార్థి చెల్లించే మొత్తంతో పోలిస్తే భారతీయులు నాలుగింతలు ఫీజు రూపంలో సమర్పించుకోవాల్సి వస్తోందన్నారు. తాను పనిచేసిన 18 నెలల కాలంలో ఎంతో మంది విద్యార్థుల దీనగాథలను చూశానని వివరించారు.

భారత విద్యార్థులపై ఖలిస్థానీల వల

కెనడాలో చదువుతున్న భారత విద్యార్థులు తమ చుట్టుపక్కల పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని సంజీవ్ వర్మ తెలిపారు. తీవ్రవాద భావజాలాన్ని నూరిపోసేందుకు యత్నించే ఖలిస్థానీలు, ఇతర వేర్పాటువాదుల కుట్రలను తిప్పికొట్టాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం నిత్యం పిల్లలతో మాట్లాడుతూ వారి పరిస్థితులను అర్థం చేసుకొని తగిన సూచనలు చేయాలన్నారు. కెనడాలోని భారతీయులకు ఖలిస్థానీలు, వేర్పాటువాదుల నుంచి ముప్పు పొంచి ఉందన్నారు. వీరంతా విద్యార్థులకు డబ్బు, ఆహారం ఎరగా వేసి ప్రభావితం చేస్తారన్నారు. కొందరు విద్యార్థులతో భారత దౌత్య కార్యాలయం వద్ద ఆందోళనలు చేయించడం, జెండాను అవమానించడం వంటివి చేయించి ఫొటోలు, వీడియోలు తీస్తారని చెప్పారు. ఆ తర్వాత తాము భారత్ వెళ్తే శిక్షిస్తారనే సాకు చెప్పి కెనడాలోనే ఆశ్రయం కోరాలని సూచిస్తారన్నారు. ఆ రకంగా ఆశ్రయం పొందిన వారూ ఉన్నారని సంజీవ్ వెల్లడించారు.

ఉగ్రవాదం ఆపకపోతే తీవ్ర పరిణామాలు

పాక్‌కు ఫరూఖ్ అబ్దుల్లా హెచ్చరిక



న్యూదిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు పెరుగుతుండటంపై నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా స్పందించారు. ఉగ్రదాడుల మూలాలు పాకిస్థాన్‌లోనే ఉన్నాయన్నారు. ఈ తరహా ఘటనలకు పాకిస్థాన్ వీలైనంత త్వరగా ముగింపు పలకాలని సూచించారు. రెండు దేశాల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. గురువారం బారాముల్లాలోని గుల్మార్గ్ ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిలో ఇద్దరు సైనికులు సహా నలుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మూడు రోజుల క్రితం ఆరుగురు భవన నిర్మాణ కార్మికులతోపాటు ఓ వైద్యుడిని ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఈ ఘటనలను తీవ్రంగా పరిగణించిన అధికార నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ... సరైన పరిష్కారం కనుగొనేందుకు కేంద్రంతో కలిసి పని చేస్తుందని ఫరూఖ్ వెల్లడించారు. 'ఉగ్రవాద సమస్యకు సరైన పరిష్కారం కనుగొనేంత వరకు రాష్ట్రంలో ఈ తరహా ఘటనలు జరుగుతూనే ఉంటాయి. అమాయక ప్రజలను పాకిస్థాన్ పొట్టన పెట్టుకుంటోంది. గత 30 ఏళ్లుగా నేను కళ్లారా చూస్తూనే ఉన్నాను. సామాన్యులతోపాటు ఎంతోమంది సైనికులు అమరులయ్యారు. తరచూ దాడులకు పాల్పడితే పాకిస్థాన్‌లో కశ్మీర్ భాగమవుతుందని ఆ దేశం తప్పుడు ఉద్దేశంతో ఉంది. అదెప్పటికీ జరగదు. ముందు వాళ్ల దేశంలోని సమస్యలపై దృష్టి పెట్టుకుంటే మంచిది. మిత్రదేశాలుగా మారేందుకు ఉన్న అవకాశాలపై ఆలోచించాలి. లేదంటే పాక్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది' అని ఫరూఖ్ హెచ్చరించారు.

ఆదిత్య ఠాక్రేపై మిలింద్ దేవరా పోటీ?

ముంబై: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే తనయుడు ఆదిత్య ఠాక్రేపై రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవరాను బరిలో దించాలని సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన పార్టీ నిర్ణయించింది. ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి తమ పార్టీ అభ్యర్థిగా ఆదిత్య ఠాక్రే నామినేషన్ దాఖలు చేసిన మరుసటి రోజే అంటే శుక్రవారం ఏక్‌నాథ్ షిండే పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. మిలింద్ దేవరా దక్షిణ ముంబై నుంచి ఇప్పటికే మూడు పర్యాయాలు ఎంపీగా గెలిచారు. ప్రస్తుతం ఆయన రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏక్‌నాథ్ షిండే వర్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జి బాధ్యతలను మిలింద్ దేవరాకు అప్పగించారు. అక్కడ ఆయన సమర్థంగా పనిచేయడంతో వర్లి ఆదిత్య ఠాక్రే సొంత నియోజకవర్గం అయినప్పటికీ అక్కడ ఉద్ధవ్ వర్గం శివసేనకు కేవలం 6,500 మెజారిటీ మాత్రమే వచ్చింది. ఇప్పుడు వర్లీలో ఆదిత్య ఠాక్రే, మిలింద్ దేవరా మధ్య మాత్రమే పోటీలేదు. అక్కడ మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన కూడా నియోజకవర్గంపై పట్టున్న సందీప్ దేశ్‌పాండేను బరిలో దించింది. మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు నవంబరు 20న పోలింగ్ జరగనుంది. 23న ఫలితాలు వెల్లడించనున్నారు.

అధిక ధరలకు కారణమైన బీజేపీ ఓటమి ఖాయం: ఖడ్గే



న్యూదిల్లీ: దేశంలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోవడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి కారణమైన బీజేపీని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని మహారాష్ట్ర ప్రజలు నిర్ణయించుకున్నారని తెలిపారు. శుక్రవారం ఆయన ఈ మేరకు 'ఎక్స్' వేదికకగా బీజేపీని దుయ్యబట్టారు. మహారాష్ట్రలో దొడ్డిదారిన అధికారాన్ని లాక్కున్న బీజేపీ ట్రిపుల్ ఇంజన్ ప్రభుత్వం సామాన్యుల ప్లేట్‌లోని ఆహారాన్ని లాక్కుందన్నారు. ఇప్పుడు బీజేపీ దాని మిత్రపక్షాలకు వీడ్కోలు తలుపులు పూర్తిగా తెరవాలని మహారాష్ట్ర నిర్ణయించుకుందని తెలిపారు. అధిక ధరలతో మహారాష్ట్రతో సహా దేశ ప్రజలను బీజేపీ తీవ్రంగా దెబ్బతీసిందని, దీనిని పరిష్కరించడానికి ఆ పార్టీని గద్దె దింపాలని ఖడ్గే అన్నారు. కేవలం ఏడాదిలోనే సాధారణ 'తాలీ' ధర 52 శాతం పెరిగిందని ఖడ్గే పేర్కొన్నారు. 'అక్టోబర్ 2023- అక్టోబర్ 2024 మధ్య, సాధారణ శాఖాహార తాలీలో ఉపయోగించే పదార్థాలు టమోటా ధరలు 247 శాతం పెరిగాయన్నారు. బహుశా ఆర్థిక మంత్రి తినని వెల్లుల్లి ధర కూడా 128 శాతం పెరిగిందని, సగటున అన్ని కూరగాయల ధరలు 89 శాతం పెరిగాయని ఆయన పేర్కొన్నారు.

వంట నూనె, ఉప్పు, మైదా వంటి వాటి ధరలు 18 శాతం వరకు పెరిగాయని ఖడ్గే వివరించారు. ద్రవ్యోల్బణ వలయం ద్వారా మహారాష్ట్ర ప్రజల ఆకాంక్షలను బీజేపీ నీరుగారిర్చిందని ఖడ్గే అన్నారు. 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీకి ఒకే దశలో నవంబర్ 20న ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం పూర్తి కావడానికి ఒక రోజు ముందు అంటే నవంబర్ 23న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

విశాలాంధ్ర హైదరాబాద్

నవంబర్ 7న రంగారెడ్డి జిల్లాకు బీసీ కమిషన్ బృందం రాక

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 7న రంగారెడ్డి జిల్లాకు విచ్చేయనుందని కలెక్టర్ శశాంక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నవంబర్ 7న రంగారెడ్డిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీ.సీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని వెల్లడించారు. అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా సమర్పించవచ్చని సూచించారు. వారి అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్‌కు నివేదించవచ్చని కలెక్టర్ సూచించారు.

విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్, బెడ్ షీట్స్ పంపిణీ

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్‌లో గల మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల ఆహ్వానం మేరకు శుక్రవారం ఉదయం మేయర్ అమర్ సింగ్ ముఖ్య అతిథులుగా పాల్గొని గురుకుల పాఠశాలలో చదువుతున్న 400 మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్, బెడ్ షీట్స్ మరియు ఇతర వస్తువులను 24వ డివిజన్ కార్పొరేటర్ అనంత్ రెడ్డి మరియు ఉపాధ్యాయులతో కలసి పంపిణీ చేశారు. అనంతరం మేయర్ అమర్మా సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల నరసింహారెడ్డి, సుక్క జయేందర్, నాగరాజు, మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీకాల ద్వారా పోలియోను నివారించండి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : భారతదేశంలోని మేఘాలయలో ఇటీవల బయట పడిన పోలియో కేసు నేపథ్యంలో, ఈ ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా, పోలియోమైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలా అవసరం. పోలియో, ఒక తీవ్రమైన వైరల్ అంటువ్యాధి. ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఇది కోలుకోలేని పక్షవాతం కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుంది. దశాబ్దాలుగా పురోగతి ఉన్నప్పటికీ, ఈ వ్యాధి ప్రపంచ ఆరోగ్యానికి ముప్పుగా మాత్రం మిగిలిపోయింది, ముఖ్యంగా పోలియో రహిత భారతదేశం వంటి దేశాలలో ఇది మరలా రాకుండా నివారించడానికి అప్రమత్తంగా ఉండాలి. డాక్టర్ శ్రీనివాస్ కళ్యాణి, ప్రొఫెసర్ ఆఫ్ పిడియాట్రిక్స్, కిడ్స్ క్లినిక్, హైదరాబాద్ వారు మాట్లాడుతూ "పోలియో నిర్మూలన అనేది కమ్యూనిటీ నేతృత్వంలో సాధించిన విజయం. అయినప్పటికీ మనం విశ్రమించకూడదన్నారు. ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు కొనసాగించటం ద్వారా టీకాల ఆవశ్యకత, ఆరోగ్య పరీక్షల ప్రాధాన్యత తెలపాలి" అని అన్నారు.

భూమి దానం చేసిన మాపై ఆరోపణలు సరికాదు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మాకు వారసత్వంగా వచ్చిన భూమిలో పేదల ఇళ్ల కోసం ఉచితంగా అందజేసాం. మాపై మల్కాజిగిరి మున్సి పల్ మాజీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి వారసులు తప్పుడు ఆరోపణలు చేయడం సమం జసం కాదని అత్తాపూర్‌కు చెందిన హాజిబేగం వారసుడు మాజిద్ షరీఫ్ అన్నారు. మౌలాలి డివిజన్ ఆర్టిసి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాకు వారసత్వంగా వచ్చిన భూమిలో పేదలకు ఇళ్ళ స్థలాల కోసం పిల్లి నర్సింగ్‌రావు నగర్ కాలనీలో నాలుగు ఎకరాల భూముని ఉచితంగా ఇచ్చారన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ మాజీ చైర్మన్. మా భూముల విషయాన్ని పెద్ద అంశంగా చూపించాలనే తలంపుతో పోలీసులు, రాజకీయ నాయకులు మా వెనక ఉన్నట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తిరుమల నగర్‌లోని 398, 399, 409, 410 సర్వే నంబర్‌లలోని మాకు వారసత్వంగా వచ్చిన ఆస్తిపై కన్నేసిన సూర్యనారాయణ రెడ్డి, ఆయన వారసులు మాపై తప్పుడు ప్రచారాలు చేస్తూ రెచ్చగొట్టే విధంగా ప్రయత్నం చెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యనారాయణ రెడ్డి కుమారులు రాకేష్ రెడ్డి, జయశంకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తమ అనుచరులతో ప్రహరి గోడను కూల్చారన్నారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వారిపై మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 824/2024, అండర్ సెక్షన్ 329(4), 324(4), 351(2) r/w 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు అయినట్లుగా తెలిపారు. మాపై ఆరోపణలు చేసిన వారి వద్ద ఎమున్నా కోర్టు ద్వారా తేల్చుకోవాలన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కెవిల్ రెడ్డి నగర్ కాలనీలో జిహెచ్‌ఎంసి, వాటర్ బోర్డ్ అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పర్యటించారు. నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు, నూతన భూగర్భ డ్రైనేజి పైపు లైను ప్రతిపాదనలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలి. పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఎఈ శ్రవంతి, వాటర్ బోర్డ్ మేనేజర్ సిరాజుద్దీన్, వర్క్ ఇన్స్పెక్టర్ భిక్షపతి, స్థానిక కాలనీ వాసులు మహేందర్ రెడ్డి, వెంకటరెడ్డి, యాకుబ్ రెడ్డి, నాయకులు తండా వాసుదేవా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో మెగా ఫారిన్ జాబ్‌మేళా : మంత్రి పొన్నం

నిరుద్యోగ యువతకు శిక్షణ : స్కిల్స్ ఆధారంగా జాబ్స్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హుస్నాబాద్ నిరుద్యోగ యువత ఫారిన్ జాబ్ మేళాకు ఎన్ రోల్మెంట్ చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన దేశాల్లో భారీ వేతనాలతో ఉన్న ఉద్యోగ అవకాశాలు పొందేలా రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలోని వారి ఛాంబర్‌లో టాంకాం ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. హుస్నాబాద్‌లో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వివిధ రంగాల్లో వారికి ఉన్న స్కిల్స్ ఆధారంగా వివిధ దేశాల్లో మంచి జీతాలతో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మెగా ఫారిన్ జాబ్ మేళా ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నవంబర్ మొదటి వారంలో జరిగే జాబ్ మేళా కోసం మండలాల్లో అవగాహన కల్పించాలని మూడు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత డేటా సేకరించి వారికి ఆసక్తి ఉన్నా విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రోత్సహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఇప్పటికే హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకి మంచి స్పందన వచ్చిందని దాని ద్వారా 5 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని తెలిపారు. విదేశాల్లో లక్షల్లో జీతాలు ఉన్న ఉద్యోగాలకు టాంకాం కంపెనీ ద్వారా నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఇక్కడి నుండి మంచి కంపెనీలకు పంపించడానికి ఉన్న మెరుగైన అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా జర్మనీ, జపాన్, కెనడా, గల్ఫ్ దేశాలు, యూఎస్ఏ, యూకే, ఇజ్రాయేల్, న్యూజిలాండ్ దేశాల్లో ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు ఉండనున్నాయి. ఇప్పటికే టాంకాం ద్వారా శిక్షణ ఇచ్చి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ సెక్రటరీ ఇండస్ట్రీస్ టాంకాం సీఈఓ డా. ఈ విష్ణు వర్ధన్ రెడ్డి, టాంకాం జిఎం నాగ భారతి, షబ్నా టాంకాం మేనేజర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును సన్మానించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్ : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని బైపాస్ జాతీయ రహదారిపై రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మహబూబ్ నగర్ పర్యటన సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వెళ్తున్న సందర్భంగా ఆయన కాసేపు బైపాస్ రోడ్డులో ఆగి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంత్రిని సాధారణంగా ఆహ్వానించి శాలువాతో, సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా నియమించి రాష్ట్ర అభివృద్ధి విషయంలో అవకాశం కల్పించడం గొప్ప విషయం అన్నారు. ఈ ప్రాంతం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికైన వీర్లపల్లి శంకర్ రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా ఎంపిక అవడం ఒక శుభ సూచకమని పేర్కొన్నారు. పరిశ్రమలకు సంబంధించి ఇంకా ఇతర అనేక విషయాలపై చర్చించడం కోసం కార్యక్రమం ఏర్పాటు చేయబడిందని ప్రభుత్వ రంగ సంస్థల్లో పారిశ్రామిక అభివృద్ధికి కూడా పెద్దపీట వేసే విధంగా చైర్మన్ వీర్లపల్లి శంకర్ సాకారం ఉంటుందని పేర్కొన్నారు. ఒక మంచి కార్యకర్తగా శాసనసభ్యుడిగా ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండే వ్యక్తిగా వీర్లపల్లి శంకర్‌కు మంచి పేరు ఉందని అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో వీర్లపల్లి శంకర్‌కు ఎక్కువ పట్టుదల చొరవ ఉంటుందని అన్నారు. ఇటీవల నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 150 కోట్ల భారీ బడ్జెట్‌తో సమీకృత గురుకుల పాఠశాల భవనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేత స్వయంగా శంకుస్థాపన చేయించుకున్నారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి అంశంలో ఎమ్మెల్యే శంకర్ ఎల్లప్పుడు ఎక్కువ చొరవ తీసుకుంటారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, కే చెన్నయ్య, విశ్వం, బస్వం అప్ప, బాలరాజ్ గౌడ్, కౌన్సిలర్ సర్వర్ పాషా, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ముబారక్ అలీ ఖాన్, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నివారణకు స్టెరిలైజేషన్ అధిక సంఖ్యలో చేపట్టాలి: కమిషనర్ ఇలంబర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగరంలో కుక్కల బెడద నివారణకు స్టెరిలైజేషన్ అధిక సంఖ్యలో చేపట్టాలని జీహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కమిషనర్ ఎల్బీనగర్ జోన్ ఫతుల్లగూడ జంతు సంరక్షణ కేంద్రాన్ని, డాగ్ క్యాచింగ్ వెహికల్, కుక్కల ఆపరేషన్ థియేటర్, పెంపుడు కుక్కల క్రిమిటోరియం, సి అండ్ డి ప్రాసెసింగ్ ప్లాంట్‌లను పరిశీలించారు. కుక్కలను పట్టుకునే వాహనాలు రోజుకు ఎన్ని కుక్కలను పట్టుకుంటున్నారు. రోజుకు ఎన్నింటికి స్టెరిలైజేషన్ జరుగుతున్నాయి అంటూ కమిషనర్ చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్‌ను అడిగారు. స్టెరిలైజేషన్ చేసిన కుక్కల వివరాలు, జోన్‌లోని సర్కిల్ వారీగా పట్టుకున్న కుక్కల వివరాలను డాక్టర్ వకీల్ కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్కిల్ వారీగా వెహికల్ ఉన్న నేపథ్యంలో ఎక్కువ మొత్తంలో పట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుక్కల బెడద, కుక్క కాటు నివారణకు శస్త్ర చికిత్సలు చేసినప్పుడు మాత్రమే ఫలితాలు ఉంటాయన్నారు. అందుకు రోజు వారీగా సమీక్షించి అధిక సంఖ్యలో కుక్కలను పట్టుకునే విధంగా క్షేత్ర స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేయాలన్నారు. డాగ్ క్యాచర్‌లకు సెట్లను అందజేయాలని సూచించారు. పెట్ డాగ్‌ల క్రిమిటోరియం పరిశీలించి నెలకు ఎన్ని జరుగుతున్నాయని నిర్వాహకులను అడుగగా నెలకు సుమారు 30 నుండి 35 వరకు క్రిమిటోరియం చేస్తున్నట్లు వారు కమిషనర్‌కు వివరించారు. అనంతరం కమిషనర్ భవన నిర్మాణ వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ యూనిట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా 500 టన్నుల కెపాసిటీ గల నాలుగు భవన నిర్మాణ వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి కమిషనర్‌కు వివరించారు. రాంకీ ద్వారా జీడిమెట్ల, ఫతుల్లగూడలలో ఏర్పాటు చేయగా, సోమా శ్రీనివాస్ రెడ్డి ద్వారా శంషాబాద్, తూముకుంటలలో యూనిట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిషనర్ వెంట ఎల్బీనగర్ జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హెల్త్ అడిషనల్ కమీషనర్ పంకజ, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, జోనల్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ రంజిత్, హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య పాల్గొన్నారు

సెప్టిక్ ట్యాంక్ వాహనానికి జరిమానా

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : బహిరంగ ప్రదేశంలో సెప్టిక్ ట్యాంక్ ద్వారా మురుగు నీరు వదులుతున్న సెప్టిక్ ట్యాంక్ వాహనంకు తుర్కయంజాల్ పురపాలక అధికారులు 3000 రూపాయల జరిమానా విధించారు. సంఘ పరిధిలోని రాగన్నగూడలో సెప్టిక్ ట్యాంక్ వాహనం TG07U1450 ద్వారా బహిరంగంగా మురుగునీరు వదులుతుండటంతో జరిమాన విధించినట్లు పుర కమిషనర్ అమరేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బహిరంగంగా మురుగునీరును, సెప్టిక్ ట్యాంక్ ద్వారా వదలకూడదని అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, జవాన్ సుధాకర్ పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులపై ముమ్మర తనిఖీలు

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: పట్టణంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ముందస్తు చర్యగా సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి శంషాబాద్ డిసిపి రాజేష్‌ల ఆదేశాలతో నాకాబంది షాద్ నగర్ ఏసిపి రంగస్వామి తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కేంద్రంలోని ఫరూఖ్ నగర్, రైతు కాలనీ ప్రాంతాలలో షాద్ నగర్ ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయ్ కుమార్, ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్, షాద్ నగర్ రూరల్ సిఐ, వివిధ మండలాల సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలతో కలిసి మొత్తం 60 మంది పోలీసు సిబ్బంది 6 బృందాలుగా విడిపోయి ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. పోలీసులు భారీ ఎత్తున నాకాబంధీ చేపట్టారు. ప్రార్థనా స్థలాలు, వాహనాలు, గుట్కా, బెల్టు షాపుల తనిఖీలు చేపట్టారు. అదేవిధంగా ట్రాఫిక్ పోలీసులు డ్రైవింగ్ లెసెన్సు, ఆర్.సి. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేశారు. వాహనాల రాకపోకలు అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పోలీసులు పరిశీలించారు. పట్టణ సీఐ విజయ్ కుమార్ తదితర సీఐలు నాకాబంధీలో పాల్గొన్నారు. మొత్తం ఈ ఆపరేషన్లో ఏసీపీ ఆధ్వర్యంలో ఐదు మంది సీఐలు 60 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలు, గుట్కా, అనుమతి లేకుండా మద్యం విక్రయించడం, వాహనాల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, ప్రార్థనా స్థలాల వద్ద పరిశీలన చేసినట్లు ఏసీపీ రంగస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ విజయ్ కుమార్. చంద్రశేఖర్, ఎస్సైలు, ట్రాఫిక్ సిఐ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మర్రి లక్ష్మారెడ్డి కాలేజీలో కలెక్టరు తనిఖీ

విశాలాంధ్ర-దుండిగల్ : నియోజకవర్గం పరిధి దుండిగల్‌లో మర్రి లక్ష్మారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల నందు శుక్రవారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష నిర్వహణను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతమ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష ప్రశాంతంగా జరుగుతుందా, సిసి కెమెరాలు పని చేస్తున్నాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష గదులలో తిరిగి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ పర్యటనలో దుండిగల్ తహసిల్దార్ మతిన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వందేళ్ల గండిపేట్ కాండూట్‌కు మరమ్మతులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో చరిత్రాత్మక గండిపేట్ కాండూట్‌ను పదేళ్లుగా వేధిస్తున్న లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. లీకేజీకి చెక్ పెట్టేందుకు జలమండలి సిద్ధమైంది. కాండూట్‌కు ఏర్పడిన లీకేజీని అరికట్టేందుకు మరమ్మతు పనులు చేపడుతోంది. ఈ పనుల్ని ఎండీ అశోక్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ గండిపేట్ కాండూట్‌కి గత 10 సంవత్సరాల నుంచి గండిపేట్, కోకాపేట్, మణికొండ, సీబీఐటీ కాళాశాల, పుప్పాల గూడ, జానకీ నగర్, కౌసర్ కాలనీ, ఎంఈఎస్ క్యాంపస్ తదితర ప్రాంతాల్లో తీవ్ర లీకేజీలు ఏర్పడ్డాయి. అయితే, ఈ లీకేజీలను అరికట్టడానికి మరమ్మతులు చేపడితే నీటి సరఫరాలో నెల రోజుల పాటు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ఈ పనుల్ని వాయిదా వేస్తూ వస్తున్నారు. నీటి సరఫరాకు ఆటంకం కాకుండా రిపేర్లు చేసే టెక్నాలజీలను అన్వేషించి ఎట్టకేలకు చెన్నైకి సంబంధించిన కంపెనీ జర్మన్ టెక్నాలజీతో సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా లీకేజీలు అరికడతామని ముందుకొచ్చింది. 40 రోజుల కింద ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్ వద్ద కాండూట్‌కి 10 మీటర్ల మేరకు గ్రౌటింగ్ ద్వారా మరమ్మతులు ప్రయోగాత్మకంగా చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో మిగతా ప్రాంతాల్లోనూ పనులు పూర్తి చేయాలని ఎండీ అధికారులకు సూచించారు. వాటర్ షట్ డౌన్ తీసుకుంటే వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. కాబట్టి, వారిని దృష్టిలో పెట్టుకుని అధికారులు కెమికల్ ట్రీట్‌మెంట్ పద్ధతిని ఉపయోగించి మరమ్మతులు చేపడుతున్నారు. లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో మొదటగా ప్రత్యేక పరికరాలతో నీటిని ఖాళీ చేసి ఆ ప్రదేశంలోకి ప్రత్యేకమైన రసాయనాన్ని పంపిస్తారు. క్షణాల్లో ఆ రసాయనం ఘనపదార్థంగా మారి, ఖాళీ ప్రాంతాల్లో పూడుకుపోతుంది. దీంతో లీకేజీ ఆగిపోతుంది. ఈ పద్ధతి ద్వారా నీటి సరఫరా నిలిపివేయకుండానే మరమ్మతు పనులు నిర్వహించవచ్చు. గండిపేట్ నుంచి నగరానికి మొత్తం 26 ఎంజీడీల తాగునీరు సరఫరా చేసే సామర్థ్యం ఉంది. కాగా ప్రస్తుతం 20 ఎంజీడీలు సరఫరా చేస్తే, అందులో దాదాపు 8 జీడీల నీరు ఈ లీకేజీల వల్ల వృథా అవుతోంది. చివరికి 12 ఎంజీడీలు మాత్రమే వినియోగదారులకు సరఫరా అవుతున్నాయి. ఈ లీకేజీ సమస్య దాదాపు 14.5 కిలో మీటర్ల మేర 45 ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఎండీ అశోక్ రెడ్డి సరఫరాపై ప్రభావం పడకుండా మరమ్మతు నిర్వహణ పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ రిపేర్ పూర్తయితే మరో 14 ఎంజీడీల నీరు వినియోగదారులకు సరఫరా చేయవచ్చు. గండిపేట్ నుంచి ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్ వరకు మొత్తం నీటి సరఫరా గ్రావిటీ ద్వారానే జరుగుతుంది. ఫిల్టర్ బెడ్‌లో నీటిశుద్ధి అనంతరం వినియోగదారులకు నీటి సరఫరా జరుగుతోంది. 1920లో అప్పటి నిజాం ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాల కోసం నిర్మించిన ఈ రిజర్వాయర్ నుంచి జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నంబర్-4, 5, 6 పరిధిలో వినియోగదారులకు దీని ద్వారా తాగునీరు సరఫరా చేస్తారు. ఈ కార్యక్రమంలో సీజీఎం రవీందర్ రెడ్డి, ట్రాన్స్ మిషన్ అధికారులు పాల్గొన్నారు.

భూదాన్ యజ్ఞ బోర్డ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణలో ఉన్నటువంటి భూదాన భూములు అన్యా ప్రాంతం అవుతున్న పట్టించుకునే నాధుడే లేడని వారు వాపోయారు అందువల్ల వెంటనే ఆచార్య వినోబాభావే నామిని అయినటువంటి సర్వ సేవా సంఘ్ (తెలంగాణ రాష్ట్ర సర్వోదయ మండల్) ద్వారా వెంటనే తెలంగాణ రాష్ట్రంలో భూదాన్ యజ్ఞ బోర్డు ఏర్పాటు చేసి భూదాన భూములకు కాపాడుతామని తెలంగాణ రాష్ట్ర సర్వోదయ మండల్ తెలిపింది. రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.శంకర్ నాయక్ అధ్యక్షతన శుక్రవారంనాడు రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే అనుకూల ఆమోదం తెలపాలని వారు పత్రిక ముఖంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. భూదాన్ యజ్ఞం బోర్డు లేకపోవడం వల్ల ఇప్పటికే ఇష్టారాజ్యంగా ప్రభుత్వ అధికారులు పని చేశారని అలాంటి విషయంపై విచారణ కూడా జరుగుతుందని ఆయన అన్నారు. ఈ విషయంపై సీరియస్‌గా స్పందించినటువంటి సర్వసేవ సంఘ్ అండ్ సర్వోదయ మండల్ శుక్రవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భూదాన భూమి ఎక్కడ ఉన్నా వాటిలో ప్రభుత్వం ఇది భూధాన్ భూమి అని బోర్డు ఏర్పాటు చేయాలని తీర్మానించడం జరిగింది. భూదాన భూములు ఎక్కడ ఉన్నవో వాటిపైకి సర్వోదయ మండల్ నాయకత్వం భూదాన భూములు రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా వాటి పైకి రాష్ట్ర సర్వోదయం మండల్ కమిటీ వెళ్లాలని తీర్మానించడం జరిగింది అనంతరం సర్వోదయ మండల్ గౌరవ అధ్యక్షులు హన్మ ను శాలువాతో సన్మానించడం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ రావు, లత, యూత్ ప్రెసిడెంట్ భాస్కర్, మహిళా ప్రెసిడెంట్ యాదమ్మ, సుజాత, రాము, కృష్ణ, రూప్సింగ్, మల్లేష్, మహేష్, ఖాదర్ బెగ్ పాల్గొన్నారు.

నేటి నుండి టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : అక్టోబర్ 26న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్‌టిఆర్ భవన్‌లో ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్ర పార్టీ కార్యాలయం, ఎన్‌టిఆర్ భవన్‌లో తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. ఇటీవల సభ్యత్వ నమోదుపై సమావేశాన్ని కూడ నిర్వహించారు. దీనిలో తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. అలాగే అన్ని కమిటీల ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. తెలుగుదేశం పార్టీని ప్రజలలోకి తీసుకెళ్లడానికి, సంస్థాగతంగా పార్టీ బలోపేతం కావడానికి ఈ కార్యక్రమాన్ని మంచి అవకాశంగా తీసుకోవాలని తెలుగుదేశం రాష్ట్ర పార్టీ నిర్ణయించింది. శనివారం నిర్వహించనున్న సభ్యత్వ నమోదు కార్యాక్రమానికి పార్టీ శ్రేణులు అందరు హాజరు కావాలని రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చింది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఆమనగల్లు మండలంలోని మేడిగడ్డ గ్రామపంచాయతీకి చెందిన ఇస్లావత్ సోంల కు ముప్పై తొమ్మిది వేలు, సబవట్ వెంకట్యకు ముప్పై ఆరు వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులను శుక్రవారం కె.ఎస్.ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్ బాధితులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనూష, వెంకట్య ఆర్థిక సహాయం కొరకు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా 75000 వేల రూపాయలు మంజూరు చేయగా ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కసిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ జగన్, రాజ్ కుమార్, కిషన్, వశాంత్, రఘు, లక్ష్మణ్, భద్రు, కళ్యాణ్. కౌశిక్, పంతుల పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE & JMFC, AT RAMANAGARA

EXECUTION PETITION No.57/2024

BETWEEN:SRI. KARTHIK HEBBAR S/O SREEDHARA MURTHY AGED ABOUT 43 YEARS, R/A NO. 206, SHASHWATHI VILAS APARTMENT 17TH CROSS, 5TH MAIN, 5TH PHASE, J.P NAGAR, BENGALURU-78

REP BY HIS GPA HOLDER

SREEDHARA MURTHY S/O LATE. KRISHNA HEBBAR AGED ABOUT 78 YEARS, R/A NO. 206, SHASHWATHI VILAS APARTMENT 17TH CROSS, 5TH MAIN, 5TH PHASE, J.P NAGAR, BENGALURU-78 ...DECREE HOLDER

AND:M/S DREAMLAND VENTURES (P) LTD. AND OTHERS ...JUDGEMENT DEBTORS

SUMMONS TO JUDGEMENT DEBTORS No. 1 AND 2 By way of pepper publication

1. M/S Dreamland Ventures pvt. Ltd., Office No.4, New No. 100, plot No 48, 2nd floor, K.H. Road, Sudham Nagar, Benagluru-27 Rep. By its authorilesed signatory Sri. G.Dharma Prakash S/o H.Govindappa Age: Major

2. M/s Agri Gold project ltd., (Real Estate Division) Having its office at No.6-3-680, A/B Thakur Mansion Lane Near Samajagudu Circle, Panjagutta, Hydrabad-560082 Represented by its authorized Signatory

Whereas, the decree holder above named has filed the above case Execution of sale deed in favour of decree holder other various reliefs in Execution petition No.57/2024 on the file of Ist ADDL SENIOR CIVIL JUDGE AND JMFC RAMANAGARA against the Judgement DEBTORS No.1 AND 2. Whereas this summons to the JUDGEMENT DEBTORS No.1 AND 2 above named is published directing the JUDGEMENT DEBTORS NO.1 AND 2 to appear before the Ist ADDL SENIOR CIVIL JUDGE AND JMFC RAMANAGARA on **25/11/2024 at about 11.00 A.M** to answer the claim of the Decree Holder. Take notice that if you fail to appear before this Hon'ble Court on the aforementioned date of hearing either in person or through your counsel, the JUDGEMENT DEBTORS No.1 AND 2 will be placed ex-party and the above case will be determined in accordance with law.

DESCRIPTION OF SCHEDULE PROPERTY

All that piece and parcel of the immovable vacant residential property bearing site No.193, Khatha No.34 measuring East to West:40-0 feet and North to South: 30-0 Feet, totally measuring 1200 Sq. Feet carved out of Sy.No.17 situated at Lakshisagara Village and Bhimenahalli Village, Bidadi Hobli, Ramanagara Taluk and District, duly converted from agricultural to non-agricultural residential by the order of the Deputy Commissioner, Ramanagara District vide Official Memorandum bearing No. ALN(R) CR-47 and 49/2008-2009 dated 12.02.2009, in the layout known as FORTUNE GARDEN CITY, approved by the Bengaluru -Mysore Infrastructure Corridor Area planning Authority (BMICAPA) vide approval No.BMICAPA/09/052/2011-2012 dated 30.09.2011 and bounded on the

East by : Plot No.156. **West by** :Road,
North by: Plot No.194 and **South by:** proposed 192.

Given under my hand and seal of this court on this the 24th day of October 2024.

BY ORDER OF THE COURT
Sd/- Sheristedar
Civil Judge (Sr. DVN) & CJM Court, Ramanagara

K. N. Subba Reddy Advocate
No. 200, 11th Cross, Wilson Garden, Bangalore
Mob:9901096481

28న బీసీ కుల గణన రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : బిసిలకు జనాబా దమాషా ప్రకారం బిసిలకు విద్యా, ఉద్యోగాల్లోనే కాకుండ చట్టసభల్లో రిజర్వేషన్లను కల్పించడం ద్వారానే బిసి కొంతైనా సామాజిక న్యాయం దక్కుతుందని తెలంగాణ బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు ఎన్.బాలమల్లేష్ అన్నారు. వీటిని సాధించు కోవడమే లక్ష్యంగా బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 28న హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ నిర్వహించనున్న 'జనగణనలో బిసి కుల గణన' రాష్ట్ర సదస్సులో బిసి కులాల ప్రతినిధులు ప్రజుల పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం హైదరాబాద్ సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో బిసి హక్కుల సాధన కమిటీ మేడ్చల్ మల్కాజ్ జిల్లా అధ్యక్షులు సి.హెచ్.దశరథ అధ్యక్షతన బి.సి. హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎన్.బాలమల్లేష్ మాట్లాడుతూ గత 77 సంవత్సరాల స్వాతంత్ర్య పాలనలో బిసిలు అన్ని రంగాలలో వెనుకబడిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో బిసిలను వెనుకబడిన కులాలుగా కాకుండా వెనుకబడిన తరగతులుగా గుర్తించి బిసిలకు సామాజిక న్యాయం అందించడంలో సంక్లిష్ట పరిస్థితులు సృష్టించిందని అన్నారు. దీంతో బిసిలు సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా, రాజకీయంగా సాంస్కృతిక పరంగా తీవ్రంగా నష్టపోయారని, పాలకులు అందినట్లు చెబుతున్న అరకొర సామాజిక న్యాయం సైతం అందడంలోను తరాల కాలం గడిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై రాష్ట్ర సదస్సుల్లో చర్చించి కార్యచరణ ప్రకటిస్తామని బాలమల్లేష్ వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కార్యదర్శి ఆర్.కృష్ణమూర్తి, జిల్లా కార్యనిర్వహక అధ్యక్షురాలు కె.ప్రమీల, జిల్లా ప్రధాన కార్యదరి కాసోజు మహాలక్ష్మి, రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

ఈనెల 28న ప్రెస్ క్లబ్ జనగణనలో - బిసి కుల గణన సెమినార్...

జనగణనలో బిసి కులగణన అనే అంశంపై ఈనెల 28న బషీర్ ప్రెస్ నిర్వహించనున్న రాష్ట్ర సెమినార్ నిర్వహించనున్నట్లు ఎన్.బాలమల్లే ష్ తెలిపారు. ఈ సెమినార్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు, మాజీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, జాజు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సెమినార్లో బిసిలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసులకు లొంగిపోయిన శ్రీకాంత్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సోదరుడు శ్రీకాంత్ గౌడ్ శుక్రవారం మహబూబ్ నగర్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని క్రిస్టియన్ పల్లి శివారు 523 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, సంతకాలతో ప్లాట్లుగా చేసి విక్రయాలు జరిపిన వ్యవహారంలో మొత్తం నలుగురిపై మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు రెండు నెలల క్రితం కేసులు నమోదు చేశారు. ముగ్గురిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మరో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సోదరుడు శ్రీకాంత్ గౌడ్ బెయిల్ కోసం హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్వయంగా తన సోదరుడు శ్రీకాంత్ గౌడ్‌ను తన వాహనంలో తీసుకొచ్చి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద దించారు. కాగా శ్రీకాంత్ గౌడ్ లొంగిపోతున్న విషయం తెలుసుకొని పలువురు బీఆర్ఎస్ నాయకులు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి శ్రీకాంత్ గౌడ్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై కొరడా

విశాలాంధ్ర-దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటి పరిధిలో అక్రమ నిర్మాణాలపై శుక్రవారం రెవెన్యూ అధికారులు కొరడా జులిపించారు. డి.పోచంపల్లి సర్వే నెంబర్ 120లో ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి నకిలీ పత్రాలను సృష్టించి అక్రమంగా నిర్మాణాలను చేపట్టారు. దీంతో ఫిర్యాదు అందుకున్న దుండిగల్ మండలం తాసిల్దార్ సయ్యద్ మతిన్ నిత్రుత్వంలో రెవెన్యూ శాఖ అధికారులు సర్వే నెంబర్ 120 లో అక్రమ నిర్మాణాలని జెసిబి సహాయంతో నేలమట్టం చేశారు. ఎమ్మార్వో సయ్యద్ మతిన్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నరన్న ఫిర్యాదుతో చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి విక్రయానికి పాల్పడ్డ, పలు నిర్మాణాలు చేపట్టిన ఊరుకునే ప్రసక్తి లేదని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తాసిల్దార్ హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగం పల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన 1,20,000 రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబాలకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని తెలిపారు. ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుం టున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందన్నారు. వైద్య చికిత్సకి సహకారం అందించిన ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బ్రిక్ శ్రీనివాస్, సజీవ రెడ్డి, పోతుల రాజేందర్, ఎండీ. ఇబ్రహీం, సాంబయ్య, ప్రభాకర్, శ్రీధర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, మనోజ్, వెంకటేశ్వర రెడ్డి, దేవా, హరిప్రకాష్, వెంకట రాంబాబు, బాలరాజు, వెంకటేశ్వరరావు, సంఘం మహేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఉమంగ్' వార్షిక క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : సాధన ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో 'ఉమంగ్' పేరుతో అద్భుతంగా వార్షిక క్రీడా దినోత్సవం జరిగింది. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధే లక్ష్యంగా క్రీడలు, విభిన్న శ్రేణి అథ్లెటిక్ ఈవెంట్‌లు, శక్తివంతమైన ప్రదర్శనలతో ఈ వేడుక నిర్వహించారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో క్రీడా సాధకులను సంస్థ చైర్మన్ సునంద్ సూరప నేని, మేనేజింగ్ డైరెక్టర్ కుమారి సాధన దేవి సూరపనేని సన్మానించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని (కేంబ్రిడ్జి 1 నుంచి 8 తరగతులు, సీబీఎస్ఈ 6 నుంచి 10వ తరగతులు) విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. జుంబా డాన్స్, ఫ్లవర్ డ్రిల్, బటర్ఫ్లై డ్రిల్, కరాటే, బాండ్ డ్రిల్, మల్టీ స్పోర్ట్స్ డ్రిల్, శారీ డ్రిల్, జాతీయ సమైక్యత థీమ్, గ్రాండ్ ఫినాలే అసాధారణ మైన ప్రదర్శనలతో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సాధన ఇంటర్నేషనల్ స్కూల్ అడ్మిన్ డైరెక్టర్ జీ మురళీ మోహన్, సీబీఎస్ఈ ప్రిన్సిపాల్ శోభ్నా శిరోహి, సీఏఐఈ ప్రిన్సిపాల్ సరిత కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి లత, అకడమిక్ హెడ్ శిరీష కొల్లి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : కొలను

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 డివిజన్ గాజులరామారం పరిధి కైసర్ నగర్‌లో ముస్లిం మైనారిటీలు గత నెల మంచి నీటి సమస్యపై నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి కమీషనర్‌తో మాట్లాడి మినిస్టర్ ఇంచార్జి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా నూతన బోర్‌వెల్ ఏర్పాటు చేయించి శుక్రవారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం మైనారిటీ సోదరులు నియోజకవర్గ ఇంచార్జి హన్మంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, 125 డివిజన్ అధ్యక్షులు లాయక్, సమీర్ ఖాన్, షఫీ, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసరావు, గఫ్ఫార్, అబ్బు, రహీం, కలీం, అజయ్, వంశీ, ఆమీర్, నయీమ్, ఖలీల్ రెహమాన్, మహేష్, కాజా, శ్రీలత పాల్గొన్నారు.

వైద్య రంగాన్ని పట్టించుకోని ప్రభుత్వం

విశాలాంధ్ర - బషీర్ బాగ్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ హాస్పటల్స్‌లలో ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారాన్ని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైద్య రంగాన్ని గాలికి వదిలేసిందని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రైవేట్ హాస్పటలల్లో మెడికల్ మాఫియా విపరీతంగా నడుస్తుందన్నారు. ప్రైవేట్ హాస్పటల్స్ ఆదీనంలోనే మెడికల్ మాఫియా భారీ ఎత్తున జరుగుతుందన్నారు. ప్రైవేట్ హాస్పటల్స్ యాజమాన్యాలు టెస్టుల పేరుతో పేదల నుంచి వేల రూపాయలను అడ్డగోలుగా వసూళ్లు చేస్తున్నాయన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులల్లో సరైన వైద్య సదుపాయం కల్పించక పోవడం వల్లనే పేద ప్రజలు ప్రైవేట్ హాస్పటల్స్‌కు వెళ్తున్నారన్నారు. పేద ప్రజల మీద ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వైద్య రంగాన్ని పూర్తిగా ప్రభుత్వపరంగా మార్చాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేశారు. వైద్య శాఖలో ఖాలీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

దేవాలయాల్లో దొంగతనాలకి పాల్పడుతున్న దుండగుల పట్టివేత

విశాలాంధ్ర - హుస్నాబాద్ : దేవాలయాల్లో దొంగతనాలకి పాల్పడిన దుండగులను చాకచక్యంగా పట్టుకున్నట్లు కొహెడ ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనం టీవీఎస్ ఎక్సెల్‌పై ఇద్దరూ వ్యక్తులు అనుమానాస్పదగా సముద్రాల వైపు వెళ్తుండగా, పోలీసు సిబ్బందిని చూసి పారిపోతుండగా చాకచక్యంగా పట్టుకున్నా మన్నారు. నిందితులను విచారించగా కొహెడ మండలం పరిధిలోని శనిగరం, చంచల్ చెరువుపల్లి, కూరెళ్ళ, నాగ సముద్రాల గ్రామాలతో పాటు చిగురుమామిడి మండలం నవాబుపేట, కొండాపూర్, గన్నేరువరం మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడినట్టు నిందితులు నేరం అంగీకరించడంతో నేరస్తులను జ్యుడిషియం రిమాండ్ తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మున్సిపాలిటీ ఏఈ

విశాలాంధ్ర - ఘట్‌కేసర్ : ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఇన్‌చార్జీ ఏఈగా పనిచేస్తున్న రాజశేఖర్ కాంట్రాక్టర్ నుండి లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు వలపన్ని శుక్రవారం పట్టుకున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువు వద్ద క్రేన్లు ఏర్పాటు చేసే కాంట్రాక్ట్ పొందిన సదర్ కాంట్రాక్టర్ పనులు పూర్తి అయిన సందర్భంగా బిల్లులు మంజూరు చేయాలని ఇన్‌చార్జీ ఎం. రాజశేఖర్‌ను కోరగా ఎం బుక్ ఆమోదించడానికి 1లక్ష 50వేలు లంచం డిమాండ్ చేయగా అంత ఇచ్చుకోలేను 75 వేలు ఇస్తానని కాంట్రాక్టర్ చెప్పగా అంగీకరించిన ఏఈ, ఇట్టి డబ్బులలో మొదటి దశగా 50 వేలు బోడుప్పల్‌లో ఏఈ రాజశేఖర్‌కు కాంట్రాక్టర్ ఇస్తుండగా వలపన్ని పట్టుకున్నట్లు ఏసిబి అధికారులు తెలిపారు. మున్సిపాలిటీలో ఎం బుక్ రాసి ఏఈకి పంపించడానికి 60వేల లంచం డిమాండ్ చేసిన వర్క్ ఇన్స్‌పెక్టర్ సున్నీ కాంట్రాక్టర్ నుండి ఫోన్ పే ద్వారా 30వేలు చెల్లించినట్లు, మరో 30వేలకు డిమాండ్‌చేసిన వర్క్ ఇన్స్‌పెక్టర్‌ను అదుపులోకి తీసుకోని ఇద్దరిపై కేసు నామోదు చేసి కోర్టులో హాజర్ పరిచినట్లు ఏసిబి అధికారులు తెలిపారు.

రియల్ ఎస్టేట్ ప్రాపర్టీలను ఆవిష్కరించిన నారెడ్కో

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి : హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నేటి నుంచి మూడు రోజుల ప్రాపర్టీ షో హైదరాబాద్, 25 అక్టోబర్ 2024: 75 మందికి పైగా బిల్డర్లు, డెవలపర్లు, ఆర్థిక సంస్థలతో నారెడ్కో తెలంగాణ 14వ ప్రాపర్టీ షో శుక్రవారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభ మైంది. ప్రతి వర్గం కస్టమర్ల బడ్జెట్/ స్థానానికి సరిపోయే విభిన్నమైన ప్రాపర్టీలను కలిగిన నారెడ్కో (నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. నారెడ్కో తెలంగాణ 14వ ప్రాపర్టీ షో మూడు రోజుల పాటు కొనసాగనుంది. 2024 అక్టోబర్ 25, 26, 27 తేదీలలో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో హాల్ నెం. 4లో ఈ ప్రదర్శనను సందర్శకులు సందర్శించవచ్చన్నారు. నారెడ్కో తెలంగాణ ప్రెసిడెంట్ విజయ సాయి మేకా మాట్లాడు తూ, "హైదరాబాద్ అద్భుతమైన అభివృద్ధిని సాధిస్తోంది. దాని ఫలితా లను రియల్ ఎస్టేట్ రంగం పొందుతోంది. కొనసాగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి, మెరుగైన అనుసంధానతతో, నగరంలోని సబ్ మార్కెట్లు అభివృద్ధి చెందు తున్నాయి. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఇంతకంటే మంచి సమయం లేదు. నారెడ్కో తెలంగాణ 14వ ప్రాపర్టీ షో నగరం అంతటా ఉన్న డెవలపర్లతో ఒకే పైకప్పు క్రింద కలుసుకునే అవకాశాన్ని అందిస్తోంది" అని అన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు

విశాలాంధ్ర - వనపర్తి : ప్రణాళికాబద్ధంగా వరి కొను గోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వానాకాలం వరి కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు వేరు వేరుగా పెట్టాలన్నారు. ఆయా గ్రామ పరిధిలో ధాన్యం ఉత్పత్తిని బట్టి గ్రామంలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో ప్రణాళిక సిద్ధం చేయాలని రైతులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, గన్ని బ్యాగులు, టార్పాలిన్‌ల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్, వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, పి.డి డి ఆర్డీఏ ఉమా దేవి, పౌర సరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, డి.యం. సివిల్ సప్లై ఇర్ఫాన్, డి.పి.యం అరుణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కూనంనేని శంకుస్థాపన

విశాలాంధ్ర - కొత్తగూడెం : ప్రతి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించే వరకు విశ్రమించబోనని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మరోసారి స్పష్టం చేశారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని శ్రీనగర్ కాలనీ, ఎదురుగడ్డ, గౌండ్ల రామవరం గ్రామాల్లో రూ.29లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి డ్రైన్ల నిర్మాణానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షల వ్యంతో నిర్మించిన శ్రీనగర్ కాలనీ గ్రామ పంచాయతి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నట్లు చెప్పారు. ఇజిఎస్, డిఎమ్ఎఫ్టి, ఎస్డిఎఫ్ తదితర నిధులతో గడిచిన 11 నెలలకాలంలో కోట్లాది రూపాయల వ్యంతో రోడ్లు, డ్రైన్లు నిర్మించడం జరిగిందన్నారు. ప్రతిపాదనలు పంపిన అభివృద్ధి పనులకు త్వరలో అనుమతులు లభిస్తున్నాయని తెలిపారు. నూతనంగా శ్రీనగర్ గ్రామ పంచాయతీకి నిర్మించిన కార్యాలయంతో ప్రజలు మరిన్ని మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. సాయిబాబా గుడి వద్ద నిర్మించనున్న రిటైనింగ్ వాల్ తో ఆ ప్రాంతాలకు వరద ముంపు నుంచి నివారణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ కె వి. ప్రసాద్, ఎంపిడివో చలపతిరావు, పంచాయతి రాజ్ డిఈ రామకృష్ణ, ఎంపివో శ్రీనివాస్, ఏఈ శివలాల్ నాయకులు, ఇరిగేషన్ ఏఈ వెంకటస్వామి, సిటీ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, కంచర్ల చంద్రశేఖర్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, లగడపాటి రమేష్ చంద్, పెద్దబాబు, పూనెం శ్రీనివాస్, అన్వర్ పాషా, కోళ్ల పద్మ, జగన్, కళ్లెం సత్యనారాయణ, ధనలక్ష్మి, రత్నకుమారి, బలరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మూసీ బాధితుల పక్షాన ఆమ్ ఆద్మీ పార్టీ

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : మూసీ నది ప్రక్షాళన అభివృద్ధి పేరుతో పేదల ఇండ్లు కూల్చొద్దని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. మూసీ బాధిత ప్రజల పక్షాన ఆమ్ ఆద్మీ పార్టీ ఉంటుందని అయన అన్నారు. డాక్టర్ దిడ్డి సుధాకర్ నేతృత్వంలో ఆప్ ప్రతినిధి బృందం శుక్రవారం హైదరాబాద్, చాదర్ ఘాట్ మూసి నది ఒడ్డున కూల్చివేసిన పేదల ఇళ్లను పరిశీలించి, బాధితులను పరామర్శించారు. అనంతరం దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ మూసి ఒడ్డున దశాబ్దాలుగా ఉంటున్న పేద ప్రజలు ఆక్రమణదారులు కాదని, మున్సిపల్ పన్నులు, విద్యుత్ బిల్లులు కడుతూ జీవిస్తున్నారని, పబ్లిక్ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎలా ఇళ్ళు కూల్చుతారని నిలదీశారు. తాము మూసీ అభివృద్ధికి వ్యతిరేకం కాదని, రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేసి డీపీఆర్ ప్రదర్శించి వారి సలహాలు సూచనల మేరకు ముందుకు వెళ్లాలని అయన సూచించారు. మూసి బాధితులకు న్యాయం చేయాలనీ కోరుతూ బాధితులతో కలసి ఈనెల 28 న హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశం నిర్వహిస్తున్నామని డాక్టర్ దిడ్డి సుధాకర్ వెల్లడించారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, ఎంఏ. మజీద్, సోలామన్ రాజ్, అధికార ప్రతినిధులు జావీద్ షరీఫ్, అఫ్స సలాం, కాలిం బాబా, నేతలు శివాజీ, కొడంగల్ శ్రీనివాస్, ఇస్మాయిల్, రాకేష్ సింగ్ పాల్గొన్నారు.

సీఎం సాకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ - తొర్రూరు : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేసి పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిందని, తాజాగా గ్రామాల అభివృద్ధికి సీఆర్ఆర్ నుండి రూ.22 కోట్లు, తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం టీఎఫ్ సీడీ నుండి రూ.5 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని, పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక దోపిడీ, ఆర్థిక నష్టం చేసి రూ.7లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి చేయని నాయకులు అభివృద్ధి గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల సహకారంతో తొర్రూరు వ్యవసాయ శాఖ మార్కెట్ చైర్మన్ పదవి చర్లపాలెం గ్రామానికి చెందిన హనుమాన్ల తిరుపతి రెడ్డికి ఇవ్వడం జరిగిందన్నారు. తొర్రూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి, టీపీసీసీ మాజీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, జిల్లా నాయకులు గంజి దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, రూరల్ డెవలప్మెంట్ కమిషన్ డైరెక్టర్ వెంకటనారాయణ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, నాయకులు మల్లేశం గౌడ్, ధరావత్ సోమన్న, సోమిరెడ్డి, వెంకటరెడ్డి, దేవేందర్ రాజు, ప్రసాద్, వెంకన్న, తండా రవి, సాయి మల్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : మారుమూల ప్రాంతాల అభివృద్ధికి, పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ మండలంలోని జవహర్ నగర్ వద్ద రామాలయం చుట్టూ 5 లక్షల ఎస్ డి ఎఫ్ నిధులతో నిర్మించిన కాంపౌండ్ గోడ ను, గోవిందరావు పేట మండలం, చాల్వాయి ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, (సి ఎస్ ఆర్ నిధులు మౌరిటెక్ ఐటి సంస్థ సౌజన్యం) 10 కంప్యూటర్లు, చాల్వాయి లోని ట్రైనింగ్ సెంటర్లో ఎస్ హెచ్ జి మహిళలకు, ఉష ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ సౌజన్యంతో కుట్టు మిషన్ 25 రోజుల శిక్షణ, ఉత్పత్తి కేంద్రంను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., గ్రంథాలయ చైర్మన్ రవి చందర్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావులతొ కలసి మంత్రి ప్రారంభించారు. అనంతరం వెంకటాపూర్ మండలంలోని జవహర్‌నగర్ మాడల్ స్కూల్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పాఠశాలల్లో విద్యార్థులకు అందుకున్న విద్యను గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు కుర్చీలు, టేబుల్స్, ఫర్నిచర్ సరిపడలేవని, పిల్లలు ఆటలు ఆడుకోవడానికి గ్రౌండ్ లెవెలింగ్, కాంపౌండ్ వాల్ లేదని ప్రిన్సిపాల్ మంత్రి కి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థను పట్టింపు లేక విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని, మా ప్రభుత్వం విద్య వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. ప్రైవేట్ రంగానికి దీటుగా పాఠశాలలను తీర్చుదిద్దుతున్నామని అన్నారు. ఉపాధ్యాయులు ఓపికగా, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యను బోధించాలని సూచించారు. జిల్లాలో అర్హులైన పేదవారందరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం పేదవాడి గురించి కనీస ఆలోచన చేయలేదని విమర్శించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందుల ఎదురైనా అభివృద్ధి సంక్షేమాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించినా, ఏదీ ఆగదని పేదవాడి కన్నీరు తుడవడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పలు అంశాలపై మంత్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డి ఈ, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ములుగు పట్టణం పస్రాపల్లి గ్రామానికి చెందిన పత్తి శ్రీకాంత్, దామెర సరోజన, ములుగు పట్టణం సఫా యి గడ్డకు చెందిన ఎంపెల్లి సారయ్యలు ఇటీవలే మరణించగా, వారి కుటుంబాలను, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి నీటిసరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. అదే గ్రామానికి చెందిన ఉకంటి కిరణ్ అనారోగ్యంతో బాధ పడుతుండగా అయన వివరాలు మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'వంక' ఆశయసాధనకు పునరంకితమౌదాం

బడుగుల వాణిని చట్టసభల్లో వినిపించిన పోరాటయోధుడు

వర్థంతి సభలో ముప్పాళ్ల

విశాలాంధ్ర-తణుకు: కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్న రోజుల్లోనే పార్టీ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించి, బడుగుల వాణిని చట్టసభలో వినిపించిన అసెంబ్లీ టైగర్ వంక సత్యనారాయణ ఆశయ సాధనకు పునరంకితం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమర యోధులు, సీపీఐ ఉద్యమనేత, మాజీ ఎమ్మెల్యే వంక సత్యనారాయణ ఆరో వర్ధంతి సభ శుక్రవారం వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన జరిగిన సభలో ముప్పాళ్ల మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన పోరాటయోధుడు సత్యనారాయణ అన్నారు. విద్యార్థి, యువజన నాయకుడిగా ఉన్న సమయంలో ఆయన తమకు మార్గదర్శకులని గుర్తు చేశారు. నాడు అణగారిన వర్గాలు కమ్యూనిస్టుల పిలుపు కోసం ఎదురుచూసేవారని, నేడు ప్రజల్లో స్తబ్ధత, శూన్యత ఏర్పడిందని, వంక సత్యం వంటి నాయకుల స్ఫూర్తితో ప్రజాస్వామ్య మనుగడకు మరో పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని ముప్పాళ్ల పిలుపునిచ్చారు. నాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించి హక్కులు హరిస్తే నేడు మోదీ అప్రకటిత ఎమర్జెన్సీతో ప్రమాదం ఏర్పడిందని ముప్పాళ్ల మండిపడ్డారు. వామపక్ష, లౌకిక పార్టీల శ్రమకు తోడు ప్రజల్లో చైతన్యం వల్లనే బీజేపీకి పూర్తి మెజారిటీ రాకుండా నిలువరించామని గుర్తు చేశారు. మీడియా విలువలు కోల్పోయి అధికార పక్షానికి దాసోహం అంటున్న వేళ... పేదల పక్షాన లౌకికవాద మీడియా బలమైన గొంతు వినిపిస్తుందని, సోషల్ మీడియా వేదికగా ప్రజాస్వామ్యవాదులు చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజా సమస్యలే పరిష్కారంగా కమ్యూనిస్టు ఉద్యమాలను బలోపేతం చేసుకుంటూ ముందుకెళ్తే... 2029 ఎన్నికల్లో కమ్యూనిస్టుల పాత్ర కీలకమవుతుందని అన్నారు.

రాజకీయ లక్ష్యం కోసమే మీడియా తపన: ఆర్వీఆర్

'ప్రస్తుత రాజకీయాలు -పత్రికా విలువలు' అనే అంశంపై విశాలాంధ్ర దినపత్రిక సంపాదకులు ఆర్వీ రామారావ్ స్మారకోపన్యాసం చేశారు. విలువలు పత్రికలకేనా... రాజకీయ పార్టీలకు అవసరం లేదా అని రామారావ్ ప్రశ్నించారు. ఆర్థికాంశాల సారాంశమే రాజకీయాలని, నాటి మీడియా స్వాతంత్ర్య లక్ష్యాల కోసం పరితపిస్తే... నేటి మీడియా రాజకీయ లక్ష్యం కోసం పని చేస్తున్నదని విమర్శించారు. పత్రికా స్వేచ్ఛ ఎమర్జెన్సీ కాలంలోనే కనిపించిందని, నేడు పత్రికా స్వేచ్ఛ ప్రశ్నార్థకంగా మారిందని ఆర్వీఆర్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ మిశ్రమ ఎకానమి పేరుతో ఒక కాషాయాన్ని రూపొందించారని, దాన్ని రూపాంతరం మార్చి పెట్టుబడిదారీ విధానంలోకి తీసుకురావడానికి పటేల్, పురుషోత్తం టాండన్ వంటి బీజేపీ ఛాయలున్న నాయకులు పునాదులు నిర్మించి మోదీకి మార్గం చూపారని విమర్శించారు. నేటి విధ్వంసానికి పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలోనే బీజం పడిందని గుర్తు చేశారు. కమ్యూనిస్టులకు చట్ట సభల్లో సీట్లు అలలు వంటివని, వారికి ప్రజల్లో పునాదులే ముఖ్యమన్నారు. భీమారావు మాట్లాడుతూ వంక సత్యనారాయణ జిల్లాను పారిశ్రామిక, వ్యవసాయ, విద్యా రంగాల్లో ముందుకు నడిపించారన్నారు. పేదలకు భూ పంపిణీలో, జిల్లాకు రెండో పంట తీసుకురావడంలో తీవ్రంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఖాయిలా పడ్డ పరిశ్రమలను తెరిపించారని ప్రశంసించారు. మూడు దఫాలు ఎమ్మెల్యేగా పని చేసి బడుగుల వాణిని అసెంబ్లీలో వినిపించి ఎన్నింటికో పరిష్కారం చూపారని కొనియాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాను, వంక సత్యనారాయణను విడదీసి చూడలేమన్నారు. దారిదీపం సంపాదకులు డీవీవీయస్ వర్మ మాట్లాడుతూ డబ్బు, లబ్ధి... ఇవి రెండే రాజకీయాలను నడిపిస్తున్నాయని, తాయిలాలకు తలొగ్గకుండా ఓటేసినప్పుడే సమాజం పురోభివృద్ధి సాధిస్తుందని, సంపద పునః పంపిణీ జరగాలని, ఆ దిశగా ప్రజలు పనిచేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ నాటి కమ్యూనిస్టు ఉద్యమంలో వంక సత్యం ముఖ్య భూమిక పోషించారని గుర్తు చేశారు. ఉద్దరాజు రామం, ఎస్ఆర్ దాట్ల, అల్లూరి సత్యనారాయణరాజు, ఆర్ఎస్, సంకు అప్పారావు, ఇందుకూరి సుబ్బరాజు వంటి నాయకులతో ఆయన పనిచేశారని, గొప్ప పోరాట యోధుడని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ వంక సత్యనారాయణ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని, నేటి సమకాలీన అంశాలపై చర్చ జరగాలన్నారు. వేరే పార్టీలో ఉన్నా కమ్యూనిస్టు భావజాలంతో పనిచేస్తున్నామని తెలిపారు. డాక్టర్ వంక రామదాసు, డాక్టర్ వంక వసుంధర, వంక రాజకుమారి, డాక్టర్ బి.రమేశ్ చంద్రబాబు, అరుణ రేఖ, బి.సీతామహాలక్ష్మి, సంకు మనోరమ, ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడారు. అనంతరం అతిథులకు వంక కుటుంబ సభ్యులు జ్ఞాపికలు ప్రదానం చేసి సత్కరించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు సికిలే పుష్పకుమారి, ఎం.సీతారాం ప్రసాద్, కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

డయేరియా వ్యాప్తి అరికట్టండి

సీఎంకు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో డయేరియా వ్యాప్తిని అరికట్టి..నివారణకై తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్రంలో తాగునీరు, భూగర్భ జలాల కలుషితమవడం వల్లే డయేరియా ప్రబలుతోందన్నారు. ఇటీవల విజయనగరం జిల్లా, గుర్ల గ్రామంలో డయేరియాతో 10 మంది మరణించగా, వందలాది మంది ఆస్పత్రిపాలయ్యారని తెలిపారు. తాగునీరు కలుషితం కావడమే డయేరియా తీవ్రతకు కారణమని ర్యాపిడ్ రెస్పాన్స్ టీం వెల్లడించిందన్నారు. గుర్ల నుండి సేకరించిన 44 నీటి నమూనాలలో 31 నమూనాల్లో కోలిఫాం ఉన్నట్లు నిర్ధారించి, తాగునీరుగా వినియోగించరాదని తెలిపిందన్నారు. అదేవిధంగా పల్నాడు జిల్లా, దాచేపల్లిలో మరో ఇద్దరు వాంతులు, విరేచనాల బారినపడి మృతిచెందగా... మరో ఆరుగురు చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. గత మే నెలలో విజయవాడ నగరంలో కూడా కలుషిత నీటివల్ల డయేరియాతో 9 మంది చనిపోయారన్నారు. మంచినీటి పైపులైన్లు లీకవడం, పారిశుధ్యం లోపించడం, క్లోరినేషన్ సరిగా చేయకపోవడం, ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రపరచకపోవడం వల్ల అతిసారం విజృంభిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో డయేరియా ప్రబలడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డయేరియా వ్యాప్తిని అరికట్టాలని, నీరు కలుషితం కాకుండా అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. మంచినీటి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి, క్లోరినేషన్ ప్రక్రియ సక్రమంగా గావించి, అతిసార వ్యాధి నివారణకై యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు.

వైద్యరంగంలో ఆధునిక సాంకేతికత అత్యవసరం

రాయ్‌పూర్: దేశంలో మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజల సంక్షేమం కోసం వైద్యరంగంలో ఆధునిక సాంకేతికత అత్యవసరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. రాష్ట్రంలో నాలుగు ఉన్నత విద్యా సంస్థల స్నాతకోత్సవాల్లో పాల్గొనేందుకు రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రపతి చత్తీస్‌గఢ్ చేరుకున్నారు. రాయ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో శుక్రవారం నిర్వహించిన రెండవ స్నాతకోత్సవంలో ఆమె మాట్లాడారు. ప్రజల జీవితాలను రక్షించడంతో ముడిపడి ఉన్నందున వైద్య నిపుణుల నిర్ణయాలను వెల్లడించడంలో విస్తృతమైన బాధ్యతలను కలిగి ఉన్నారని అన్నారు. 2047 నాటి వికసిత్ భారత్ కలను సాకారం చేయడంలో వైద్య నిపుణులు నిర్ణయాత్మకమైన పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికత మానవుని జీవితాన్ని వేగవంతంగా ప్రభావితం చేసే యుగంలో మనం ఉన్నామని, మారుమూల ప్రజల సంక్షేమం కోసం ఈ సాంకేతికతను వినియోగించాలని చెప్పారు. ఎయిమ్స్ రారుపూర్ ఈ దిశగా తీవ్రంగా కృషి చేస్తోందని ప్రశంసించారు. గడిచిన 10 ఏళ్లలో మెడికల్ కాలేజీలు, ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్, పీజీ సీట్లు పెరిగాయని అన్నారు.

ఉత్తర్వులు ఉపసంహరించండి

సామాన్యులపై విద్యుత్ భారం అమానుషం: సీపీఎం

విశాలాంధ్ర-విజయవాడ: ఎఫ్‌పీపీసీఏ (ట్రూఅప్) చార్జీల పేరిట ప్రజలపై రూ.6,072 కోట్ల భారాన్ని విధిస్తూ ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ జారీ చేసిన ఉత్తర్వును వెంటనే ఉపసంహరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓవైపు ధరల పెరుగుదల, మరోవైపు ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్ భారం మోపడం అమానుషం అన్నారు. ఏనాడో వాడిన కరెంటుకు ఏళ్లు గడిచిపోయాక అదనంగా చార్జీలు చెల్లించాలన్న విధానం మోసపూరితమని మండిపడ్డారు. 2022-23లో వాడిన కరెంటుకు నవంబరు నుంచి 2026, జనవరి వరకు యూనిట్‌కు దాదాపు 83 పైసల అదనంగా చెల్లించాలని తాజా ఉత్తర్వు ఇచ్చారని వివరించారు. ఇది నిరుపేదలకు పెను భారం అవుతుందన్నారు. నెలకు 30 యూనిట్లకన్నా తక్కువ వాడేవారు యూనిట్‌కు రూ.1.90 పైసలు చెల్లిస్తుండగా ఇకపై రూ2.73 పైసల చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. అంటే 44 శాతం పెరుగుదల అని స్పష్టం చేశారు. అధికారంలోకి వస్తే 'విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం', 'విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తాం' అని ఉమ్మడి మేనిఫెస్టోలో హామీలిచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం... తగ్గించడం సంగతలా ఉంచి ఇప్పుడు అమాంతం 44 శాతం పెంపుదలకు పూనుకోవడం దారుణం అన్నారు. షార్ట్‌టర్మ్ కొనుగోళ్ళ పేరుతో గత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాన్ని కొనసాగించడం గర్హనీయం అన్నారు. మాటతప్పి ప్రజలపై వేసిన ట్రూఅప్ చార్జీల భారాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బిన్‌లాడెన్ అడ్డాలో పాక్ భారీ ఉగ్ర ఫ్యాక్టరీ

న్యూఢిల్లీ: ప్రపంచం ఆశ్చర్యపోయే రీతిలో పాకిస్థాన్ ఓ మెగా టెర్రర్ ఫ్యాక్టరీని అబోటాబాద్‌లో నడుపుతున్నట్లు భారత ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టాయి. ఈ ఉగ్ర క్యాంప్‌ను ఏకంగా సైన్యంలోని కీలక జనరల్ పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఆంగ్లపత్రిక ఎన్డీటీవీ కథనంలో పేర్కొంది. నిషేధిత ఉగ్ర సంస్థలు లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిద్దీన్లు ఏకంగా పాక్ సైనిక స్థావరం పక్కనే సంయుక్తంగా ఓ మెగా టెర్రర్ క్యాంప్ ఏర్పాటు చేశాయి. ఇందులోకి అనుమతి లేకుండా బయటి వ్యక్తులు అడుగుపెట్టడం అసాధ్యం. పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీకి చెందిన ఓ గుర్తుతెలియని జనరల్ దీనిని పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడ యువకులు, యువతులకు ఆయుధ వినియోగం, ఇతర ఉగ్ర కార్యకలాపాల్లోను శిక్షణ ఇస్తున్నారు. గతంలో అబోటాబాద్‌లోని ఓ సేఫ్ హౌస్‌లోనే అల్‌ఖైదా ఉగ్ర సంస్థ నాయకుడు ఒసామా బిన్ లాడెన్ దాక్కున్నాడు. 2011 మే నెలలో అమెరికా కమాండోలు రహస్యంగా హెలికాప్టర్లలో ఇక్కడికి వచ్చి లాడెన్‌ను మట్టుబెట్టడంతో ప్రపంచం ఆశ్చర్యపోయింది. ఆ తర్వాత పాక్ ఆ ఇంటిని పూర్తిగా ధ్వంసం చేసింది.

ఏపీ వైపు పారిశ్రామికవేత్తల చూపు



మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్రాండ్ ఇమేజ్‌తో పెట్టుబడులకు గమ్య స్థానంగా ఆంధ్రప్రదేశ్ మారిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. దాదాపు రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరు నూతన పాలసీలు రూపొందించిన నేపథ్యంలో దేశ విదేశాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నా రన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నాల్గవ బ్లాక్‌లోని ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వ పాలనలో గాడితప్పిన వ్యవస్థల్ని గాడిలో పెడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధిపదంలో పరుగులు పెట్టించే విధంగా సీఎం చంద్రబాబు అహరహం కృషి చేస్తున్నారన్నారు. ఎ అంటే అమరావతి, పి అంటే పోలవరం అనే బ్రాండ్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. సీఎం అయిన వెంటనే ఈ ఆర్థిక సంవత్సరంలో పోలవరానికి కేంద్ర నిధులను మంజూరు చేయించారని... వచ్చే రెండుమూడేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందనే విశ్వాసాన్ని ప్రజల్లో కల్పించారన్నారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి అమరావతి అభివృద్ధి పనులు వేగంగా ముందుకెళుతున్నాయన్నారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.9,138 కోట్లు, జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.6,280 కోట్లను కేంద్రం రాష్ట్రానికి మంజూరు చేసిందని, రాష్ట్రంలో ఏ ఒక్క నిరుపేద కూడా నాకు ఇల్లు లేదనే మాట అనే అవకాశం లేకుండా 2029 కల్లా రాష్ట్రంలోని నిరుపేదలు అందరికీ శాశ్వత గృహాలు నిర్మించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. అందుకనుగుణంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను రాష్ట్రంలో పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-2 మార్గదర్శకాలకు అనుగుణంగా 2025 నుండి 2029 మధ్య కాలంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున పక్కా గృహాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక వైపు అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు కూడా పెద్ద పీటవేస్తూ తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. వ్యక్తి గత కక్షలతో చెదురు మదురుగా రాష్ట్రంలో జరిగే దురదృష్ట సంఘటనలను ప్రభుత్వానికి ఆపాదిస్తూ ప్రభుత్వంపై బురద చల్లే విధంగా గత ముఖ్యమంత్రి ప్రయత్నించడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్ట చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

అన్నదాతల ఆగ్రహం... రహదారుల దిగ్బంధం

చండీగఢ్: ధాన్యం సేకరణలో ఆలస్యాన్ని ఎండగడుతూ పంజాబ్ రైతులు రోడ్డెక్కారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నేతృత్వంలో శుక్రవారం పంజాబ్ నుంచి వెళ్లే రహదారులతో పాటు ప్రధాన జాతీయ రహదారులను నాలుగు గంటల పాటు దిగ్బంధించారు. సమస్యలను పరిష్కరించి రైతుల పంటలను త్వరగా కొనుగోలు చేయాలని గతవారం రైతు సంఘం పంజాబ్ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. ప్రభుత్వం స్పందించకపోవడంతో రెండు రోజుల క్రితం లుథియానాలో జరిగిన సమావేశంలో ఎస్‌కేఎం నిరసనకు పిలుపునిచ్చింది. ఫజిల్కా, బఠిండా, బర్నాలా, లుథియానా జిల్లాలతో పాటు మండీలకు సమీపంలోని జాతీయ రహదారులపై ఆందోళనలు చేపట్టాలని రైతులు నిర్ణయించారు. గతవారం చండీగఢ్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సమావేశానికి పిలుపునివ్వడంతో నిరసనను నాలుగురోజుల పాటు వాయిదావేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని రైతు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ వ్యక్తులకు సహాయం చేసేందుకు ధాన్యం సేకరణను ఆలస్యం చేస్తున్నారని మండిపడ్డారు.

నేటి నుంచి ఆందోళన ఉధృతం

ధాన్యం కొనుగోళ్లు, డీఏపీ ఎరువుల కొరతపై ఆందోళనను ఉధృతం చేస్తామని ఎస్‌కేఎం, కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) ప్రకటించాయి. రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో శనివారం నుంచి ధర్నాలు చేపడతామని పేర్కొన్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సంగ్రూర్, ఫగ్వారా, బటాలా, దగ్రు, సంగ్రూర్‌లోని బార్బర్‌కకాన్‌లలో ధర్నాలు నిర్వహిస్తామని, ట్రాఫిక్‌ను అడ్డుకుంటామని తెలిపాయి.

హర్యానా స్పీకర్‌గా హర్విందర్ కల్యాణ్

చండీగఢ్: హర్యానా అసెంబ్లీ స్పీకర్‌గా బీజేపీ ఎమ్మెల్యే హర్విందర్ కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాసనసభలో ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ కల్యాణ్ పేరును ప్రతిపాదించగా... దీనిని సహచర బీజేపీ ఎమ్మెల్యే రణబీర్ గాంగ్వా బలపర్యారు. కర్నాల్ జిల్లాలో ఘరౌండాకు ప్రాతినిథ్యం వహిస్తున్న కళ్యాణ్... మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాగా స్పీకర్‌గా కల్యాణ్ ఎన్నికవడానికి ముందు ప్రొటెం స్పీకర్, కాంగ్రెస్ సీనియర్ నేత రఘువీర్ సింగ్ కడియన్ కొత్త ఎన్నికైన 90మంది ఎమ్మెల్యేల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఇక స్పీకర్‌గా ఎన్నికై అధ్యక్షస్థానాన్ని అలంకరించిన కల్యాణ్‌ను ముఖ్యమంత్రి సైనీ, బీజేపీ ఎమ్మెల్యేలు, మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా సహా కాంగ్రెస్, ఐఎన్ఎల్‌డికి చెందిన ఇతర శాసనసభ్యులు అభినందించారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు కన్నుమూత

ఎదులాపురం: గుస్సాడి నృత్యకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం రాత్రి కుమురంభీం జిల్లా జైనూరు మండలం మార్లవాయిలో తుదిశ్వాస విడిచారు. గుస్సాడి నృత్యానికి జాతీయ గుర్తింపు తెచ్చినందుకుగాను 2021లో కేంద్ర ప్రభుత్వం ఆయన్ను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. శనివారం మార్లవాయిలో కనకరాజు అంత్యక్రియలు ఆదివాసి సంప్రదాయం ప్రకారం నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

నిర్బంధంలో బిలియనీర్ కుమార్తె

కంపాల: భారత సంతతికి చెందిన బిలియనీర్ పంకజ్ ఓస్వాల్ కుమార్తె వసుంధరా ఓస్వాల్ ఈ నెల ప్రారంభంలో ఉగాండాలో నిర్బంధానికి గురైంది. ఉగాండాలో తమ కుటుంబానికి చెందిన ఫ్యాక్టరీ కార్యకలాపాలు పరిశీలించేందుకు వెళ్లిన ఆమెను కొందరు సాయుధ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్, హత్య అభియోగాలు కారణంగా చూపి, ఆమెను అదుపులోకి తీసుకున్నారని మీడియాతో వసుంధర సోదరి రిధి వెల్లడించారు. పీఆర్ఓ ఇండస్ట్రీస్ వారసురాలైన వసుంధర... నిర్బంధంలో అత్యంత దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. 'ఆ రోజు మా కంపెనీలోకి కొందరు సాయుధ పోలీసు అధికారులు ఎలాంటి వారెంట్ లేకుండా దూసుకొచ్చారు. సోదాలు చేయడంతో పాటు వసుంధరను ఉద్దేశించి అభ్యంతరకరంగా మాట్లాడారు. ఆ తర్వాత ఆమెను బలవంతంగా కారులోకి ఎక్కించి తీసుకెళ్లారు' అని రిధి వెల్లడించారు. ఆమెకు కనీసం పరిశుభ్రమైన తాగునీరు కూడా అందించడం లేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఎలాంటి నోటీసు లేకుండా ఆమెను ఒక జైలు నుంచి మరో జైలుకు మారుస్తున్నారు. ఆమెను సంప్రదించడానికి వీలులేకుండా చేస్తున్నారన్నారు.

హెచ్ఎస్ఎల్ మరో ఘనత

విశాలాంధ్ర బ్యూరో-విశాఖ: భారత్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో మరో కీలక ఘట్టం అవిష్కృతమైంది. రక్షణ రంగ ప్రభుత్వ సంస్థ విశాఖ హిందుస్థాన్ షిప్ యార్డు (హెచ్ఎస్ఎల్) గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ముందడుగు వేసింది. సముద్రంలో ఉపయోగించే పరికరాలకు అవసరమైన గ్రీన్ ఎనర్జీ బ్యాటరీల ఉత్పత్తి టెక్నాలజీని హిందుస్థాన్ షిప్ యార్డు సిద్ధం చేసింది. కొరియన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ అసోసియేట్, భారతీయ పరిశ్రమ భాగస్వామి లోటస్ వైర్‌లెస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఈ టెక్నాలజీని హెచ్ఎస్ఎల్ రూపొందించింది. భారతీయ సముద్ర రంగానికి అత్యాధునిక హైడ్రోజన్ ఇంధన సెల్ టెక్నాలజీని పరిచయం చేసేందుకు ఇది తోడ్పడుతుందని హెచ్ఎస్ఎల్ వెల్లడించింది. 250 కేవీ నుంచి 2 ఎంవీ వరకు హైడ్రోజన్ ఇంధన బ్యాటరీల తయారీకి ఈ టెక్నాలజీ ఉపకరిస్తుందని ప్రకటించింది. పూర్తి సురక్షితంగా వివిధ సముద్ర ఉపకరణాలకు సరిపోయే రీతిలో ఇవి సిద్ధం చేసుకునే అవకాశం ఉందని వివరించింది. సంప్రదాయ డీజిల్‌తో నడిచే వ్యవస్థలకు స్థిరమైన ప్రత్యామ్నాయంగా గ్రీన్ హైడ్రోజన్ సాంకేతికత పని చేస్తుందని తెలిపింది. సముద్రపు పరికరాలకు వాటి అవసరాలకు సరిపడా ఈ గ్రీన్ హైడ్రోజన్ పవర్ ఉత్పత్తికి అవసరమైన సాంకేతికను అందిస్తామని హిందుస్థాన్ షిప్ యార్డు వెల్లడించింది.

పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన యువత: దీపక్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పరిశ్రమతో రాష్ట్ర యువతను మమేకంచేసే లక్ష్యంతో వారికి శిక్షణనిచ్చి మెరుగైన ఉపాధితో మంచి జీవితాలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన మరియు వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ (సీడ్ యాప్ సంస్థ) కృషి చేస్తుందని సంస్థ చైర్మన్ దీపక్ రెడ్డి గుణపాటి తెలిపారు. ఎన్టీఆర్ పరిపాలనా భవనంలోని సీడ్ యాప్ కార్యాలయంలో శుక్రవారం యువతకు శిక్షణ, ఉపాధిపై ఎనిమిది సెక్టార్ల వారితో సదస్సు నిర్వహించారు. దీపక్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించే వారికి శిక్షణ, నైపుణ్యం కలిగిన యువతను అందించేందుకు సీడ్ యాప్ సన్నద్ధంగా ఉందన్నారు. దీని వల్ల రాష్ట్రంలోని యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. భవిష్యత్‌లో పరిశ్రమల డిమాండ్లకు అవసరమైన వారి కోసం నైపుణ్యాభివృద్ధి కార్యకలాపాలను నిర్వహించడానికి ఇది సరైన సమయమన్నారు. సీడ్ యాప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా.కె.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ 2005 నుంచి వివిధ నైపుణ్యాభివృద్ధి పథకాలను రాష్ట్రంలో అమలు చేయడంలో సీడ్ యాప్ సంస్థ విజయవంతమైన చరిత్ర కలిగి ఉందన్నారు. కేంద్రం చొరవతో 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ' అమలులో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. శిక్షణ, నాలెడ్జ్ పార్ట్‌నర్‌షిప్ సహకారం కోసం సీడ్ యాప్ లెదర్, సెక్టార్ స్కిల్ కౌన్సిల్, ఫర్నీచర్, ఫిట్టింగ్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌తో అవగాహన ఒప్పందం జరిగింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.